అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 18-3-2023

సంపుటి : 09 | సంచిక : 76 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50





బీజేపీని గద్దెదించితేనే దేశానికి భవిష్యత్తు

రాజ్యాంగాన్ని రక్షిద్దాం... దేశాన్ని కాపాడుకుందాం

మోడీ ప్రభుత్వం వల్ల రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయి.

ప్రజా ఉద్యమాలపై మోడీ సర్కార్ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ఫెడరలిజంపై దాడి జరుగుతున్నది.

మోడీ నేతృత్వంలో మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ దోపిడీ కవలపిల్లలుగా అవతరించాయి.

నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారాలు మోపుతున్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం పన్ను రాయితీలు ఇస్తున్నది.

- సీతారాం ఏచూరి

- మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీ మోడీకి కవలలు
- లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజంపై దాడి
- ఈడీ, సీబీఐలకు ప్రతిపక్ష నాయకులే లక్ష్యం
- అదానీ అక్రమాలపై జేపీసీ ఎందుకు వేయడం లేదు
- ప్రత్యామ్నాయ విధానాలతోనే సమస్యలు పరిష్కారం
- అందరం కలుద్దాం, ప్రజాఉద్యమాలను బలపరుద్దాం
- గుడిసెవాసులకు పట్టాలిచ్చేదాకా ఎర్రజెండా పోరు
- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- వరంగల్‌లో అట్టహాసంగా జనచైతన్య యాత్ర ప్రారంభం

వరంగల్ నుంచి బొల్లె జగదీశ్వర్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి గద్దెదించితేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం వల్ల రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్రను శుక్రవారం వరంగల్‌లో ఆయన ప్రారంభించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఈ యాత్రకు నాయకత్వం వహిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మిల మెడలో ఎర్రజెండాలు వేసిన ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ మోడీ పాలనలో రాజ్యాంగ మూలస్థంభాలైన ఆర్థిక స్వావలంబన, లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజంపై దాడి జరుగుతున్నదని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని చెప్పారు. ప్రజాఉద్యమాలపై ...10లో

CPIM జన చైతన్య యాత్ర

జన చైతన్య యాత్రకు.. జన నీరాజనాలు

- వర్షాన్ని సైతం లెక్క చేయక..
- సపరివార సమేతంగా తరలొచ్చిన జనం

వివరాలు 5లో..

బీజేపీకి వ్యతిరేకంగా అన్ని శక్తులూ కలిసి పోరాడాలి : తమ్మినేని



అన్ని పార్టీల్లాగా బీజేపీ సాధారణ పార్టీ కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలం దేశానికే ప్రమాదకరమని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని శక్తులూ కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కులవ్యవస్థ ఉండాలనీ, కింది కులాల వారు చదువుకోవద్దనీ, ఆడవారికి స్వతంత్రత ఉండొద్దని మనువాదం ...10లో

కలిసే ముందుకు : కూనంనేని



ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఉద్యమాలు ఐక్యంగా చేసి, ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసే పరిస్థితి ఇకనుంచి ఉండబోదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి పనిచేయడం రాష్ట్రానికి, ప్రజలకు ఎంతో శుభపరిణామమని అన్నారు. చావైనా, బతుకైనా కలిసే ముందుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారిని ఖాళీ చేయిస్తే ఎర్రజెండా ప్రజలకు అండగా పోరాడుతుందని తెలిపారు. ఒకవేళ...10లో

స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు

రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా

- ప్రకటించిన సీఎం



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ...5లో

పలు జిల్లాలకు

ఆరెంజ్ హెచ్చరిక

రెండ్రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షసూచన

- అక్కడక్కడా వడగండ్లు పడే అవకాశం
- 150కి పైగా ప్రాంతాల్లో పడిన వర్షం

వివరాలు 5లో..



కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు రద్దు

గెజిట్ విడుదల చేసిన రక్షణ శాఖ

వివరాలు 5లో..

గ్రూప్- 1, ఏఈఈ, డీఏవో పరీక్షలు రద్దు

టిఎస్‌పిఎస్సి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టిఎస్‌పిఎస్సి ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్, ఏఈఈ, డిఏవో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్ సమర్పించిన నివేదికను పరిశీలించిన కమిషన్ శుక్రవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గ్రూప్ 1 పరీక్షను తిరిగి జూన్ 11న నిర్వహిస్తామని టిఎస్‌పిఎస్సి చైర్మన్ జనార్ధన్ రెడ్డి ప్రకటించారు.మిగిలిన రెండు పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఖరారైన పరీక్షల నిర్వహణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇటువంటి గందరగోళ పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహించడం మంచిది కాదని, వాటికి కూడా కమిషన్ త్వరలో కొత్త తేదీలు ప్రకటిస్తుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

సిట్ నివేదికలో కీలక అంశాలు

ప్రశ్నపత్రాల లీకేజీ కేసు దర్యాప్తులో ప్రాథమిక నివేదికను సిట్ అధికారులు టిఎస్‌పిఎస్సికి అందజేశారు. సిట్ నివేదికలో అధికారులు పలు కీలక విషయాలు వెల్లడించారు. ఈ నివేదిక అధారంగానే గతంలో నిర్వహించిన నాలుగు పరీక్షలను కమిషన్ రద్దు చేసింది. పేపర్ లీక్‌లో కీలక సూత్రధారి ప్రవీణ్‌తో సిస్టం అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ చేతులు కలిపాడని సిట్ పేర్కొంది. ఉద్దేశపూర్వకంగానే టిఎస్‌పిఎస్సీకి వచ్చిన రాజశేఖర్ పథకం ప్రకారమే ప్రవీణ్‌తో సంబంధాలు కొనసాగించాడు. రాజశేఖరే కంప్యూటర్‌ను హ్యాక్ చేసి పాస్‌వర్డ్ ...5లో

లీకేజీ కేసులో.. ఎట్టకేలకు నిందితుల కస్టడికి కోర్టు అనుమతి

వివరాలు 2లో..

పార్లమెంటులో ప్రతిపక్షాల సత్యాగ్రహం

మోదానీ సర్కార్ సిగ్గు, సిగ్గు అంటూ నినాదాల హోరు



న్యూఢిల్లీ : అదానీ కుంభకోణంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళనను ఉధృతం చేశాయి. గత నాలుగు రోజులుగా ప్రతిపక్షాలు ...5లో

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐకి సుప్రీం నోటీసులు

- కేంద్రం, తెలంగాణ సీఎంకు నోటీసులు అవసరం లేదు



న్యూఢిల్లీ : ఎమ్మెల్యే కొనుగోలు వ్యవహారంలో సీబీఐతో సహా 15 మంది ప్రతివాదులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అలాగే ప్రతివాదుల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ సీఎంకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరంలేదని పేర్కొంది. ఎమ్మెల్యేల ఎర కేసులో సిట్‌ను రద్దు చేస్తూ, కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ఏసీపీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తెలంగాణ తరపు న్యాయవాది దుష్యంత్ దవే ఇటీవల కోర్టు ఆదేశాలకు సంబంధించిన నోటీసులను ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, తెలంగాణ పోలీసులతో కూడిన సిట్ దర్యాప్తు కొనసాగిస్తుందా? అని ప్రశ్నించారు. ఇందుకు దవే బదులిస్తూ సిట్ దర్యాప్తును నిలిపివేసిందన్నారు. కేసులో తెలంగాణ సీఎం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసుల అంశాన్ని దవే ధర్మాసనం...5లో



వ్యక్తి చేసిన నేరాన్ని వ్యవస్థకి ఆపాదిస్తారా?

నిరుద్యోగుల జీవితాలతో రాజకీయాలు తగదు

- గుజరాత్‌లో 13సార్లు పేపర్లు లీక్ అయ్యాయి...
- మోడీని రాజీనామా కోరే ధైర్యం ఉందా?
- బండి సంజయ్‌కు మంత్రి కేటీఆర్ సవాలు
- లీకేజీ నిందితులు బీజేపీ యాక్టివ్ కార్యకర్తలే...

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

వ్యక్తి చేసిన నేరాన్ని వ్యవస్థలకు ఆపాదించి, నిరుద్యోగుల జీవితాలతో రాజకీయాలు చేయడం తగదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కే తారకరామారావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు హితవు చెప్పారు. గుజరాత్‌లో 13 సార్లు పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయనీ, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోడీని రాజీనామా కోరే ధైర్యం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి ఉందా అని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌వి అజ్ఞానపు వ్యాఖ్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల పనితీరు, వ్యవస్థల గురించి కనీస అవగాహన కూడా ఆయనకు లేదనీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ శాఖ కాదనీ, అదో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర...5లో



అన్ని పరీక్షలూ రీషెడ్యూల్ 5లో..

మరొక ప్రశ్నాపత్రం లీకేజీతో అసోం సర్కారు నిర్ణయం

బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలి

జనచైతన్య యాత్రలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్

- తెలంగాణ మొత్తం తిరగాలని సీపీఐ(ఎం) నేతలకు విజ్ఞప్తి
- ప్రజలలో చైతన్యం రగిలించేందుకు యాత్రలు : తమ్మినేని





నవతెలంగాణ- మహబూబాబాద్

దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ భవిష్యత్తులో రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీని ఓడించేందుకు బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధన శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జనచైతన్య యాత్ర సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ , సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పాలడుగు భాస్కర్ , సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి మాట్లాడారు.

ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడారు. బీజేపీ 8 ఏండ్ల కాలంలో కార్పొరేట్ విధానాలతో మతతత్వ రాజకీయాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని అన్నారు. సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర తెలంగాణ మొత్తం తిరగాలని, ప్రజలను చైతన్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కావాలని పోరాడిన కేసీఆర్ కూతురు కవితపై ఈడీలను ప్రయోగించి అవమానాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలు మేలుకొని బీజేపీకి వ్యతిరేకంగా తిరగబడాలని పిలుపునిచ్చారు రైల్వేలు, ఎల్ఐసిలు, ఓడరేవులు, బ్యాంకులు, బొగ్గు గనులను ప్రయివేటుపరం చేసి భవిష్యత్తులో రిజర్వేషన్లు తొలగించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు.

బీజేపీకి వ్యతిరేకంగా తెలంగాణలో అన్ని పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజలకు 50 లక్షల ఆసరా పింఛన్లు ఇస్తున్నామని, రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్తు ఇస్తున్న ఘనత కేసీఆర్‌దేనని అన్నారు తెలంగాణ విభజన హామీలైన ఉక్కు పరిశ్రమ గిరిజన యూనివర్సిటీ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంలో బీజేపీ వైఫల్యం చెందిందని అన్నారు తెలంగాణలో పోడు రైతులందరికీ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు మతోన్మాద ఫాసిస్ట్ కార్పొరేట్ విధానాలతో 2024లో అధికారంలోకి రావడం కోసం బీజేపీ చేస్తున్న కుట్రలను ఎండగట్టి ప్రజలను చైతన్యం చేస్తూ బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేయడమే లక్ష్యంగా ప్రజలలో చైతన్యం రగిలించేందుకు జన చైతన్య యాత్రలు చేపట్టినట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు.

కాళేశ్వరంపై కేంద్రం తప్పుడు ప్రచారం

- మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- వరుస ట్వీట్లతో నిరసన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఖండించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్రం చేసిన ప్రకటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం చేస్తున్న ప్రచారం అవాస్తవమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసిందని గుర్తు చేశారు. రాజకీయ కక్షతోనే తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వడం లేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని రెండు ప్రాజెక్టులకు మాత్రం జాతీయ హోదా కల్పించారని పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి కేంద్రం వివక్షను ప్రశ్నిస్తూ వరుస ట్వీట్లు చేశారు. ఈ ట్వీట్లకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రానికి చేసిన వినతిపత్రాలను సైతం జతపరిచారు.

ట్వీట్ - 1

కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదన్న కేంద్రమంత్రి బిశ్వేశర్ తుడు వ్యాఖ్యలు అవాస్తవం. జాతీయ హోదా కల్పించాలని కోరుతూ సీఎం కేసీఆర్, నాడు ఇరిగేషన్ శాఖ మంత్రిగా నేను ఎన్నోసార్లు ప్రధానికి, జలశక్తి శాఖ మంత్రికి వినతి పత్రాలు ఇచ్చాం. వాస్తవాలను దాచిపెట్టి పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి చేసిన ప్రకటన సభను, ప్రజలను తప్పుదోవ పట్టించేదిగా ఉన్నది.

ట్వీట్ - 2

కేంద్రం మంత్రి చెప్పినట్టుగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అన్ని రకాల అనుమతులు ఇచ్చింది. కేంద్ర జలశక్తి శాఖకు చెందిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు సైతం వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ట్వీట్ - 3

2018లో టీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరానికి జాతీయ హోదాపై పార్లమెంటులో ప్రశ్నించగా నాటి జలశక్తి శాఖ మంత్రి నితిన్ గడ్కరి స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి సమీప భవిష్యత్తులో ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇచ్చే ఆలోచన లేదని పేర్కొన్నారు. కానీ ఈ ప్రకటనకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలైన కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు, మధ్యప్రదేశ్ లోని కెన్ - బెట్వా ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది. తెలంగాణ ప్రతిపాదనను మాత్రం పక్కన పెట్టింది. ఇది తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ రాజకీయ వివక్షకు నిదర్శనం.

ట్వీట్ - 4

కేడబ్ల్యూడీటీ-2 కేటాయింపులపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న సమయంలోనే అప్పర్ భద్ర ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు ఇచ్చింది. న్యాయవిచారణ పూర్తికాకముందే కేంద్ర ప్రభుత్వం ఏకంగా జాతీయ హోదా సైతం ప్రకటించింది. కానీ అన్ని రకాల అనుమతులు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా హోదా ఇవ్వలేదు. ఇది రాజకీయ కక్ష కాదా?

బ్లూ స్టార్ నుంచి నూతన శ్రేణీ డీప్ ఫ్రీజర్లు

- 2025లో శ్రీసిటీలో వాణిజ్య ఏసీల తయారీ

రూ.8200 కోట్ల టర్నోవర్ లక్ష్యం :ఎండీ త్యాగ రాజన్ వెల్లడి



హైదరాబాద్ : ప్రముఖ ఎయిర్ కండీషనింగ్, వాణిజ్య రిఫ్రిజిరేషన్ సంస్థ బ్లూ స్టార్ నూతన శ్రేణీ డీప్ ఫ్రీజర్లను విడుదల చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో వీటిని ఆ సంస్థ ఎండీ త్యాగరాజన్, కమర్షియల్ రిఫ్రిజిరేషన్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా త్యాగ రాజన్ మీడియాతో మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని వాడా ప్రాజెక్టులో అంతర్జాతీయ స్టాండర్డ్స్‌తో వీటిని తయారు చేశామన్నారు. 50 లీటర్ల నుంచి 600 లీటర్ల సామర్థ్యం కలిగిన డీప్ ఫ్రీజర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో కొన్నిటినీ రీడిజైన్ చేయగా.. కొన్నిటిని కొత్తగా రూపొందించామన్నారు. వీటన్నిటీ తమ సొంత ఆర్అండ్‌డీ సెంటర్‌లోనే అభివృద్ధి చేశామన్నారు. వీటి ధరలు రూ.15వేల నుంచి ప్రారంభమవుతాయన్నారు. శ్రీసిటీలోని ప్లాంట్‌లో తొలి దశలో రూ.350 కోట్ల పెట్టుబడుల వ్యయంతో 2023 జనవరి నుంచి గృహ ఏసీలను తయారు చేస్తున్నామన్నారు. రెండో దశలో మరో రూ.200 కోట్ల పెట్టుబడులకు ప్రణాళికలు వేశామన్నారు. ఈ ప్లాంట్‌ను మరింత విస్తరించడానికి రూ.500 కోట్లతో మరో 40 ఎకరాలు కొనుగోలు చేశామన్నారు. 2025 నుంచి ఇక్కడ వాణిజ్య ఏసీలను తయారీని ప్రారంభించనున్నామన్నారు. విస్తరణలో భాగంగా 8,000 టచ్ పాయింట్లను 10వేలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8200 కోట్ల టర్నోవర్‌ను సాధించాలన్న లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. గడిచిన 2021-22లో రూ.6045 కోట్ల రెవెన్యూ నమోదు చేశామన్నారు. ఏసీ పరిశ్రమ ప్రతీ ఏడాది 15 శాతం పెరుగుతుండగా.. బ్లూ స్టార్ 20-25 శాతం మధ్య వృద్ధిని సాధిస్తుందన్నారు.

సీఐఐ సదరన్ ఛైర్‌పర్సన్‌గా కమల్ బలి

- డిప్యూటీ ఛైర్మెన్‌గా నందిని





హైదరాబాద్ : సీఐఐ సదరన్ రీజియన్ నూతన ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. 2023-24 ఏడాదికి గాను వాల్వో గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, ఎండీ అయినా కమల్ బలిని ఛైర్మెన్‌గా నియమితులయ్యారు. ఇంతక్రితం ఆయన డిప్యూటీ ఛైర్మెన్‌గా ఉన్నారు. చంద్రా టెక్స్‌టైల్స్ ఎండీగా ఆర్ నందిని నూతన డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందిని సీఐఐలో కీలక సభ్యురాలిగా ఉన్నారు. గ్రామీణాభివృద్ధి , వరుస కూలీలపై సీఐఐ నేషనల్ కౌన్సిల్ టాస్క్ ఫోర్స్‌కు ఆమె ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2010-11కు గాను ఆమె సీఐఐ తమిళనాడు ఛైర్‌పర్సన్‌గా పని చేశారు.

వచ్చే దశాబ్దం భారత్‌దే : సంజీవ్ బజాజ్

వచ్చే దశాబ్ద కాలం భారత్‌దేనని సీఐఐ ప్రెసిడెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సీఐఐ సదరన్ రీజియన్ నిర్వహించిన "ఇండియన్ ఇండస్ట్రీ 100" ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే 25 ఏండ్లలో భౌతిక , డిజిటల్ మౌలికవసతులు, వాతావరణ మార్పులు అనేక వ్యాపారాలను ప్రభావితం చేయనున్నాయన్నారు. కొత్త ఆలోచనలు అందిపుచ్చుకోకపోతే అనేక వ్యాపారాలు మూతపడనున్నాయన్నారు. అమెరికన్ బ్యాంక్‌ల సంక్షోభం భారత బ్యాంక్‌లపై పెద్దగా ప్రభావం చూపక పోవచ్చన్నారు.

ఎయిరిండియాలో రెండో దఫా వీఆర్ఎస్

న్యూఢిల్లీ : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా (ఏఐ)లో రెండో దఫా స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని (వీఆర్ఎస్) ప్రకటించారు. నాన్ ఫ్లయింగ్ సిబ్బందికి దీన్ని వర్తింపజేయనున్నట్టు ఆ కంపెనీ తెలిపింది. 40 ఏండ్లు పైన కలిగిన వారు ఐదేండ్ల సర్వీసు కలిగిన వారు విఆర్ఎస్‌ను ఎంచుకునే అవకాశం కల్పించింది. శాశ్వత జనరల్ కేడర్‌కు చెందిన ఉద్యోగులతో పాటుగా నైపుణ్యం లేని కేటగిరీలకు చెందిన సిబ్బందికి ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రస్తుతం ఫ్లయింగ్, నాన్ ఫ్లయింగ్ కలిపి మొత్తం 11 వేల మంది ఎయిరిండియాలో పనిచేస్తున్నారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 30 వరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎఐ తెలిపింది. వీఆర్ఎస్‌కు 2,100 మంది అర్హులుగా ఉన్నారని పేర్కొంది.

ఆందోళన వద్దు, అప్రమత్తంగా ఉందాం..

- కోవిడ్ వాక్సిన్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వద్దు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో వాక్సిన్లను అందుబాటులో ఉంచాలి
- రాష్ట్రానికి మరిన్ని డోసులు సరఫరా చేయాలి
- కేంద్రానికి లేఖ రాస్తాం.. : మంత్రి హరీశ్
- కరోనా పరిస్థితులపై సమీక్ష



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతన వేరియంట్ల నేపథ్యంలో పలు దేశాలు, రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. అయితే రాష్ట్ర ప్రజలు కోవిడ్ గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇదే సమయంలో కరోనాపట్ల అవగాహనతో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కోవిడ్ కేసుల పెరుగుదల నేపథ్యంలో హరీశ్ రావు వైద్యాధికారులతో శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల వైద్యాధికారులతో చర్చించి, పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వివిధ రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, అయితే అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని చెప్పారు. దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటి కోవిడ్ లక్షణాలు ఉన్న వారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. కొవిడ్ వ్యాక్సినేషన్లో తెలంగాణ దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందనీ, ప్రికాషన్ డోసును పంపిణీ చేయడంలో మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 7.75 కోట్ల వ్యాక్సిన్లను అర్హులైన వారికి అందించామని తెలిపారు. 1.35 కోట్ల ప్రికాషన్ డోసులు పంపిణీ చేశామనీ, ఇంకా 1.62 కోట్ల డోసులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కోవిడ్ నుంచి తమను తాము రక్షించుకోవడంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా మరిన్ని డోసులు ఇవ్వాలని కేంద్రానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని, ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అర్హులైన వారు తమ వంతుగా వ్యాక్సిన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూమ్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షలో ఆరోగ్య కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఇ రమేష్ రెడ్డి, డీహెచ్ శ్రీనివాస రావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్క్

- మరో ఆరు రాష్ట్రాలకు పార్క్‌లు
- ప్రకటించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ . తెలంగాణలో పీఎం మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించారు. తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాలు తమిళ నాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని ట్విట్టర్‌లో తెలిపారు. అవి 5ఎఫ్ (ఫార్మ్ ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్) విజన్ ప్రేరణకు అనుగుణంగా వస్త్రాల రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తాయని ప్రధాని మోడీ తెలిపారు. పీఎం మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కులు వస్త్ర రంగాని కి అత్యాధునిక మౌలిక సదుపాయాలను సమకూర్చి, కోట్ల పెట్టుబడిని ఆకట్టుకోవడంతో పాటు లక్షల కొద్దీ ఉద్యోగాలను కూడా కల్పిస్తాయని ఆయన అన్నారు "పీఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కు లు వస్త్ర రంగాని కి అత్యాధునికమైనటువంటి మౌలిక సదుపాయాల ను అందిస్తాయి. ఇది 'మేక్ ఇన్ ఇండియా' కు, 'మేక్ ఫార్ ద వరల్డ్' కు ఒక గొప్ప ఉదాహరణ అవుతుంది" అని పేర్కొన్నారు

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు 13 రాష్ట్రాల నుంచి 18 ప్రతిపాదనలు వచ్చాయనీ, అందులో ఏడు ప్రతిపాదనలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలును కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోందనీ, అలాగే ఈ పార్కుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జౌళి మంత్రిత్వ శాఖ ఒక్కో గ్రీన్‌ఫీల్డ్ పార్క్‌కు రూ.500 కోట్లు, గ్రౌండ్‌ఫీల్డ్ పార్క్‌కు రూ.200 కోట్ల వరకు డెవలప్‌మెంట్ క్యాపిటల్ సపోర్టు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని అన్నారు. అలాగే సత్వర అమలుకు ఒక్కో పార్క్‌కు రూ.300 కోట్లు పోటీ ప్రోత్సాహక మద్దతు (సీఐఎస్) అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం 1000 ఎకరాలు భూమిని ఇవ్వాలని, విద్యుత్ సరఫరా, నీటి లభ్యత, వ్యర్థ జలాల తొలగింపు వ్యవస్థ, సమర్థవంతమైన సింగిల్ విండో క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో వరంగల్‌లో ఈ పార్క్‌ను గ్రౌండ్ ఫీల్డ్ పార్క్‌గా అభివృద్ధి చేయనున్నారు.

మేకలు, గొర్రెలపై విస్తృత పరిశోధనలు జరగాలి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో మేకలు, గొర్రెలపై విస్తృత పరిశోధనలు చేయాల్సిన అవసరముందని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధనకార్యదర్శి ఉడుత రవిందర్ సూచించారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మథుర జిల్లా ఫరాలోని కేంద్ర మేకల పరిశోధనా కేంద్రం (సీఐఆర్‌జీ) నిర్వహించిన పరిశ్రమలు, సైంటిస్టులు, రైతుల ముఖాముఖి కార్యక్రమంలో సీఐఆర్‌జీ ఆహ్వానంమేరకు ప్రతినిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జీవాల సంపద పెరిగినందున కేంద్రం గొర్రెలు లేదా మేకల పరిశోధన కేంద్రాన్ని తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయంగా గొర్రెల పెంపకంలో ఉన్న గొల్ల, కురుమలు గొర్రెలు, మేకలను పెంచుతున్న వారి సమస్యలను చర్చించినట్టు తెలిపారు. ప్రధానంగా విస్తృత మేపుపద్ధతి (బయట మేపడం)లో జీవాలను పెంచుతుండడంలో ప్రస్తుతం మేత భూములు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవాల మేతకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీని నుంచి రక్షించుకునేలా పాక్షిక సాంద్రపద్ధతిలో మేపుకునేలా ప్రభుత్వం, పరిశోధనా సంస్థలను పెంపకందారులను చైతన్యం చేయాలన్నారు. ఐసీడీఎస్ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు చిన్నపిల్లలకు పౌష్టికాహారం ఇస్తున్నట్టు జీవాలకు కూడా దాణా, మినరల్ మిక్సర్ లాంటివి అందించాలని కోరారు. మేకల్లో వచ్చే డెక్కవాపు, దొబ్బరోగం లాంటి వ్యాధికి సంబంధించిన టీకాలు కావాలని ఇవ్వాలని కోరారు. అలాగే ఉమ్మడి టీకాలుగా తీసుకురావాలన్నారు. మాంసానికి, పాలకు డిమాండ్ ఉన్నందున అధిక మాంసం, అధిక పాలను ఉత్పత్తి చేసే సంకర జాతులపై పరిశోధనలు పెంచాలని కోరారు. తద్వారా ఉత్పాదక పెంచి వినియోగానికి సరిపడా ఉత్పత్తి సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 11 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లీకేజీ కేసులో.. ఎట్టకేలకు నిందితుల కస్టడికి కోర్టు అనుమతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో నిందితుల కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. నిందితులను 10రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ కొద్ది రోజులముందు బేగంబజార్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు 9మంది నిందితులను ఆరురోజులపాటు పోలీసు కస్టడీకి శుక్రవారం కోర్టు అనుమతించింది. ప్రస్తుతం చంచల్‌గూడ, చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులను శనివారం ఉదయం 10:30 గంటలకు సిట్ అధికారులు కస్టడీకి తీసుకునే అవకాశముంది. కస్టడీకి తీసుకుని ఇన్వెస్టిగేషన్‌ను సీరియస్‌గా చేయనున్నారు. ఇప్పటికే విచారణకు సంబంధించి పలు ప్రశ్నల జాబితాను సిట్ అధికారులు సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. ముందుగా 9 మందిని వేర్వేరుగా ప్రశ్నించనున్నారు. వారు చెప్పే సమాధానాలపై మరింత లోతుగా దర్యాప్తు చేసి ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన కీలక ఆధారాలు సేకరించాలని సిట్ అధికారులు భావిస్తున్నారు.

అన్ని విషయాలు తేల్చనున్న సిట్

ఇన్వెస్టిగేషన్ సీరియస్‌గా చేయనున్న సిట్ అధికారులు రాజశేఖర్‌కు రాజకీయ నాయకుల సంబంధాలపై ఆరా తీయనున్నారు. రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కలిసి లక్ష్మిని ట్రాప్ చేసి పాస్‌వర్డ్, ఐడీలను దొంగలించి పేపర్లను కాపీ చేసినట్టు సిట్ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. అయితే లీక్ చేసిన పేపర్స్‌ను ప్రవీణ్ ఎవరెవరికి ఇచ్చారన్నదానిపై విచారణ చేయనున్నారు. ప్రవీణ్, రాజశేఖర్, మరికొందరి ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించిన విషయం తెలిసిందే. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా మరింత లోతుగా విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిందితులను అన్ని కోణాల్లో విచారిస్తామని, ఈ దర్యాప్తులో అన్ని విషయాలు తేలనున్నాయని ఓ సీనియర్ పోలీస్ అధికారి అభిప్రాయపడ్డారు.

డిప్యూటేషన్‌పై వచ్చిన రాజశేఖర్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారి రాజశేఖరే అని సిట్ అధికారులు టీఎస్‌పీఎస్సీకి నివేదిక సమర్పించినట్టు తెలుస్తోంది. గతంలో టెక్నికల్ సర్వీస్‌లో పనిచేసిన రాజశేఖర్.. ఉద్దేశపూర్వకంగానే డిప్యూటేషన్‌పై వచ్చి వ్యవహారం నడిపినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. ఇదిలా ఉండగా ప్రవీణ్‌కు గ్రూప్ 1 పరీక్షలో 102 మార్కులు రావడంపై కూడా సిట్ అధికారులు దృష్టి సారించారు. ఇక ఎన్ని ప్రశ్నాపత్రాలు లీక్ చేశారనే విషయాలు మాత్రం సిట్ దర్యాప్తులో తేలనుంది.

35 లిఫ్ట్ స్కీములకు ప్రతిపాదనలు

- ప్రభుత్వ అనుమతి తరువాతే ముందుకు : ఐడీసీ ఛైర్మెన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఉన్నా కూడా ఎత్తుప్రదేశాల్లో ఉండి సాగునీరందని ఆయకట్టు కోసం 35 ఎత్తిపోతల పథకాలకు ప్రతిపాదనలు వచ్చాయనీ, వాటన్నింటినీ సీఎం కేసీఆర్ దష్టికి తీసుకెళ్లిన అనంతరం చర్యలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఐడీసీ) ఛైర్మెన్ పి.వేణుగోపాలాచారి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఐడీసీ కార్యాలయంలో ఛైర్మెన్ అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఐడీసీ పరిధిలోని ఎత్తిపోతల పథకాల పురోగతి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పనులపై ప్రధానంగా చర్చించారు. అనంతరం ఛైర్మెన్ వేణుగోపాలాచారి మాట్లాడుతూ నాబార్డ్, ఏఐబీపీ, రాష్ట్ర బడ్జెట్ మొత్తంగా కలిపి ప్రభుత్వం 2022-23 బడ్జెట్‌లో మొత్తంగా రూ.269.54కోట్లను ఐడీసీకి కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం 538 ఎత్తిపోతల స్కీముల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.69లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నదని చెప్పారు. అలాగే రూ.743.19కోట్లతో చేపట్టిన మరో 37 పథకాలు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆ పనులు పూర్తయితే మరో 65వేల ఎకరాలకు సాగునీరందనుందని తెలిపారు. అవి గాకుండా ప్రభుత్వం అనేక సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నదని గుర్తుచేశారు. అయినా పలు ప్రాంతాల్లో ఎత్తుప్రాంతాల్లో ఉన్న ఆయకట్టుకు ఆయా ప్రాజెక్టుల ద్వారా సాగునీరందని పరిస్థితి ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ గ్యాప్ ఆయకట్టుకు సైతం సాగునీరందించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు 35ఎత్తిపోతల స్కీములను ఐడీసీ ఎదుట ప్రతిపాదించారని వివరించారు. వాటన్నింటిపైనా సమావేశంలో చర్చించామని తెలిపారు.

గన్‌పార్కు వద్ద ఉద్రిక్తం

- నిరసన దీక్షకు అనుమతిచ్చినా బండి ఓవరాక్షన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలనీ, మంత్రి కేటీఆర్‌ను మంత్రిమండలి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్కు(తెలంగాణ అమరవీరుల స్తూపం) వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. వాస్తవానికి ఆయన గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించి తన నిరసన దీక్షను బీజేపీ కార్యాలయంలో చేపడతానని గురువారం ప్రకటించారు. శుక్రవారం ఆయన బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి బీజేపీ ఆఫీసు నుంచి గన్‌పార్కు వరకు పాదయాత్రగా వెళ్లారు. అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించి అక్కడే దీక్షకు దిగుతున్నట్టు ప్రకటించారు. అనుమతి లేదని పోలీసులు వారించారు. అయినా, బండి మొండిపట్టు పట్టడంతో పోలీసులు ఓకే చెప్పారు. నిరసన దీక్ష ముగింపు సందర్భంగా మాట్లాడే సమయంలో టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయాన్ని ముట్టడికి వెళ్లబోతున్నట్టు బండి సంజయ్ ప్రకటించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు బండి, ఈటల రాజేందర్, పలువురు నేతలను అరెస్టు చేశారు. వారిని తరలించకుండా బీజేపీ కార్యకర్తలు రోడ్డుపై బైటాయించారు. ఈ క్రమంలోనే పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అక్కడ జరుగుతున్న పరిణామాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై మఫ్టీలోని పోలీసులు తమ ప్రతాపాన్ని చూపుతూ తోసేశారు. ఈ క్రమంలోనే సాక్షి ఫొటోగ్రాఫర్ రాజేశ్, వెలుగు ఫొటోగ్రాఫర్ సురేశ్‌రెడ్డిలతో పాటు నలుగురు కెమెరామెన్‌లు గాయాలపాలయ్యారు. ఫొటో జర్నలిస్టులు, కెమెరామెన్‌లపై మఫ్టీలోని పోలీసులు దాడి చేయడాన్ని టీడబ్ల్యూజేఎఫ్ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడులకు పాల్పడటం సరిగాదని పేర్కొన్నారు.

దావణగెరెకు కొత్త సూపర్ లగ్జరీ సర్వీస్

- ప్రారంభించిన టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రయాణికుల సౌకర్యార్థం కర్ణాటకలోని దావణగెరెకు కొత్త సూపర్ లగ్జరీ సర్వీస్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి దావణగెరెకు ప్రతి రోజు సాయంత్రం 06.40 గంటలకు ఈ బస్సును నడుపుతోంది. ఈ కొత్త సర్వీస్ కేపీహెచ్‌బీ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ , ఎంజీబీఎస్, మహబూబ్ నగర్, రాయచూరు, సింధనూరు, గంగావతి, హొస్పేట్ మీదుగా వెళ్తుంది. దావణగెరె నుంచి ప్రతి రోజు సాయంత్రం 06.00 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది.

హిందూత్వ ఎజెండాతో

సమాఖ్య స్ఫూర్తికి భంగం

కేయూ సెమినార్‌లో.. సీతారాం ఏచూరి

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం : బోయినిపల్లి వినోద్‌కుమార్



కెయులో 'ఛేంజింగ్ సినారియో ఆఫ్ ఫెడరలిజమ్' సింపోజియంలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం హిందూత్వ ఎజెండాతో దేశ సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లుతుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. శుక్రవారం హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాలులో యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ తాటికొండ రమేష్ అధ్యక్షతన పీవీ నర్సింహారావు విజ్ఞాన కేంద్రం నిర్వహించిన 'చేంజింగ్ సినారియో ఆఫ్ ఫెడరలిజమ్' అంశంపై జరిగిన సింపోజియంలో ముఖ్య అతిథిగా సీతారాం పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని హిందుత్వ రాష్ట్రంగా చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. అందుకే ఒకే భాష, ఒకే పన్ను, ఒకే ఎన్నిక అంటూ నినాదాలిస్తోందని తెలిపారు. భారత రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జాబితాలను రూపొందించి వివిధ శాఖలను కేటాయించడం జరిగిందన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరిట రాష్ట్రాల సమ్మతి లేకుండా అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. సీఏబీఈ(సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్) అనే సంస్థ విద్యారంగంలో చేసే మార్పులను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి విధాన నిర్ణయాలు చేయాల్సి ఉన్నా ఆ సంస్థ ఆ మేరకు పనిచేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల భాషలపై వివక్ష ప్రదర్శిస్తుందని, ఇది సరైంది కాదన్నారు. రాజ్యాంగంలోని నాలుగు స్తంభాల్లో ముఖ్యమైన సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్రం భాగస్వామ్యంతోనే సమాఖ్య మనుగడ సాధ్యమని స్పష్టంచేశారు. వివిధ కమిషన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై చాలా సిఫార్సులు చేశాయని, వాటిని అమలు చేయకపోవడం వల్లే సమాఖ్యకు ప్రమాదం ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈడి 5,542 కేసులను నమోదు చేసినా, 0.5 శాతం కేసులు మాత్రమే నిరూపితమవుతున్నాయన్నారు. ఈ కేసులను నిరూపించడానికి ప్రయత్నించడం లేదన్నారు. దీనికి తెర వెనుక రాజకీయ కారణాలే మూలమని తెలిపారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్యానికీ ప్రమాదం ఏర్పడిందన్నారు. రాష్ట్రాల శాసన వ్యవహారాల్లో గవర్నర్ల జోక్యం పెరిగిందన్నారు. రాష్ట్రాల హక్కులపై కేంద్ర పెత్తనం పెరిగిందన్నారు. ఆర్టికల్స్ సవరణ చేయడానికి సమయం ఇవ్వాలే తప్పా పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. ఆహార పదార్థాలపై జీఎస్టీ వేయడం సరైంది కాదన్నారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఉప్పుపై ఆంగ్లేయులు పన్ను వేస్తే మహాత్మాగాంధీ దండి మార్చ్ నిర్వహించారని గుర్తు చేశారు. జీఎస్టీతో రాష్ట్రాలు కేంద్రం వద్ద బిక్షాటన చేసే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసన వ్యవహారాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం జోక్యం పెరిగిందన్నారు. ఇప్పటి వరకు జాతీయ బ్యాంకులను దోచుకున్నారని, ఇప్పుడు సహకార బ్యాంకుల వంతొచ్చిందని విమర్శించారు. ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక విలువ అని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో అందించారన్నారు.



రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం

రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మెన్ బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం కూల్చి వేస్తే ప్రజా ఉద్యమం వచ్చిందని, దాంతో కేంద్రం తలవంచక తప్పలేదని గుర్తు చేశారు. ప్రజల ఒత్తిడితో ఏదైనా సాధ్యమేనన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు రాష్ట్రాలపై పెత్తనం చేయలేదని, కేంద్రంలో ఏకపార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసే బిల్లు నేటికీ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఆ బిల్లును వెనక్కి పంపడం లేదు, ఆమోదముద్ర వేయడం లేదని తెలిపారు. ఈ బిల్లును ప్రవేశపెడితే యూనివర్సిటీలలో రిక్రూట్ మెంట్‌ను త్వరితగతిన చేసు కునే అవకాశ ముందన్నారు. విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ బిల్లు గురించి గవర్నర్‌కు వివరించి వచ్చినా గవర్నర్ స్పందించడం లేదని, ఈ క్రమంలోనే దురదృష్టవశాత్తు ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్రం చేసే అప్పులు జాతీయ బ్యాంకుల నుంచి మాత్రమే తీసుకుంటుందన్నారు. కేవలం మూల ధన వ్యయం కోసమే ఈ అప్పులు చేయడం జరుగుతుందని, నీటిపారుదల ప్రాజెక్టులు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ నిధులను వినియోగిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీసీ తాటికొండ రమేష్, సీతారాం ఏచూరికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– బోయినిపల్లి వినోద్‌కుమార్

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష రాసేందుకు 5,02,018 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 4,81,759 మంది హాజరయ్యారని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మొత్తం 20,259 మంది విద్యార్థులు(4 శాతం) గైర్హాజరు అయ్యారని పేర్కొంది. ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు 'బి' సెట్ పరీక్షా పత్రాన్ని ఎంపిక చేసినట్టు తెలిపింది.

ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



నవతెలంగాణ - భువనగిరి

కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్-మతోన్మాద అనుకూల విధానాలపై ఏప్రిల్ 5న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ పిలుపునిచ్చారు.. శుక్రవారం యాదాద్రి భువనగిరిజిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మోడీ సర్కార్ కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ దేశీయ వ్యవసాయ రంగాన్ని, రైతాంగ భవితవ్యాన్ని తాకట్టు పెడుతోందన్నారు. నూతన వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సంస్కరణ బిల్లుతో వ్యవసాయాన్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతుందని విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించి నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. పని దినాలు 200 పెంచి కనీస వేతనం రూ.600గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలను నియంత్రించకుండా రోజు రోజుకూ ప్రజలపై పెను భారాలు మోపుతుందని ఆరోపించారు. రాజ్యాంగ సంస్థలను ఉపయోగిం చుకుని మతం పేరుతో మనుషుల మధ్య వైషమ్యాలు సృష్టిస్తోందన్నారు. బీజేపీ ప్రకటించిన అభివృద్ధి నినాదం కారుమబ్బులా కరిగిపోయిం దన్నారు. ఈ పరిస్థితుల్లో దేశానికి వెన్నెముకగా ఉన్న రైతు పారిశ్రామిక ప్రగతికి సంపద సృష్టిలో రేయింబవళ్లు చెమటోడుస్తున్న కార్మికుల కష్టజీవుల డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోల్లు యాదగిరి, కొండమడుగు నర్సింహ, నాయకులు గొరిగె సోములు, రాములమ్మ, కుమారి, కందాటి సత్తిరెడ్డి, కోట రామచంద్రా రెడ్డి, మొగిలి పాక గోపాల్,కూరెళ్ళ నర్సింహ,బొడ్డుపల్లి వెంకటేశం, పోతరాజు జహంగీర్, గాడి శ్రీను,గోపాల్, మారయ్య పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి విజయం

- ఎలిమినేషన్ రౌండ్‌తోనే తేలిన ఫలితం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్- రంగారెడ్డి - హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఎన్నికల సంఘం నిర్ణయించిన మ్యాజిగ్ ఫిగర్ 12,709 ఓట్లు రాకపోవడంతో చేపట్టిన ఎలిమినేషన్ రౌండ్‌తో ఫలితం వచ్చింది. ఈ నియోజకవర్గంలో 29,720 ఓట్లకుగాను 25,868 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 25,416 ఓట్లు మాత్రమే చెల్లాయి. 452 ఓట్లను చెల్లని ఓట్లుగా గుర్తించారు. వీటిలో ఏవీఎన్‌రెడ్డికి 7,505, గుర్రం చెన్నకేశవరెడ్డికి 6,584, పాపన్నగారి మాణిక్‌రెడ్డికి 4,569 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యతతోపాటు 20 ఎలిమినేషన్ రౌండ్‌తో ఎన్నికల సంఘం నిర్ణయించిన మ్యాజిక్ ఫిగర్ వచ్చింది. దీంతో ఎన్నికల అధికారులు ఏవీఎన్‌రెడ్డి గెలిచినట్టు ప్రకటించారు. అయితే ఏవీఎన్‌రెడ్డికి రెండో ప్రాధాన్యత ఓట్లు 5,931 వచ్చాయి. శుక్రవారం ఉదయం 3గంటలకు ఎలిమినేషన్ రౌండ్ పూర్తయింది. ఉదయం 3.45గంటలకు ఏవీఎన్‌రెడ్డి గెలిచినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

"ఐ ఆమ్ జాబ్ లెస్.."

- బతకడానికి ఏ కారణం లేదంటూ.. ఓ యువకుడు ఆత్మహత్య
- కంటతడి పెట్టిస్తున్న సూసైడ్ నోట్
- సిరిసిల్ల బీవై నగర్‌లో విషాదం



(ఫైల్)

నవతెలంగాణ - సిరిసిల్ల

"నాకు ఉద్యోగం లేదు.. నా వల్ల ఎవరికీ ఉపయోగం లేదు.. నేను బతకడానికి కారణమే లేదంటూ.. ఉజ్వల భవిష్యత్ కోసం ఎన్నో కలలు కన్నా అవి కండ్ల ముందే ఆవిరి అయిపోవడంతో నిస్పృహకు లోనైన ఓ యువకుడు.. ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌కు చెందిన చిటికెన నాగభూషణం-సుశీల దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కొడుకు నవీన్ కుమార్(30) డిగ్రీ పూర్తి చేసాడు. ఇటీవల సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్టు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో చదివిన చదువుకు తగిన ఉద్యోగం లేదని మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో తన గదిలో ఉరివేసుకున్నట్టు తెలిపారు. నవీన్ కుమార్ రాసిన సూసైడ్ నోట్‌లో తాను బతకడానికి కారణాలేమి లేవంటూ, నా వల్ల ఎవరికి ఉపయోగం లేదు, జాబ్ లేదంటూ ప్రస్తావిస్తూ.. తన జీవితాన్ని ముగిస్తున్నానంటూ లేఖలో పేర్కొన్నాడు. ఈ సూసైడ్ పలువురిని కంటతడి పెట్టిస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. నవీన్ కుమార్ మరణంతో బీవై నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

మోడీ ఈడీ

"ఈడీ..." ఇప్పుడిది దేశంలో మోడీతో పాటే వినపడుతున్న మాట. ఇంకా చెప్పాలంటే "మోడీయే ఈడీ - ఈడీయే మోడీ" అన్న చందంగా ఇవి ఒకదానికొకటి పర్యాయ పదాలుగా మారిపోయాయి. క్రమేణా ఈ రెండూ జతకూడి "మోడీ ఈడీ" అనే ఒకే పదంగా రూపాంతరం చెందాయి. అంతిమంగా ఇప్పుడీ పదం ప్రజల సరికొత్త అభివ్యక్తికి ప్రతీకగా వాడుకలోకొచ్చింది. ప్రతిపక్షాల చేతిలో ఓ పదునైన విమర్శకు ప్రాతినిధ్యం వహిస్తోంది. అందువల్ల ప్రస్తుతం దేశంలో ఏ ప్రాంతానికెళ్ళినా వినిపించే మాట "మోడీ ఈడీ". తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కవితపై విచారణ నేపథ్యంలో మన తెలంగాణలోనూ ఇది "మహ"పాపులారిటీ సాధించింది. నేడు ఈ "మోడీ ఈడీ" దాడులంటూ లేని రాష్ట్రమూ, రాజకీయ విపక్షమూ లేదంటే అతిశయోక్తి కాదేమో!

> కవిత విషయంలో ఈడీ విచారణా తతంగమంతా కేవలం కేసీఆర్‌ను బలహీనపరిచే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. అయితే ఇక్కడ ఉద్దేశం కవిత నిర్దోషి అని చెప్పడం కాదు. నిజంగానే లిక్కర్ స్కామ్ జరిగిందా? జరిగితే అందులో కవిత పాత్ర ఉందా లేదా? అన్నవి తేలాల్సిన విషయాలే. కానీ ఆమెపై ఈడీని ప్రయోగించడం వెనుక గల రాజకీయ దురుద్దేశం మాత్రం ఓ బహిరంగ రహస్యం. అందువల్ల ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణలో రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలన్న కుతంత్రం తప్ప, అవినీతి పరులను పట్టుకోవాలన్న నిజాయితీ ఆవగింజంతైనా కనిపించదు.

దేశం నలుమూలలా తమ అధికార వాంఛ నెరవేర్చే ఆయుధంగా ఈడీని వాడుతోంది మోడీ సర్కార్. ఒక్క ఈడీ ఏం ఖర్మ... సమస్త దర్యాప్తు సంస్థల నుండి గవర్నర్‌ల వ్యవస్థ వరకూ ప్రతిదీ ఇందుకు సాధనమే. ప్రత్యర్థులను లొంగదీసుకోవడానికీ, ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడానికి వీటన్నిటినీ వాడుకోవడం ఒక విధానంగా సాగిస్తోంది మోడీ నేతృత్వం. నేడు దేశంలోని బీజేపీ ప్రభుత్వాలలో ప్రజలచే ఎన్నికైన వాటి కంటే ఇలా దొడ్డిదారిన ఏర్పాటు చేసుకున్నవే ఎక్కువ కావడం ఒక భౌతిక వాస్తవం. అయితే, ఈ దర్యాప్తు సంస్థల దాడులకు గురవుతున్నవారంతా నిర్దోషులేనని చెప్పలేం. కానీ, ఈ మోడీ కాలంలో ఈడీ లేదా ఇతర దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసుల్లో నేర నిరూపణ రేటు కేవలం 0.5శాతం మాత్రమే. అదే సమయంలో ఈ కేసుల్లో ఇరుక్కున్న అవినీతి నేతలనేకులు బీజేపీలో చేరితే రాత్రికి రాత్రే పునీతులు కావడం, లేదా దర్యాప్తులన్నీ ఉన్నఫలంగా నిలిచిపోవడం నిర్లజ్జగా జరిగిపోతోంది. ఇది మొదట్లో విస్తుగొలిపినా, ఆ తరువాత సర్వసాధారణంగా మారిపోయింది. అందుకే నిన్నగాక మొన్న అమిత్‌షా హైదరాబాద్ పర్యటనకు "వాషింగ్ పౌడర్ నిర్మా" అంటూ ఆసక్తికరమైన ప్రకటనలు స్వాగతం పలికాయి. వారితో చేరితే ఎంతటి అవినీతి మరకలైనా తొలగిస్తారన్నది వాటి సారాంశం. అవి ఏర్పాటు చేసింది ఎవరో, అందులో వారి ప్రయోజనమేమిటో తెలియదు గానీ, అవి ఇచ్చే సందేశం మాత్రం ఓ సత్యం. ఈ దాడుల లక్ష్యం అధికార విస్తరణ, ప్రత్యర్థులపై కక్షసాధింపే తప్ప, అవినీతిని నిర్మూలన ఎంత మాత్రమూ కాదనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?



ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్నది కూడా అదే. కవిత విషయంలో ఈడీ విచారణా తతంగమంతా కేవలం కేసీఆర్‌ను బలహీనపరిచే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. అయితే ఇక్కడ ఉద్దేశం కవిత నిర్దోషి అని చెప్పడం కాదు. నిజంగానే లిక్కర్ స్కామ్ జరిగిందా? జరిగితే అందులో కవిత పాత్ర ఉందా లేదా? అన్నవి తేలాల్సిన విషయాలే. కానీ ఆమెపై ఈడీని ప్రయోగించడం వెనుక గల రాజకీయ దురుద్దేశం మాత్రం ఓ బహిరంగ రహస్యం. అందువల్ల ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణలో రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలన్న కుతంత్రం తప్ప, అవినీతి పరులను పట్టుకోవాలన్న నిజాయితీ ఆవగింజంతైనా కనిపించదు. విపక్ష నేతల మీదే తప్ప స్వపక్ష నేతలపై ఎలాంటి దాడులూ దర్యాప్తులూ ఈ మోడీ కాలంలో ఎరుగం. కేవలం రాజకీయ ప్రయోజనాలే తప్ప, ఈ ఈడీ దాడుల్లో నైతికత మచ్చుకైనా కానరాదు. ఒకప్పుడు ఈడీలాంటి దర్యాప్తు సంస్థలు నేతలెవరిమీదైనా కేసులు నమోదు చేస్తే వారి అవినీతి గుట్టురట్టయిందని భావించేవారు. కొంతకాలం తరువాత ఈ కేసులు నిజమైనవా, లేక కక్షసాధింపు చర్యలా అన్న అనుమానాలు కలిగేవి. ఇక ఇప్పుడైతే ఇలాంటి చర్యలు కేవలం ప్రతీకార చర్యలు మాత్రమే అనుకునే స్థాయికి పరిస్థితులు మారాయి. ఇంతటి "ఘనతకు" అర్హుడు గనకనే ఈడీకి ముందు మోడీ చేరి, ఈడీ కాస్తా "మోడీ ఈడీ"గా చలామణీ అవుతోంది.

ఇటీవల హిండెన్‌బర్గ్ నివేదిక అదాని అవినీతి సామ్రాజ్యాన్ని కుప్పకూల్చినంత పనిచేసింది. అదానీ దేశాన్ని ఇంతగా దగా చేయగలిగాడంటే అందుకు ప్రధాని మద్దతే కారణమని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరగాలని పార్లమెంటు అట్టుడుకుతున్నా అది కంఠశోషగానే మిగిలిపోతోంది. లక్షల కోట్ల ప్రభుత్వ సొమ్మును అప్పులుగా అదానీకి కట్టబెట్టిన సర్కారు నిర్వాకంపైనా, అదానీ అవినీతిపైనా ఏ ఉలుకూ పలుకూ లేదు. చివరికి న్యాయస్థానం తనంతట తానే ఓ కమిటిని నియమిస్తే, వీరు మాత్రం అదానినీ ఎలా కాపాడాలా అని ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే క్రికెట్ ముసుగులో ఆస్ట్రేలియా ప్రధానిని రప్పించి ఊసులాడారని గుసగుసలు గట్టిగానే వినిపిస్తున్నాయి. తమకు అనుకూలురైతే రక్షించడం, ప్రతికూలురైతే శిక్షించడం... ఇప్పుడిదే బీజేపీ మార్కు ప్రజాస్వామ్యం! అవినీతికి ఆధారాలుంటే ఎవరిపైనైనా చర్యలు తీసుకోవాల్సిందే. కానీ అస్మదీయులకో న్యాయం, తస్మదీయులకో న్యాయం. అన్న చందాన వ్యవహరించడమే ఇప్పుడీ 'మోడీ ఈడీ' చెపుతున్న న్యాయం! ఇది ఎంతటి దుర్వినియోగం.

ప్యారిస్ కమ్యూన్: ఒక గమనం! ఒక గమ్యం!


ఆర్. రఘు

పారిస్ కమ్యూనా..! ఏంటది..? కథా...? సినిమానా..? నవలా..? ఏదీ కాదు. 1871 మార్చి 18న పారిస్ కార్మికవర్గం మానవజాతి చరిత్ర పుస్తకంలో రాసిన ఒక అజరామర ఉదంతం. పెట్టుబడిదారీ వ్యవస్థ 17, 18 శతాబ్దాలలో ఐరోపా ఖండం, అమెరికాలలో వేళ్లూనికుని ప్రపంచాన్ని ఆవహించడానికి ఉవ్విళ్లూరుతున్న రోజులవి. ఉగ్రరూతలూగు తున్న రోజులవి. ఫ్రాన్స్ దేశంలో 1789లో సాగిన పెట్టుబడిదారీ విప్లవం (పారిశ్రామిక విప్లవం) ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసింది. కారణం తరతరాల పురాతన సమాజాలను ముఖ్యంగా నాటి రాచరిక పాలనను ఆ దేశ పెట్టుబడిదారీ వర్గం అత్యంత హింసాత్మకంగా కూలదోసి ఆధునిక రాజ్య స్థాపన చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు మిన్నుముట్టాయి. అయితే కొద్ది దశాబ్దాలలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ క్రూరత్వం ప్రపంచానికి తెలియవచ్చింది. ఐరోపా ఖండంలోనే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఈ వ్యవస్థే సృష్టించిన కార్మికవర్గం తిరుగుబాట్లు ప్రారంభించింది. కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌ల నాయకత్వాన కమ్యూనిస్టు లీగ్ (1847)ఏర్పడింది. మొదటి అంతర్జాతీయ కార్మిక సంస్థ 1864లో ఏర్పడింది. మార్క్స్, ఏంగెల్స్‌లు 1848లో 'కమ్యూనిస్టు ప్రణాళిక' విడుదల చేశారు. ఈ క్రమంలో అదే ఫ్రాన్స్ దేశంలో కార్మికవర్గం 1871లో స్వతంత్రంగా పారిస్ నగరంలో అధికారంలోకి వచ్చి 72రోజులు పరిపాలన సాగించింది. దీనినే "పారిస్ కమ్యూన్" అంటారు. కార్మికవర్గం ఏ పరిస్థితులలో అధికారంలోకి వచ్చింది, అధికారంలోకి వచ్చిన వెనువెంటనే నిమిషం కూడా ఆలస్యం చేయకుండా, క్షణం తీరిక లేకుండా కార్మికవర్గ ప్రభుత్వాన్ని ఎలా నడిపింది, కేవలం 72రోజులలో ఏమేమి చేయగల్గింది, చివరకు ఎలా కూల్చబడింది... అన్నది నేటి తరానికి ముఖ్యంగా విప్లవ కార్మిక సంస్థలలో పనిచేస్తున్న యువతకు తెలియాలి.

> కామ్రేడ్ లెనిన్ "కొన్ని నిరాశా సందర్భాలలో కూడా అవకాశం ఉండదని తెలిసినప్పటికీ జరిగే పోరాటాలు ప్రజానీకాన్ని భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడానికి పాఠశాలలుగా ఉపయోగపడతాయని" అంటారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చెప్పినట్లు... "ప్యారిస్ కమ్యూన్ లక్ష్యాలు కార్మిక వర్గం విముక్తి చెందేవరకు చరిత్రలో మరలా మరలా ముందుకు వస్తూనే ఉంటాయి" అని గుర్తుంచుకోవాలి. నిజం. ఇప్పుడు మరల ప్యారిస్ కమ్యూన్‌ని ముందుకు తెద్దాం. సాధించుకుందాం సోషలిస్టు వ్యవస్థని.

నేడు ప్రపంచ గమనం ఎటుంది?

ఆధునిక రచయితలందరూ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సాంఘిక వ్యవస్థగా అది పుట్టిన తరువాత ఎన్నడూ లేనంత బలహీనమైన స్థితికి చేరుకుంది అని రాస్తున్నారు. ఆర్థిక మాంద్యం, ధృవీకరణ మానవ చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రమైన ఆర్థిక అసమానతలు, వీటికి తోడు నిరుద్యోగం, ఉపాధిలేమి, పేదరికం, ఆకలి, అనారోగ్యం, పర్యావరణ వినాశనం... నేటి పెట్టుబడిదారీ ప్రపంచం ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి.



ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ "మానవాళి తనకంటూ ఓ మంచి భవిష్యత్తు కావాలనుకుంటే ప్రస్తుత వ్యవస్థని కొనసాగనివ్వకూడదు. ఒక వేళ దీనిపైనే మూడవ సహస్రాబ్దిని నిర్మించాలనుకుంటే విఫలం అవుతాము. చివరకు మిగిలేది ఓ చీకటి సమాజమే" అని తేల్చి చెప్పారు. కార్ల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినట్లు నేడు మును పెన్నటికన్నా ప్రపంచం ఎక్కడికి చేరుకుందంటే సమాజాన్ని విప్లవాత్మకంగా పునర్ నిర్మించడమా? లేక పోటీపడుతున్న వర్గాలన్నీ సమిష్టిగా నాశనం అవటమా? అన్న దశకు చేరుకున్నాయి అనిపిస్తుంది.



పారిస్ కమ్యూన్ పిలుపు

తాను చెప్పిన ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అందరికీ సుఖవంతమైన జీవితం, ఆధునిక ప్రగతిశీల భావాలు, శాస్త్రీయ దృక్పథంపై ఆధారపడ్డ సమాజాన్ని నిర్మిస్తాం అని నమ్మబలికిన పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టిన 100ఏండ్లలోనే అవన్నీ దానికి సాధ్యం కాదని, ఆ పని విప్లవ కార్మికవర్గం మాత్రమే చేయగలదని 1871లోనే పారిస్ కమ్యూన్ చేసి చూపించింది. మానవ చరిత్రలో మొట్టమొదటసారి కార్మిక వర్గం మాత్రమే ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటాన్ని సమసమాజం కోసం జరిగే పోరాటంగా మలచగలదని నిరూపించింది. 1871 మార్చి 18న ప్యారిస్ నగర కార్మికులు ఆ నగరం నుండి పెట్టుబడిదారులను తరిమేసి అధికారం చేపట్టారు. పది రోజుల తర్వాత మార్చి 28న ప్యారిస్ కమ్యూన్, కార్మిక ప్రభుత్వాన్ని, తొలి కార్మిక రాజ్యాన్ని స్థాపించారు. ఈ విప్లవం పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించింది. కారణం అవి క్రూరమైన మూఢ, మత విశ్వాసాలకు రూపాలుగా ఉన్న భూస్వామ్య రాచరిక పాలనను అంతంచేసిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతా విస్తరిస్తున్న రోజులు. ప్రజాస్వామ్యం, గణతంత్రం, లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృక్పథాల ఆధారంగా తన పరిపాలన ఉంటుందని పెట్టుబడిదారీ పాలకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న రోజులు. అయితే అప్పటికే మార్క్స్ ఏంగెల్స్‌ల నాయకత్వాన ప్రారంభమైన మొదటి ఇంటర్నేషనల్ పెట్టుబడిదారీ దేశాల (జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లాండ్, బెల్జియం తదితర) అన్నింటా కార్మిక వర్గాన్ని పోరాటాలవైపు కూడగడు తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బండారాన్ని, దాన్ని కూల్చగలిగిన ఏకైక శక్తి కార్మిక వర్గమని, అది నిర్వహించాల్సిన చారిత్రక పాత్ర గురించి మార్క్స్, ఏంగెల్స్‌లు సిద్ధాంతం రూపొందించారు. కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం-మార్క్సిజం కార్మిక వర్గంలో ప్రభావం కలుగ జేస్తున్నది. ఈ నేపథ్యంలో అనివార్యంగా వచ్చిన అవకాశాన్ని పారిస్ కార్మిక వర్గం అందిపుచ్చుకున్నది. జర్మనీతో సాగిన యుద్ధంలో ఫ్రాన్స్ ప్రభువు నెపోలియన్ 1870లో చేతులెత్తేశాడు. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని స్థాపిస్తామని ప్రగల్భాలు పలికిన ఫ్రెంచి పెట్టుబడిదారులు చతికిలబడిపోయారు. జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరాన్ని (ఇందులో 20జిల్లాలు ఉంటాయి) చుట్టుముట్టాయి. ఈ పరిస్థితులలో పారిస్ కార్మికులు ఎదురు తిరిగారు. పెట్టుబడిదారులను తరిమేశారు. పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. వెనువెంటనే తమది సోషల్ గణతంత్ర రాజ్యంగా ఉంటుందని ప్రకటించారు. దిమ్మ తిరిగిపోయిన ఫ్రెంచి పెట్టుబడిదారీవర్గం జర్మన్ ప్రభుత్వంతో, ఆ దేశ దోపిడీదారులతో నిస్సిగ్గుగా ఒప్పందం చేసుకొని వారి సైన్యం సహకారంతో పారిస్ నగరంపై తీవ్రమైన దాడి చేసి 72రోజుల కార్మిక వర్గ రాజ్యాన్ని పారిస్ కమ్యూన్‌ని రక్తపుటేరుల్లో ముంచెత్తింది. సుమారు 40,000మంది కమ్యూనార్డ్స్‌ని కాల్చిచంపారు. కొన్ని వేలమంది విదేశాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. జైళ్లు కమ్యూన్ కార్యకర్తలతో నిండిపోయాయి. పెట్టుబడిదారీ దేశాల పాలకులందరికీ మొదటి ఇంటర్నేషనల్‌ని నాశనం చేయాలని, అందుకు వారి దేశాల్లో ఉన్న ఇంటర్నేషనల్ నాయకుల్ని వేటాడి అంతం చేయమని పిలుపులు వెలువడ్డాయి. బూర్జువా పత్రికలు కమ్యూన్‌పై విషం చిమ్మే రాతలు రాశాయి.

> జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరాన్ని (ఇందులో 20జిల్లాలు ఉంటాయి) చుట్టుముట్టాయి. ఈ పరిస్థితులలో పారిస్ కార్మికులు ఎదురు తిరిగారు. పెట్టుబడిదారులను తరిమేశారు. పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. వెనువెంటనే తమది సోషల్ గణతంత్ర రాజ్యంగా ఉంటుందని ప్రకటించారు. దిమ్మ తిరిగిపోయిన ఫ్రెంచి పెట్టుబడిదారీవర్గం జర్మన్ ప్రభుత్వంతో, ఆ దేశ దోపిడీదారులతో నిస్సిగ్గుగా ఒప్పందం చేసుకొని వారి సైన్యం సహకారంతో పారిస్ నగరంపై తీవ్రమైన దాడి చేసి 72రోజుల కార్మిక వర్గ రాజ్యాన్ని పారిస్ కమ్యూన్‌ని రక్తపుటేరుల్లో ముంచెత్తింది. సుమారు 40,000మంది కమ్యూనార్డ్స్‌ని కాల్చిచంపారు.

ప్యారిస్ కమ్యూన్ పాలన

మార్చి 18 విప్లవం జయప్రదం కాగానే కార్మిక వర్గం నగరంలో ఎన్నికలు నిర్వహించింది. ప్రజా ప్రతినిధులు కార్మికులకు అందుతున్న (నాటికి ఆరువేల ఫ్రాంకులు) కనీస వేతనం మాత్రమే తీసుకోవాలని షరతు విధించింది. కమ్యూన్ ఏర్పడగానే మొదటి చట్టం నిరంకుశ పోలీస్, సైన్యం వ్యవస్థలను రద్దు చేసింది. వాటి స్థానంలో శక్తివంతులైన ప్రజలే సైన్యం అని ప్రకటించింది. న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎవరైనా ప్రజలతో ఎన్నుకోబడాల్సిందే. నచ్చకపోతే వారిని దిగిపొమ్మని, తిరిగి వేరే వారిని ఎన్నుకునే హక్కును ప్రజలకు ఇస్తూ చట్టం చేయబడింది. ఫ్రాన్స్ జాతి ఉన్మాదానికి చిహ్నాలుగా ఉన్న రాచరిక ఆనవాళ్లను తొలగించి వేసింది. ప్రజలపై ఉన్న అక్రమ వడ్డీలను రద్దు చేసింది. మూసి వేయబడ్డ కార్ఖానాలను కార్మికుల సహకార సంస్థలకు అప్పగించింది. కార్ఖానాలలో రాత్రి పనులు నిషేధించింది. కార్మికులపై అపరాధ రుసుం వేసే పద్ధతిని రద్దు చేసింది. విప్లవాత్మకమైన మరో నిర్ణయం ఏమంటే మతాన్ని, రాజ్యాన్ని విడగొట్టడం. లౌకిక విద్యను మాత్రమే బోధించాలని, మత విషయాలు పాఠ్యాంశాలలో ఉండరాదని చట్టం చేయడం. నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించింది. ఆ విధంగా కమ్యూన్ ఏవో కొన్ని సంకుచిత జాతీయ లక్ష్యాలు కోసం కాకుండా మొత్తం అణగారిన శ్రామిక జనబాహుళ్యం కోసం నిలబడింది. పోరాడింది. పోరాడుతూనే నేలకొరిగింది. విఫలమైనప్పటికీ ఇటువంటి మహత్తర పోరాటాలను కార్మిక వర్గం చేస్తూనే ఉండాలి. కామ్రేడ్ లెనిన్ "కొన్ని నిరాశా సందర్భాలలో కూడా అవకాశం ఉండదని తెలిసినప్పటికీ జరిగే పోరాటాలు ప్రజానీకాన్ని భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడానికి పాఠశాలలుగా ఉపయోగ పడతాయని" అంటారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చెప్పినట్లు... "ప్యారిస్ కమ్యూన్ లక్ష్యాలు కార్మిక వర్గం విముక్తి చెందేవరకు చరిత్రలో మరలా మరలా ముందుకు వస్తూనే ఉంటాయి" అని గుర్తుంచుకోవాలి. నిజం. ఇప్పుడు మరల ప్యారిస్ కమ్యూన్‌ని ముందుకు తెద్దాం. సాధించుకుందాం సోషలిస్టు వ్యవస్థని.

సెల్:9490098422



కాలిగిట్టెల శబ్దం

మూలసుక్క పొడిసిపొడవంగానే
మా పల్లెలో కట్టెల పొయ్యిమీద
రొట్టెల సప్పుడు కునుకుబట్టిన చెవులకు
దప్పు సప్పుడైతది.

గొరుకొయ్యల్లు వడమట పందిరేయ్యగానే
పొలంబాట పట్టిన
ఎడ్లుల కాలిగిట్టెల శబ్దం
మా పల్లెను నిద్రలేపుతుంది.

తూర్పు కొండలనుండి కరకరమంటూ
పొద్దు పొడసూపగానే
నెత్తిమీద సద్ది సంకలో సంటిపిల్లగానితో
పాద జాడలవెంట మ్యాకపిల్లలు
నడుస్తూ అడవితల్లిని నిద్రలేపుతాయి.

సద్దసేన్లో కలుపుదీయాలనో
పత్తి మొగ్గలు తీయాలనో
మా పల్లెతల్లులు సేనుసేనుకాడ
ఇరగగాసిన జొన్నకంకులవుతారు.

గెంజుకోని గంజితాగి
పొద్దంతా తల్లిపిల్ల ఎంత రయ్యమైన
చేస్తున్న పనిని కష్టమనుకోకుండా
పొద్దుతిరిగినట్లు తిరిగే పొద్దుతిరుగుడు పువ్వులవుతారు.

బంధాలమీద ప్రేమకలిగి
సుట్టమొచ్చిన పట్టమొచ్చిన
కట్టుకొచ్చిన సద్దిలనే నెత్తికింత పంచుకొని తింటరు.

సంటిపిల్లలుంటే
యాప కొమ్మలకు కట్టిన పాతచీరలో
పిల్లలు పొర్లుతుంటే గాలి దేవుడొచ్చి
ఊయలూపి మట్టిబిడ్డలమీద మమకారం చాటిపోతడు.

ఇంటి వాకిట్లో
ఇరుసులిరిగిన బండిలా
ముసలిప్రాణాలు
పల్లెకు దిక్కుదివానమవుతాయి.

నాగలి కర్రు పొలం దున్నినట్లు
కొడవలి వరికంకులను కోసినట్లు
శ్రమ జీవుల దేహం నుండి చెమట చుక్కలు
ఆకాశం నుండి కురిసే వానచినుకులవుతాయి.

అందరికీ నుదుటన రాతవుంటే
ఒక్కరైతుకు మాత్రం
కందిపోయిన అరచేతుల్లో జీవిత అర్థం కనిపిస్తుంది.

-అవనిశ్రీ. 9985419424

కార్మిక-కర్షక పోరాటాలను ఉద్ధృతం చేయండి


డాక్టర్ విజ్జూ కృష్ణన్

పెట్టుబడిదారి వ్యవస్థలో, రోజురోజుకూ తీవ్రమవుతున్న సంక్షోభాలు, గతంలో ఎన్నడూలేని విధంగా మహమ్మారి విస్తరణ, గత ఎనిమిది దశాబ్దాలలో ఎరుగని రెండవ ప్రపంచ మాంద్యం, పై అంశాలు, నయా ఉదారవాద నమోనా డొల్లతనాన్ని, అనాగరికతను బహిర్గతంచేశాయి. అత్యధికులలో, పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధుల పట్ల పాలక పక్షాలు తీవ్రమైన ఉదాసీనతతో కూడిన వైఖరిని అవలంభించాయి. ఇదే సమయంలో, అతికొద్దిమందిగా ఉన్న కార్పొరేట్ కుబేరులకు, మహమ్మారి వలన ఏర్పడిన అత్యంత వినాశకర పరిస్థితిలో కూడా, గరిష్ఠంగా లాభాలు సమకూర్చే పనిలో నిమగ్నమైంది.

గత రెండు సంవత్సరాల మహమ్మారి వ్యాప్తి కాలంలో, ప్రపంచ జనాభాలో 99శాతం ప్రజలందరి రెండురెట్ల సంపదను ప్రపంచంలోని ఒక శాతం ధనవంతులు పోగుచేసుకున్నారు. భారత దేశంలోని ప్రజలు అప్పులతో, పేదరికం, నిరుద్యోగం, ఆకలితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో, బీజేపీ ప్రభుత్వానికి అనుకూలమైన ఆప్త మిత్రులు సంపదను కూడబెట్టుకోవడాన్ని చూస్తున్నాం. దేశంలోని 40శాతానికి పైగా సంపద జనాభాలో ఒక శాతం వద్ద ఉన్నది. భారత దేశంలోని బిలినియర్స్ సంఖ్య 2021లో 102 నుండి 166కు పెరిగింది. దీనికి భిన్నంగా, ప్రపంచంలోనే అత్యధికంగా, 23 కోట్ల మంది భారత ప్రజలు పేదరికంలో నివసిస్తున్నారు. అత్యంత దారుణమైన తిరోగమనంతో కూడిన అనాగరిక చర్యేమంటే, లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు తామున్న ప్రదేశం నుండి ఒకేసారి సామూహిక వలసలు చేపట్టవలసిరావడం, ఆక్సిజన్‌తో పాటు, కనీస ఆరోగ్య వసతుల కొరత వల్ల గంగానదిలో శవాలు తేలడం, అదే సమయంలో మతతత్వ పాలకులు 'పీఎం కేర్స్' పేరుతో కోట్ల రూపాయలను పోగు చేసుకున్నారు. ఇదే సందర్భంలో వారి ఆశ్రితులు సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను ఇతర వనరులను స్వాధీనం చేసుకొని సంపదలను కూడబెట్టుకున్నారు.

గత ఎనిమిది సంవత్సరాల మోడీ బీజేపీ పాలనను గమనించినట్లయితే... గతంలో ఎన్నడూ ఎరుగని విధంగా, రైతాంగం, వ్యవసాయ కార్మికులు రోజువారీ కూలీలు, నిరుద్యోగ యువతతో పాటు భారీ సంఖ్యలో నాలుగు లక్షల పైగా ప్రజలు నిస్పృహతో ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రమై ప్రజలు, రైతాంగం పేదరికంలోనికి నెట్టి వేయబడటమే కాక, తమ ఉపాధికవసరమైన, కనీస వనరులను కోల్పోయారు. ఇది అనిశ్చిత పరిస్థితులకు దారి తీసింది.

కార్పొరేట్ అనుకూల, మతపరమైన, నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాన్ని, పోరాటాలతో కట్టడి చేయడానికి, కార్మిక వర్గం, రైతాంగం చైతన్య వంతమైన ఐక్య ఉద్యమాలను నిర్మించాయి. ఒక దశాబ్ద కాలపు నిరంతర కృషి, ప్రక్రియ ద్వారా, సమిష్టి నిర్ణయాలు, సమన్వయంతో కూడిన ఐక్యకార్యాచరణ, ఉత్పత్తి వర్గాలైన ఆల్ ఇండియా కిసాన్ సభ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం దృఢమైన ఐక్యత ద్వారా ఇది సాధ్యమైంది. ఐక్య వర్గ కార్యాచరణ కేవలం సంఘీభావ ప్రకటనలు, లాంఛనమైన మద్దతు వరకే కాక, భాగస్వామ్యంతో ఈ సంఘాలలోని ప్రతి ఒక్క విభాగం స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహించుకునే వైపు మార్పు చెందాయి.

2018లో కార్పొరేట్ మీడియా ఎర్రజెండాపై గోరీ మీద రాతలు(కారు కూతలు) రాయడంలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆల్ ఇండియా కిసాన్ సభ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో అత్యంత మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవంపై ఉధృతంగా సాగిన ప్రచారోద్యమం తరువాత, శాసనోల్లంఘనం, భారీ ఉమ్మడి ప్రచారంతో పాటు స్వచ్ఛందంగా కోర్టు అరెస్టులకు సిద్ధపడటం, జైలు భరో కార్యక్రమాలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. దీని వెను వెంటనే మూడు సంఘాల ఆధ్వర్యంలో మొట్టమొదటి ఉమ్మడి సమీకరణ జరిగింది. సెప్టెంబర్ 5న, కార్మిక, కర్షక ఐక్యత అనే ప్రాథమిక మార్గ మార్గదర్శక సూత్రాన్ని బలపరుస్తూ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ప్రదర్శన జరిగింది.కార్మికులు, కర్షకులు గ్రామీణ భారత్ హర్తాళ్‌కు ఏకకాలంలో పిలుపునివ్వడం అనేది కార్మికవర్గం సార్వత్రిక సమ్మెల ప్రధాన లక్షణం. ఈ నిరంతర పోరాటాలు, మోడీ నాయకత్వంలోని నిరంకుశ, కార్పొరేట్, మతోన్మాద బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టించాయి. మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ కాలంలో, ప్రపంచమంతా వ్యాధితో పోరాడుతున్న సమయంలో, అన్నిచోట్ల భయంతో కూడిన వాతావరణం నెలకొన్న సందర్భంలో, లాక్‌డౌన్ విధించిన నెల రోజుల లోపే, ఈ మూడు సంఘాల చొరవతో ఆర్థిక సహకారం కోసం, ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి చట్టం ప్రకారం ఉపాధి, నిరుద్యోగ వేతనాలు, సార్వత్రిక వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, సామాజిక భద్రతల కోసం డిమాండ్ చేస్తూ కార్మిక వర్గం ముందుకు వచ్చింది.

> బీజేపీ ప్రభుత్వం రైతాంగం పై, కార్మిక వర్గం పై దాడులతో ప్రతీకారం తీర్చుకుంటూ, తన కార్పొరేట్ మిత్రులకు భారీ ఎత్తున రాయితీలు ఇచ్చింది. మూడు కార్పొరేట్ అనుకూలమైన రైతు చట్టాలు భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. కార్మికవర్గం కష్టపడి సాధించుకున్న హక్కులను గుంజుకొనే లేబర్ కోడ్లు, అంతులేని లాభాలను పెంచే లక్ష్యంతో, హద్దులులేని దోపిడీ విధానాలను, అప్రజాస్వామిక పద్ధతుల్లో తీసుకొని వచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. ఇది మన రాజ్యాంగ పరమైన, సమాఖ్య విధానాన్నే దెబ్బతీసింది. కార్మికులు, రైతాంగం ఈ చర్యలను తమ శక్తి వంచన లేకుండా ప్రతిఘటించాయి.



అయితే, బీజేపీ ప్రభుత్వం రైతాంగం పై, కార్మిక వర్గం పై దాడులతో ప్రతీకారం తీర్చుకుంటూ, తన కార్పొరేట్ మిత్రులకు భారీ ఎత్తున రాయితీలు ఇచ్చింది. మూడు కార్పొరేట్ అనుకూలమైన రైతు చట్టాలు భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. కార్మికవర్గం కష్టపడి సాధించుకున్న హక్కులను గుంజుకొనే లేబర్ కోడ్లు, అంతులేని లాభాలను పెంచే లక్ష్యంతో, హద్దులులేని దోపిడీ విధానాలను, అప్రజాస్వామిక పద్ధతుల్లో తీసుకొని వచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. ఇది మన రాజ్యాంగ పరమైన, సమాఖ్య విధానాన్నే దెబ్బతీసింది. కార్మికులు, రైతాంగం ఈ చర్యలను తమ శక్తి వంచన లేకుండా ప్రతిఘటించాయి. నవంబర్ 26, 2020న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వగా, రైతుల సమస్యల ఆధారిత ఐక్యతా సంస్థ, సంయుక్త కిసాన్ మోర్చాలు గ్రామీణ భారత హర్తాల్‌కు పిలుపునిచ్చాయి. దేశ రాజధానికి పొరుగున ఉన్న రాష్ట్రాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చాయి. 380రోజులు పాటుసాగిన ఈ ఉద్యమం వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక వర్గం చురుకైన భాగస్వామ్యంతో సాగిన దృఢమైన పోరాటం. 750 మంది రైతుల బలిదానంతో బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి క్షమాపణలు చెప్పి చట్టాలను వెనక్కు తీసుకునేలా చేసింది. ఈ ప్రతిఘటన నేపథ్యంలో లేబర్ కోడ్లను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ విజయం సాధించడానికి సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణల మధ్య సమన్వయమే ప్రధాన కారణం. విద్యుత్ సవరణల ఉపసంహరణ కూడా ఎస్కేయం, కార్మిక వర్గాల పోరాటాల డిమాండ్ ఫలితం అనే విషయాన్ని గమనించాలి.

కార్మికులు, కర్షకులు కష్టపడి సాధించుకున్న పరిరక్షణను వక్కాణిస్తూ ఏప్రిల్ 5, 2023న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించింది. నిరంకుశ కార్పొరేట్, మతోన్మాద, బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక పోరాటమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. 2023వ సంవత్సరం కీలకమైంది కావడంతో, వర్గ సమస్యలను దేశ ఎజెండాలో ఉంచేందుకు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ వాతావరణం నెలకొల్పేందుకు అవసరమయ్యే నిరంతర నిరసనల ప్రారంభానికి ఈ ర్యాలీ ఓ సూచిక. కార్మిక, కర్షక పోరాటాలలో, ఇదొక అతిపెద్ద పోరాటంగా గుర్తించబడేందుకు లక్షల సంఖ్యలో ప్రజా సమీకరణ జరగాలి. దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఈ పోరాట సందేశం చేరవేయాలి. కార్మికులు, కర్షకులు, కష్టజీవులను ఇంటింటి ప్రచారం ద్వారా గతంలో కలువనివారిని కలిసేందుకు, సాధ్యమైనన్ని ఎక్కువ నివాసాలకు చేరుకునేందుకు, శ్రేయోభిలాషులనను సమీకరించేందుకు ఉధృతంగా ఉమ్మడి ప్రచారం జరుగుతుంది.

ఏప్రిల్ 5న జరగబోయే మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ సీ2+50 శాతం కనీస మద్దతు ధరకు హామీ, నెలకు కనీస వేతనం రూ.26వేలు, గ్రామీణ ఉపాధి చట్టం కింద రోజుకు రూ.600లు తగ్గకుండా 200పని దినాలు, ఆహార భద్రత, విద్యుత్ చట్ట సవరణల ఉపసంహరణ, సామాజిక భద్రత, పెన్షన్ల లాంటి సమస్యలను, రైతులు, కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతుంది. రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం, హిందూత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. ఈ ర్యాలీ నయా ఉదారవాద, కార్పొరేట్- మతోన్మాద పాలనకు ఇదొక దృఢమైన రాజకీయ సైద్ధాంతిక సవాల్. ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల్ని ముందుకు తీసుకుపోయే ఒక ఐక్య కార్యాచరణ.ప్రజానుకూల ప్రత్యా మ్నాయ విశాల ఐక్యతా నిర్మాణానికి, ప్రజాశత్రువులకు నిర్ణయాత్మక ఓటమిని అందించే ఒక ఆధారంగా ఈ ర్యాలీ పని చేస్తుంది.

అనువాదం:మల్లెంపాటి వీరభద్రరావు, 9490300111

ఆడపిల్లకు జన్మనిచ్చిచూడు అమ్మలా నీ ఇంటి నీడ అవుతుంది... ఆడపిల్లకు చదువు చెప్పించి చూడు చదువుల తల్లిలా నీ ఇంటి వెలుగవుతుంది... ఆడపిల్లకు చేయూత నిచ్చి చూడు చివరి వరకు నీ చేయి వీడని ఊతమవుతుంది... ఆడపిల్లకు అండగా నిలిచి చూడు అంతరిక్షాన్ని అధిరోహించగలదు... భూదిగంతాన్ని చుట్టి రాగలదు... ఈ మాటలన్నీ అతిశయోక్తి కాదు ఒక్కసారి చరిత్ర పుటలను తిరగేస్తే అలాంటి వనితలెందరో తారసపడతారు. ఆ కోవకు చెందిన వ్యక్తే నేటి మన కథానాయిక రిథిక అగర్వాల్. ఎడ్యుకేషనల్ బోర్డ్ గేమ్స్ తయారు చెయ్యడంలో తన సత్తా చాటడమే కాక 2022కు హైదరాబాద్ బిజినెస్ అవార్డ్ అందుకున్న మహిళా పారిశ్రామికవేత్త. వయసు నాలుగు పదులు కూడా నిండలేదు కానీ భారతదేశం అంతటా తాను సృజించిన ఏడ్యుకేషనల్ బోర్డ్ గేమ్స్ విక్రయాలు చేస్తున్నారు. ఇక ఆలస్యం చెయ్యక ఆమె సక్సెస్ స్టోరీ చదివేద్దమా మరి...



చదువు చెప్పే ఆటలు నేర్పే 'యుక'

సాఫీగా సాగిపోతూ చెన్నైలో కాపురముండే ఓ వ్యాపార కుటుంబంలో 1988లో జన్మించారు రిథిక. అమ్మ సుధాలాట్, నాన్న ప్రవీణ్ లాట్. రిథికకు ఒక అక్క, ఒక అన్న ఉన్నారు. బాల్యం, విద్యాభ్యాసం చాలా ఆనందంగా సాగాయి. ఎంబీఏ చదివారు. అలాగే సర్టిఫైడ్ ఫైనా న్షియల్ ప్లానర్ కోర్స్ కూడా పూర్తి చేశారు. ఆమెకు చిన్న ప్పటి నుండి గణితశాస్త్రం అంటే చాలా ఇష్టం. అలాగే బోర్డ్ గేమ్స్ ఎక్కువగా ఆడేది. తనతో పాటు తన కుటుంబ సభ్యులు అందరూ ఆడేవారు. వేసవి సెలవులలో, విరామ సమయంలో ఎంతో కాలక్షేపం. కుటుంబం అంతటినీ ఒకచోట చేర్చి కుటుంబ బంధాలను బలోపేతం చేయడంలో బోర్డ్ గేమ్స్ ఎంతో ఉపయోగం అంటారు రిథిక. ఒకసారి తన కజిన్‌తో నాలుగు రోజులు బోర్డ్ గేమ్స్ ఆడుతూ అలా ఉండిపోయింది. వినోదంతో పాటు విజ్ఞానం కూడా పెంచుతాయి బోర్డ్ గేమ్స్ అంటారు ఆమె.

పెళ్లితో మరింత బలం

2012లో మనీత్ అగర్వాల్ చెయ్యి అందుకొని రిథికా బొమ్మరిల్లు లాంటి పుట్టింటిని వదిలి పొదరిల్లు లాంటి అత్తవారి ఇల్లు చేరింది. చిన్నప్పటి నుండి ఉమ్మడి కుటుంబంలో పెరగడం కారణంగా అత్తవారింట్లో చాలా తేలికగా కలిసి పోయింది. మనీత్, రిథిక ప్రేమకు గుర్తుగా ఇద్దరు అబ్బాయిలు కలిగారు. వాళ్ళ పేర్లు యువాన్, కయున్. రిథిక ప్రారంభించిన వ్యాపార సంస్థ పేరు యుకా చాంప్స్, యు అనగా యువాన్ పేరులోని మొదటి రెండు అక్షరాలు, క అనగా కయాన్ పేరులోని మొదటి రెండు అక్షరాలు వాటిని కలిపిన 'YUKA' Champs అని సంస్థ పేరు పెట్టారు.

బిజినెస్ ఆలోచన ఇలా...

యువాన్, కయాన్ పెరిగి ఆటలాడే వయసు వచ్చేసరికి రిథికకు ఒక ఆలోచన తట్టింది. తన పిల్లలకు బోర్డ్ గేమ్స్ ఆడటం నేర్పించాలనుకుంది. పిల్లలు ఇంకా ఎక్కువ ఆసక్తితో బోర్డ్ గేమ్స్ ఆడాలి అంటే కొత్త కొత్తగా ఎలా రూపొందించాలి అనే ఆలోచన తట్టింది ఆమె. తన ఆలోచనను విస్తృతం చేసుకుంది రిథిక. అనుకున్నట్టుగానే బోర్డ్ గేమ్స్ రూపొందించడంపై దృష్టిసారించింది. ఈ బోర్డ్ గేమ్స్ కేవలం వినోదం కోసమే కాకుండా విజ్ఞానం పెంచేవిగా ఉండాలి. అందుకోసం పాఠశాల విద్యా పాఠ్యాంశాలకు అనుగుణంగా బోర్డ్ గేమ్స్ తయారు చెయ్యడం ప్రారంభించింది.

ఎడ్యుకేషనల్ బోర్డ్ గేమ్స్

పాతకాలంలో బోర్డ్ గేమ్స్ అంటే పాము నిచ్చెన, చెస్, కార్రమ్స్, చైనీస్ చెక్కర్ లాంటివి. కానీ రిథిక మాత్రం పాఠశాలల పాఠ్యాంశాలకు సంబంధించి ప్రతీ అంశం గూర్చి బోర్డ్ గేమ్స్ తయారు చెయ్యాలి అంటుంది. ముఖ్యంగా తనకు గణితశస్త్రమంటే ఇష్టం కాబట్టి దానికి సంబంధించిన బోర్డ్ గేమ్స్ తయారు చేశారు. అందులో ఎక్కువ పాపులర్ అయిన గేమ్ మథారాన్. బోర్డ్ గేమ్స్ తయారు చెయ్యడానికి కాగితం, అట్టముక్కలు ఉపయోగిస్తారు. వీటిని పిల్లల చాలా తేలికగా ఎక్కడికైనా తీసుకెళ్లగలరు.





> **స్త్రీగా వివక్ష**
>
> 'ఒక మహిళగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టినప్పుడు నేను ఎలాంటి భయానికి, నూన్యతాభావానికి గురికాలేదు. కానీ మెటీరియల్ కోసం ఆర్డర్స్ పెట్టినా, ప్రింటింగ్‌కు ఆర్డర్స్ ఇచ్చినా ఒక మహిళ అని, నాది ఏదో హోం బిజినెస్ అన్నట్టు నా ఆర్డర్స్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఒకటికి రెండుసార్లు చెప్పాల్సి వచ్చేది. అక్కడ మగవారి మధ్య నన్ను తక్కువగా చూసినప్పుడు బాధ వేసేది. కానీ నేను పట్టువదలక కొనసాగించా ఈ బిజినెస్' అంటారు రిథిక.

ఒక చిన్న ఆలోచన

రిథికా 10 లక్షల పెట్టుబడితో ప్రారంభించిన ఈ వ్యాపారంలో 30 లక్షల వరకు లాభాలను చూడగలిగారు. తన పిల్లల విరామ సమయంలో తాను చేసిన ఆలోచన యావత్ భారత దేశం అంతా తాను రూపొందించిన ఎడ్యుకేషనల్ బోర్డ్ గేమ్స్ విక్రయించేలా చేసింది. భారతదేశం అంతటా 400 రిటైల్ దుకాణాలలోనూ, యూకా ఛాంప్స్ సొంత వెబెసైట్‌లోనూ, 30 కంటే ఎక్కువ ఆన్లైన్ ప్లాట్‌ఫాంలలో ఈ బోర్డ్ గేమ్స్ విక్రయించబడుతున్నయి. ఈ కారమ్స్ ప్లాట్ ఫామ్ ద్వారా యుఎస్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టారు. 'చదువుకునే ప్రతీ విద్యార్థికి చాలా ఉపయుక్తంగా ఉంటాయి మా బోర్డ్ గేమ్స్' అంటారు రిథిక.

అపురూప క్షణాలు

2023 జనవరి 11వ తేదీన హైదరాబాద్ బిజినెస్ అవార్డ్స్ - 2022 ఏడాదికిగాను ఎడ్యుకేషనల్ లెర్నింగ్ అండ్ డెవలప్మెంట్ విభాగంలో న్యూ ఎంటర్‌ప్రైనూర్ అవార్డ్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి చేతుల మీదుగా రిథిక అవార్డ్ అందుకున్నారు. ఈ అవార్డ్ అందుకోవడం ఇప్పటి వరకు తన కెరీర్‌లో అపురూప క్షణాలు అంటారు ఆమె.

కుటుంబ సహకారంతోనే

'నేను ఏది సాధించినా, ఎంత అభివృద్ధి చెందినా నా కుటుంబ సహకారం వల్లనే సాధ్యమయింది. బోర్డ్ గేమ్స్ తయారు చెయ్యడం, విక్రయించాలనే నా ఆలోచనకు నా కుటుంబం అండగా నిలబడింది. అన్నింటిలోనూ నాకు సహకారం ఇచ్చారు. పని ఒత్తిడి సమయంలో నా పిల్లల ఆలనా పాలన చూసుకున్నారు. ఒక్కో సమయంలో ఒక గేమ్ తయారు చెయ్యడానికి, పరీక్షలు నిర్వహించటానికి చాలా సమయం తీసుకుంటుంది. అలాంటి సమయంలో కూడా నా కుటుంబ సభ్యులు, నా భర్త నన్ను ప్రోత్సహించారు' అంటారు రిథిక.

వి హబ్ సహకారంతో

తనలా కొత్తగా వ్యాపారరంలోకి ప్రవేశించ మహిళలకు వి హబ్ అందించే మద్దతు అంతా ఇంతా కాదు. విభిన్న వ్యాపార వర్గాల నుండి వచ్చిన వారి మార్గ దర్శకాలు చేయించడం, నిపు ణుల ద్వారా సెమినార్‌లు నిర్వ హించడం, పెట్టుబడిదారులకు ఆలోచనలు ఇవ్వడం, సూచనలు చెయ్యడం, ఆర్థికంగా చేయూత అందించడం ఇలా ఎన్నో రకాలుగా మహిళలకు అండగా నిలవడం ద్వారా ఎంతో మంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఇది ఒక మంచి వేదిక. నాకు కూడా చాలా సాయం అందించారు వారు అంటుంది రిథిక.

వ్యక్తిగత క్రమశిక్షణతోనే...

వ్యక్తిగత క్రమశిక్షణ, వృత్తి పట్ల అంకితభావం ఉన్నపుడే మనిషి ఏదైనా సాధించగలడు. మంచి సమయం వస్తుందని వేచి చూడకూడదు. మన ఆలోచనలు, మన ప్రణాళిక, మన కష్టం మాత్రమే మనకు విజయాన్ని, మంచి సమయాన్ని తెచ్చిపెడతాయి అంటూ రిథిక తన మాటలు ముగించారు.

- జ్యోత్స్న దేవి దేవరకొండ, 7842171357



ఆత్మవిశ్వాసం నింపండి..

ఆత్మ విశ్వాసంతో ఉన్న పిల్లలు జీవితంలోని ప్రతి పరీక్షను సులభంగా అధిగమించగలరు. అందువల్ల తల్లితండ్రులు తమ పిల్లలలో ఆత్మ విశ్వాసం నింపేం దుకు కృషి చేయాలి. చాలా సార్లు పిల్లలు ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లనే వారి జీవితంలో చాలా మంచి అవకాశాలను కోల్పోతారు. ఇంకా కొందరు తమను తామే తక్కువగా పరిగణించు కుంటారు. అనాలో చితంగా నిర్ణయాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తారు. అటువంటి పరిస్థితిలో పిల్లలకు ఆత్మ విశ్వాసం పెరిగేలా, దానిని పెంపొందించేలా చూసుకో వడం తల్లిదండ్రుల బాధ్యత. అందుకోసం తల్లిదండ్రులు పాటించవలసిన చిట్కాలు ఇవే...

- పిల్లలు మంచి పని చేసినప్పుడల్లా వారిని ప్రశంసించండి. ఆ తర్వాత వారు మరింత మెరుగ్గా ఆ పనిని చేసేలా ప్రోత్సహించండి. ఇంకా ప్రతి కార్యకలాపంలోనూ వారు పాల్గొనేలా ముందుకు నడిపించండి.
- మీ ఒత్తిడితో కూడిన జీవితంలో కూడా తప్పనిసరిగా పిల్లలకు కొంత సమయం ఇవ్వండి. వారితో ప్రేమగా మాట్లాడుతూ.. వారి ప్రశ్నలకు ప్రశాంతంగా సమాధానం చెప్పండి. వాటిని ఆసక్తిగా వినండి. అలా వారిలో జిజ్ఞాసను పెంపొందించండి.
- పిల్లలు మీకు తెలియకుండానే మీ నుంచి చాలా నేర్చుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను ప్రతికూల వాతావరణం నుంచి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులగా మీపైనే ఉంటుంది.
- పిల్లలు కొన్నిసార్లు తమకు తెలియకుండానే తప్పు దారిలో పయనిస్తారు. ఆ సమయంలో వారిని కూర్చోబెట్టి ఏది ఒప్పో ఏది తప్పు అని చెప్పడం చాలా మంచిది. అలా చెప్పే క్రమంలో వారికి అర్థంమయ్యేలా చెప్పండి. కానీ మీ మాటల వల్ల పిల్లలు నొచ్చుకునేలా మాట్లాడకండి.

వ్యక్తి చేసిన నేరాన్ని వ్యవస్థకి ఆపాదిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపత్తి కలిగిన సంస్థ అనీ చెప్పారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. నిరుద్యోగులు ఇలాంటి నేతల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా, దిగజారుడు వాదనలు చేస్తూ, ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూరికార్డుల ప్రక్షాళన, సమర్ధ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధరణిపై కూడా ఇలాంటి అర్థరహితమైన ఆరోపణలే చేశారని గుర్తుచేశారు. గతంలో ఇంటర్ పరీక్షలపై కూడా ఇలాంటి అర్థరహితమైన, నిరాధారమైన ఆరోపణలు చేసి, పరువునష్టం కేసు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాజకీయ దురుద్దేశంతో బండి సంజయ్ చేస్తున్న కుట్రలకు భవిష్యత్‌లో క్రిమినల్ కేసులు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో ఇప్పటిదాకా వందకు పైగా సందర్భాల్లో ప్రశ్నా పత్రాల లీకేజీలు జరిగాయనీ, దీనిలో స్వయంగా బీజేపీ నేతలే ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్టు తేలిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీకైనప్పుడు మంత్రిని కానీ.. అక్కడి ముఖ్యమంత్రిని కానీ ఏనాడు ఆపార్టీ బాధ్యులను చేయలేదని గుర్తుచేశారు. ఇతర పార్టీలు ప్రాతినిథ్యం వహించే రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలను నిందిస్తూ మరోలా వ్యవహరించడం దిగజారుడు రాజకీయం కాక ఇంకేంటని ప్రశ్నించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారం వెలుగులోకి రాగానే ప్రభుత్వం సిట్‌ను నియమించి బాధ్యులైన వారందరినీ అరెస్టు చేసిందని గుర్తుచేశారు. అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకూడదనే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దుచేయాలనే కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం బాధాకరమైనా తప్పలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లపై కోటి ఆశలతో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతుంటే.. వాటిని పక్కన పడేసి తనతో కలిసి రావాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ కేసులోని నిందితులు బీజేపీ యాక్టివ్ కార్యకర్తలనే విషయం విచారణలో తేలిందనీ, తన రాజకీయాల కోసం లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను పణంగా పెట్టి పేపర్‌ను లీక్ చేయించిన కుట్ర ముమ్మాటికీ బీజేపీదేనని స్పష్టం చేశారు.

అన్ని పరీక్షలూ రీషెడ్యూల్

గువహతి : రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు, ఎదురుదాడులు, ఆందోళనలతో అసోం ప్రభుత్వం తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నది. మరొక ప్రశ్నపత్రం సైతం లీక్ కావడంతో ప్రభుత్వం పరీక్షల రీషెడ్యూల్‌కు నిర్ణయం తీసుకున్నది. ఇంగ్లీషుతో పాటు ఆధునిక భారత భాషా సబ్జెక్టుల అన్ని పరీక్షలను రీషెడ్యూల్ చేసింది. అస్సాం హై స్కూల్ పరీక్షలో పదో తరగతికి చెందిన అస్సామీస్ భాష ప్రశ్నపత్రం శనివారం జరగాల్సి ఉన్నది. అయితే, అది గురువారమే లీక్ అయింది. పదో తరగతి జనరల్ సైన్స్ ప్రశ్న పత్రం లీకైన మూడ్రోజులే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. జనరల్ సైన్స్ ప్రశ్న పత్రం లీకేజీ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల నిరసనలకు దారి తీశాయి. రాష్ట్ర విద్యా మంత్రి రాజీనామాకు, కేసు దర్యాప్తునకు డిమాండ్ చేశాయి. దీంతో ఈ కేసుకు సంబంధించి పోలీసులు మంగళవారం నాడు ముగ్గురిని అరెస్టు చేసి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన నిందితుడు పరీక్ష కేంద్రం లుహిత్ ఖబాలు హెచ్ఎస్ స్కూల్ ఇంచార్జీ అని నా దృష్టికి వచ్చిందని అసోం సీఎం హిమంత విశ్వ శర్మ తెలిపారు. అస్సామీస్ పేపర్ లీకేజీని విచారణలో ఒప్పుకున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అస్సామీస్ పరీక్షను రీషెడ్యూల్ చేయాలని సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు అస్సాం (సెబా)ను ఆదేశించినట్టు ఆయన తెలిపారు. ఆధునిక భారతీయ భాషా సబ్జెక్టుల పరీక్షలు ఏప్రిల్ 1న రాష్ట్రంలోని అన్ని కేంద్రాల్లో నిర్వహించబడతాయని ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి రనోజ్ పెగు తెలిపారు.

గ్రూప్- 1, ఏఈఈ, డీఏవో పరీక్షలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

దొంగిలించాడని సిట్ తన నివేదికలో తెలిపింది. పెన్ డ్రైవ్ ద్వారా 5 పరీక్షా పత్రాలను రాజశేఖర్ కాపీ చేసి ప్రవీణ్‌కు ఇవ్వగా.. అతను ఎఇ ప్రశ్నపత్రాన్ని రేణుకకు విక్రయించాడు. గ్రూప్-1 ప్రశ్నపత్రం కూడా లీకైనట్టు గుర్తించామని సిట్ నివేదికలో స్పష్టంచేసింది.

పార్లమెంటులో ప్రతిపక్షాల సత్యాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్న ఆందోళనల్లో భాగంగా శుక్రవారం సత్యాగ్రహం చేపట్టాయి. పార్లమెంట్ ఆవరణంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన సత్యాగ్రహంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో పాటు అన్ని పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ప్లకార్డులు చేబూని 'అదానీ సర్కార్ సిగ్గు సిగ్గు, జేపీసీ విచారణ జరపాలి, ఎల్ఐసీ, ఎస్‌బీఐను కాపాడాలి' అంటూ నినాదాలు హోరెత్తించారు. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎస్పీ, ఆప్, జేడీయూ, బీఆర్ఎస్, సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ, శివసేన (ఠాక్రే), ఎన్సీపీ, జేఎంఎం, ఎండీఎంకే, వీసీకే, ఆర్ఎస్పీ, ఆర్ఎల్డీ, కేరళ కాంగ్రెస్(ఎం), ఐయూఎంఎల్ తదితర పార్టీలకు చెందిన ఎంపీలు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

నిమిషాల్లో ఉభయ సభలు వాయిదా

పార్లమెంటు ఉభయ సభలు నిమిషాల్లో సోమవారం (మార్చి 20) నాటికి వాయిదా పడ్డాయి. శుక్రవారం అధికార, ప్రతిపక్షాలు ఆందోళనలతో ఉభయ సభలు స్తంభించాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చేత దర్యాప్తు చేయించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లండన్‌లో దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారనీ, ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ బీజేపీ సభ్యులు సభ లోపల, వెలుపల ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. పార్లమెంటులో చర్చించడానికి ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. రాహుల్ గాంధీని చూసి బీజేపీ భయపడుతోందన్నారు. అంతకుముందు రాజ్యసభలో కేంద్ర మంత్రి వి. మురళీధరన్ జాతీయ జూట్ బోర్డుకు ఎన్నికల నిర్వహణ కోసం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీని సజావుగా నిర్వహించేందుకు అనేక చర్యలను అమలు చేస్తున్నట్టు పార్లమెంటుకు తెలిపారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ప్రధాని మోడీ, మంత్రి పియూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు కెసి వేణుగోపాల్, శక్తిసిన్హ్ గోహిల్ ప్రివిలేజ్ నోటీసులు ఇచ్చారు.

ఉభయసభల్లో 3,382 నిమిషాలు అంతరాయం

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన ఐదు రోజుల్లో 3,382 నిమిషాల పాటు పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం జరిగింది. అధికార, ప్రతిపక్షాల ఆందోళనతో మొదటి వారం కార్యకలాపాల మొత్తం తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో కేవలం 218 నిమిషాల పాటు మాత్రమే సభా కార్యకలాపాల నిర్వహణ జరిగింది.

లోక్‌సభ ఈవారం ఐదు పనిదినాల్లో షెడ్యూల్ చేయబడిన 1,800 నిమిషాల్లో కేవలం 65 నిమిషాలు మాత్రమే పని చేసింది. అత్యల్పంగా గురువారం రెండు నిమిషాలు కంటే కొంచెం ఎక్కువ సమయం మాత్రమే జరిగింది. రాజ్యసభ 1,800 నిమిషాల్లో 152 నిమిషాల పాటు పని చేసింది. అత్యధికంగా ఆస్కార్ విజేతలను సత్కరించడానికి, అత్యల్పంగా గురువారం కేవలం నాలుగు నిమిషాల సమయమే పని చేసింది.

జన చైతన్య యాత్రకు.. జన నీరాజనాలు

నవతెలంగాణ -మట్టేవాడ/హన్మకొండ/వరంగల్

సీపీఐ(ఎం) జెండాలతో ఓరుగల్లు నగరం ఎరుపుమయమైంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభవైపు సాగిన జన సమూహాన్ని చూసి వరుణుడే శాంతించాడు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సీపీఐ(ఎం) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన జన చైతన్య యాత్ర శుక్రవారం మొదటిరోజు హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్‌లలో విజయవంతమైంది. వరంగల్‌లోని ఆజంజాహీ మిల్లు గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన జన చైతన్య యాత్ర ప్రారంభ బహిరంగ సభకు ప్రజలు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేత బూని వరంగల్ నలువైపులా ఉన్న ప్రధాన కూడళ్ల నుంచి ఆటపాటలతో, డప్పు చప్పులతో, కోలాటాలు ఆడుతూ నినాదాలతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎర్రటి చీరలు, ఎర్రని అంగీలతో రోడ్లను ఎరుపు మయం చేస్తూ భారీ ప్రదర్శన చేశారు. కోలాటాలు ఆడుతూ డబ్బు చప్పులతో డీజే మోతలతో ఎర్రజెండాలు చేత పట్టుకొని నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. కొత్తపేట పైడిపల్లి ఎమ్‌హెచ్‌నగర్ జక్కలొద్ది రంగసాయిపేట్ బెస్తం చెరువు వంటి పలు ప్రాంతాల నుండి జనం భారీగా తరలివచ్చారు. సభ వేదికపై కార్యకర్తలను ఉత్సావంతులు చేసే విధంగా పాటలు, నృత్యాలు అలరించాయి. బహిరంగ సభలో పార్టీ అగ్ర నాయకులు మాట్లాడుతుంటే ప్రజల్లో ఆనందం వెల్లి విరిసింది. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు. సీపీఐ(ఎం) తమకు అండగా ఉంటే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని పార్టీతో కలిసి పోరాటాలు చేసి చిరకాల స్వప్నం అయినా సొంతింటి కలను నెరవేర్చుకుంటామనే భరోసా ప్రజల్లో కనిపించింది. ఎవరిని అడిగినా పార్టీతో పాటు పోరాటాలు చేస్తామనే మాట సభ ప్రాంగణంలో ఎవరిని కలిపినా వినిపించింది.

హన్మకొండ కుడా గ్రౌండ్ ఎరుపుమయం

శుక్రవారం ఉదయం హనుమకొండలో నిర్వహించిన జన చైతన్య యాత్ర విజయవంతమైంది. యాత్ర అనుకున్న సమయానికి ఉదయం 9గంటలకు కాజీపేట జంక్షన్ నుంచి ప్రారంభమైంది. ఉదయం వర్షం పడుతున్నా జనం లెక్కచేయలేదు. పది గంటల వరకే కుడా గ్రౌండ్స్ నిండిపోయింది. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్ని అలరించాయి. సభ ప్రారంభానికి ముందు వర్షం కొద్దిగా వెలిసినా సభ జరుగుతున్నంత సేపు చిరుజల్లులు పడినా ప్రజలు చివరిదాకా ఉన్నారు.

బీజేపీ గద్దె దింపుటకే నేను సైతం పోరాటంలో : ఓడపల్లి అనిత బెస్తం చెరువు

నేను సైతం జనచైతన్య యాత్రకు మేము సైతం అంటూ రెండు సంవత్సరాల బాబుతో తన తల్లి రావడం అక్కడికి వచ్చిన పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఒక కూతురు ఒక కొడుకుతో సభా ప్రాంగణానికి వచ్చాను. ఈ సభలో ముఖ్య నాయకులు మాట్లాడిన మాటలు వింటుంటే బీజేపీ ప్రభుత్వంను గద్దెదించే వరకు పోరాడుదామనే పోరాట పటిమ వచ్చింది. ముఖ్య నాయకులు అన్న మాటలు ఆసక్తిని కల్పించాయి. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే నిరుపేదల బతుకులు మరింత దారిద్ర్యంలోకి వెళ్తున్నాయి. బీజేపీ గద్దె దింపుటకే నేను సైతం పోరాటంలో ఉంటాను.

పోరాట పటిమను నింపాయి : యాస్మిన్ కాశిబుగ్గ

ప్రజల హక్కులు దినదినం కోల్పోతున్నాం. ఎర్రజెండా అండతోనే మహిళల హక్కులను సాధించుకుంటాం. కులం, వర్గం మతం అసమానతలు బీజేపీలో పెట్రేగిపోతున్నాయి. మహిళలపై హత్యలు లైంగికదాడులు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాకుండా ఐక్యమత్యంతో అందరం ఉద్యమించాలని ముఖ్య నాయకులు చెప్పిన మాటలు మాలో పోరాటపటిమను పెంపొందించాయి.

స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణనష్టం జరగటంతో పాటు, పలువురు గాయపడడం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మరణించివారికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియాను ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలతో పాటు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో వుండి పరిస్థితులను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు సీఎం కేసీఆర్ సూచించారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు రద్దు

నవతెలంగాణ-కంటోన్మెంట్

దేశంలో కంటోన్మెంట్ బోర్డుల ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్టు రక్షణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఒక గెజిట్ విడుదల చేశారు. దాంతో సికింద్రాబాద్ సహా దేశంలోని 57 కంటోన్మెంట్ బోర్డుల్లో ఎన్నికలు రద్దయ్యాయి. అయితే రద్దుకు గల కారణాలు పేర్కొనకపోవడం గమనార్హం. దేశంలో ఉన్న 57 కంటోన్మెంట్లకు ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించాలని గత నెల 17న రక్షణ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. కంటోన్మెంట్‌ల విలీన ప్రక్రియ ఒక వైపు కొనసాగుతుండగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని, అలాగే 2020 యాక్ట్ అమలు కాకుండా పాత చట్టం ప్రకారం ఎందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నారని కూడా పలు కంటోన్మెంట్లలో రాజకీయ నాయకులు కోర్టులను ఆశ్రయించారు. కంటోన్మెంట్‌ల నుంచి రక్షణ శాఖకు ఒత్తిడి రావడం వల్లనే ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేసినట్టు తెలుస్తోంది. తిరిగి ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే వివరణ గెజిట్‌లో తెలపకపోవడం గమనార్హం.

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐకి సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా జోక్యం చేసుకొని 'కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు నోటీసులు ఇవ్వాలి? అవసరమే లేదు' అని పేర్కొన్నారు. తెలంగాణ సీఎంకు కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అయితే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి, అలాగే ఈ కేసులో మిగిలిన 14 మంది ప్రతివాదులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా ఎమ్మెల్యేల ఎర కేసులో మొత్తం 17 మంది ప్రతివాదులు ఉన్నారు. ఇందులో రెండో నెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం, 17వ నెంబర్‌లో తెలంగాణ సీఎం పేర్లు ఉన్నాయి. మిగిలిన జాబితాలో బీజేపీ, సీబీఐ, తెలంగాణ స్టేట్, తెలంగాణ డీజీపీ, సీపీ, మొయినాబాద్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, రామచంద్ర భారతి, నందు కుమార్, తుషార్ వెల్లంపల్లి, సింహయాజీ, ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, శ్రీనివాస్, సిట్ సభ్యులు రేమ రాజేశ్వరి, కమలేశ్వర్‌లు ఉన్నారు. వీరందరికీ సర్వోన్నత న్యాయ స్థానం నోటీసులు జారీ చేసింది. కాగా ఈ పిటిషన్‌ను ఈ నెల 13న విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, కేసు న్యాయస్థానం పరిధిలో ఉన్నందున దర్యాప్తు కొనసాగించకూడదని స్టేటస్ కో ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను జూలై 31 వరకు వాయిదా వేసింది. అయితే ఇందుకు తగ్గట్టుగా ఆదేశాలు వెలువడకపోవడంతో నోటీసులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వచ్చే రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. ఆ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు పలుచోట్ల వడగండ్లు కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని తెలిపింది. దక్షిణ తమిళనాడు నుంచి తమిళనాడు, రాయలసీమ, తెలంగాణ, విదర్భ మీదుగా ఉత్తర కొంకణ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. శుక్రవారం రాత్రి 8:30 గంటల వరకు రాష్ట్రంలో 132 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దలో అత్యధికంగా 5.18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 25కుపైగా ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల వడగండ్లు పడ్డాయి.

శ్రీ జయ దుర్గ ఆలయంలో చోరీ

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ దేవాలయ ప్రాంగణంలో శ్రీ జయ దుర్గ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్మించుకున్న శ్రీ జయ దుర్గా ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ లింకును తొలగించి చోరీకి పాల్పడ్డారు. వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ పర్యవేక్షణలో క్రైమ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శ్రీ జయ దుర్గ టెంపుల్‌లోకి చొరబడి హుండీ లింకును తొలగించి చోరీకి పాల్పడ్డారు. టెంపుల్ పూజారి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు పర్యవేక్షించారు. టెంపుల్‌లోని హుండీ ఫిబ్రవరి 21 నాడు తెరిచారని, ఇప్పుడు వరకు రెండు వారాలు మాత్రమే అవ్వడంతో రూ. పదివేల నుంచి 20 వేల వరకు నగదు చోరీకి గురైందని అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రుల ఉత్సవాలకు కార్పొరేటర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-వనస్థలిపురం

శారదానగర్ శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ కమిటి వారి ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఉగాది నుంచి 31వ తేదీ శ్రీ రామ నవమి వరకు నిర్వహించే వసంత నవరాత్రుల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలలో పాల్గొనాలని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడి కి దేవాలయ కమిటి సభ్యులు అధ్యక్షులు యాదగిరి రావు, హరి ప్రసాద రావు , సత్య రెడ్డి , మాధవ రెడ్డి తదితరులు శుక్రవారం ఆహ్వానం పత్రం అందజేశారు.

'పది' పరీక్షలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా రెవెన్యూ సూర్యలత
- పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత సంబంధిత అధికారులను ఆదేశించారు. పది పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం తన ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖాధికారిణి, వైద్య, పోలీస్, జలమండలి, విద్యుత్, ఆర్టీసి, పోస్టల్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 13వరకు ఎస్ఎస్‌సీ పరీక్షలు జరగనున్నాయని, ఇందుకోసం జిల్లాలో మొత్తం 344 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 72,114 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెంటర్లకు ముందుగానే చేరుకోవాలని, పరీక్ష కేంద్రాలలోకి గంట ముందుగానే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. కావున విద్యార్థులందరూ ఆ సమయానికల్లా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్సు షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా స్పెషల్ బస్సులను నడపాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. పరీక్ష సమయంలో విదుత్తు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని జలమండలి అధికారులకు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్తు, వాటర్ వర్క్స్, వైద్య, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి, జీహెచ్ఎంసీ సీఎంఓహెచ్ కె.పద్మజా, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సునీత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రసాద్, ఏసీపీ మహేశ్వర్, మెడికల్ ఆఫీసర్ నాగరాజు, శ్రీబాల, టీఎస్ఆర్టీసీ అధికారి కిషన్ రావు, పోస్టల్ అధికారి రాధకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్

విద్యుత్ షాక్ తగిలి ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రాహీం పట్నం నియోజకవర్గంలో ఉన్న పెద్ద అంబర్ పేట నగర పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఎలక్ట్రీషియన్ దేవిడి నరేందర్ రెడ్డి గురువారం పసుమాముల గ్రామ పరిధిలో గల అశోక్ అతన్ భాయ్ వెంచర్ లోని చేపల చెరువు వద్ద విద్యుత్ మరమ్మతు పని కోసం ఆకుల ఈశ్వర్ విజ్ఞప్తి మేరకు అక్కడికి చేరు కుని పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం పూట విద్యుత్ షాక్‌కు నరేందర్ రెడ్డి గురయ్యాడు. దాంతో అతని బంధువులకు ఈశ్వర్ విషయాన్ని చెప్పి, బాధితుడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురంలో ఉన్న ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటి కే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల తన తమ్ముడు మృతి చెందా డని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు మృతుడి బంధువులు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్ డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని బస్తీ, కాలనీలో కరెంట్ అధికారులు నాయకులు కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. జాకీర్ హుస్సేన్ కాలనీ వద్ద ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫారం వద్ద త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేయాలని, తాగునీటి వసతి కల్పించి, రోడ్లు, డ్రయినేజీ, వీధిదీపాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని, అసంపూర్తిగా మిగిలి పోయిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. తాగునీటి వసతిని త్వరలోనే కల్పిస్తామన్నారు. దశల వారిగా అన్ని పను లు పూర్తి చేసి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బలాల



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఉద్యోగాల కోసం యువత నిరీక్షించకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. శుక్రవారం మాలక్ పేట నియోజకవర్గం అజాంపురా డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటైన గ్యాలరీని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు, అనంతరం నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అన్ని రకాల డిజైన్లు ప్రత్యేకత ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత, జాగ్రత్త పాటించాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా కష్టపడి పురోగతి చెంది వినియోగదారులకు మంచి సేవలు అందించినప్పుడే వారు ఎల్లప్పుడూ మీ సేవ సౌకర్యాలు అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షేక్ మొహిద్దిన్, అబ్రర్, సయ్యద్ అలీమ్ సభ్యులు సిబ్బంది, ఎంఐఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు



స్విమ్మింగ్ పూల్ నిర్వహణ పరిశీలన

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం రెడ్డి వాటర్ ట్యాంక్ వెనక నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో కొన్ని రోజులుగా లోపం వాటిల్లింది. గతంలో ఉన్న బోర్ నిర్వహణ లోపం వాటిల్లడంతో స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ట్యాంకర్ల సహాయంతో వాటర్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం సిమ్మింగ్ పూల్‌కు ఆయన స్వయంగా వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల్లో స్విమ్మింగ్ పూల్ నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బి.యన్.రెడ్డి డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన సంక్షేమ సంఘాలతోనే అభివృద్ధి

- కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



నవతెలంగాణ-హైదరాబాద్

కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాయకులు ఐక్యమత్యంగా ఉండి కాలనీ సంక్షేమ సంఘాలు పటిష్టంగా ఉండేలా కృషి చేయాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. చిల్కానగర్ డివిజన్ ఎస్సీ మాదిగ సంక్షేమ సేవ సంఘం అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన నరసింగరావును వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ శాలువతో సత్కరించి అభినందించారు కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రధానకార్యదర్శి మోగిలిపాక రాంచెందర్, ఉపాధ్యక్షులు పాలమకుల పరుశు రాములు, కోశాధికారి అంతగల్ల అశోక్, సలహాదారులు కురెల్లి యాదగిరి, వాతల యాదగిరి, సంయుక్త కార్య దర్శులు జోగు సుదర్శన్, కార్యదర్శి ఎరవెల్లి ఎల్లయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, అశోక్ చారీ, రామానుజం, బాలు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో కాలనీ వాసులకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తున్నానని జల్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్ అన్నారు. శుక్రవారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో 8వ వార్డులో ఉన్న హబిబ్ కాలనీలో మిషన్ భగీరథ పథకంలో పైపు లైన్ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో కోట్లాది రూపాయల నిధులతో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కాలనీల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రయినేజీలు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు సరఫరా, సీసీ,బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.



చలో ఢిల్లీ గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-నాగోల్

మజ్దూర్ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ అందుకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం నాగోల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాగోల్ డివిజన్ అధ్యక్షులు టి బాలస్వామి అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా కోశాధికారి చైతన్యలతో పాటు పలువురు పాల్గొని విడుదల చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సీఐటీయూ , తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. కనీస వేతనం రూ. 25000, పెన్షన్ రూ.10,000 చొప్పున అందరికీ చెల్లించాలని, అదేవిధంగా అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతికి చెందిన రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని, 60 ఏండ్లు పైబడిన ప్రతీ ఒక్కరికి పెన్షన్ చెల్లించాలని, వీటితో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చైతన్య కోరారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు లతీఫ్ ,ఎల్ శంకర్ ,ఎండి రహిమత్, బాలగౌడ్, ఎర్రయ్య ఎల్ . కృష్ణలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రాందాస్ అగర్వాల్ జయంతి



నవతెలంగాణ-నాగోల్

అంతర్జాతీయ వైశ్య మహా సమ్మేళన పరివార్ వ్యవస్థాపకుడు శ్రీ రామదాసు అగర్వాల్ 88వ జయంతిని శుక్రవారం ఆర్యవైశ్య భవన్ వైశ్య హాస్టల్లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐ.వి.ఎఫ్ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త, జాతీయ కార్యనిర్వహణ అధ్యక్షుడు గంజి రాజమౌళి గుప్తలు పాల్గొని అగర్వాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా కేకును కోసి పేదలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ వైశ్య జాతికి రాందాస్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. అంతర్జాతీయ వైశ్య మహా సమ్మేళన పరివార్ స్థాపించిన రాందాస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ తెలంగాణ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, రాష్ట్ర కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, యూత్ అధ్యక్షులు కట్ట రవి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఉటుకూరి శ్రీనివాస్, నర్సింగరావులతో పాటు పలువురు ఐవీఎఫ్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ మహరాజ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేదని, నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసమే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.అర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆమరణ దీక్షకు పూనుకోవటం జరిగిందని బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మీడయాతో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ నిరుద్యోగ యువకుల పక్షాన నిలబడి, వారికి జరిగిన అన్యాయానికి ప్రభుత్వాన్ని నిలదీస్తూ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని తెలిపారు. దాంతో ఆమరణ దీక్షకు పూనుకొన్న ప్రవీణ్ కుమార్ తో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర కోఆర్డినేటర్లు బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, డా.ఎం.వెంకటేష్ చౌహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాగిల్ల దయానందరావు, రాష్ట్ర అధికార ప్రతినిధులు డా.సాంబశివ గౌడ్, అరుణ క్వీన్‌లతోపాటు అనేకమందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం దుర్మార్గాన్ని ఎండకట్టి సీఎం కేసీఆర్‌ను గద్దె దింపేవరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించి బీఎస్పీని అధికారంలోకి తీసుకురావటానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీక్‌పై ఓయూలో నిరసన



నవతెలంగాణ-ఓయూ

ఓయూ జేఏసీ,టీఎస్ జేఏసీ ల ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూ ఎన్‌సీసి గెట్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. వారు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ రోజుకో మలుపు తిరుగుతూ ఉన్న 30 లక్షల మంది తెలంగాణ నిరుద్యోగుల జీవితం తో చెలగాటం ఆడుతున్న టీఎస్ పీఎస్సీ చైర్మెన్ జనార్ధనరెడ్డి , కార్యదర్శి , సభ్యులను తొలగించకుండా కాపాడుతున్న కేసీఆర్ నిరంకుశానికి వ్యతిరేకంగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ డా. భట్టు. శ్రీహరి మాట్లాడుతూ.. తన కూతురిని లిక్కర్ కుంభకోణం నుంచి కాపాడేందుకు రాష్ట్ర మంత్రులను ఢిల్లీ తరలించిన సీఎం కేసీఆర్.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో ఇంత జరుగుతున్నా ప్రతిస్పందన శున్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తుము. నవీన్ యాదవ్ గడ్డం శ్రీనివాస్, శివరాత్రి. ప్రశాంత్ , ఎం.శ్రీనివాస్ రెడ్డి , సూర్యం , మిడతానపల్లి .విజయ్ ,డాన్ శ్రీను , రాజేష్ ,నాగరాజు, భీమ్ రావు నాయక్ లు పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డి విజయం అధికార పార్టీకి చెంపపెట్టు

- మాజీ సింగిల్ విండో చైర్మెన్ కొలను శంకర్



నవతెలంగాణ-మీర్‌పేట్

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలవడం అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెంపపెట్టు లాంటిదని మాజీ సింగిల్ విండో చైర్మెన్ కొలను శంకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన తాపస్ అభ్యర్థి ఏవీఎన్ గెలిచిన సందర్భంగా మీర్‌పేట్ చౌరస్తాలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నియంత పాలన సాగుతోందని తెలుపటానికి ఈ ఎన్నికలే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మీర్ పేట్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి సోమేశ్, మధు, పార్టీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్
- ఘటనపై సీఎం కేసీఆర్ స్పందించాలంటూ ప్రగతి భవన్ ముట్టడి, అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పరీక్ష పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీలో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజి ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలంటూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నినాదం అయినటువంటి నీళ్ళ,నిధులు, నియామకాలు, అనే నినాదంపై తెలంగాణ ఉద్యమ పోరాటంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని అన్నారు. అయితే టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజి వల్ల 30 లక్షల మంది నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ ఘటనపై హై కోర్ట్ సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, గర్ల్స్ కన్వీనర్ నాగజ్యోతి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురాం, రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి . శివ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మెట్టల చైతన్య రాష్ట్ర నాయకులు పవన్ చౌహన్, నాయకులు శృతి ,విజయ్ , ఆకాష్, శ్రీకాంత్ , శివ, తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, నారాయణగూడ, పోలీస్ స్టేషన్లకు తరలించారు.

'సక్సెస్ కంపాస్' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వీరేందర్ రచించిన 'సక్సెస్ కంపాస్' పుస్తకాన్ని తెలంగాణ బీసీ వెల్ఫేర్ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఐఏఎస్, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్లు మల్లేశం, గణేష్, డాక్టర్ బాలాచారి అలోక్ కుమార్ శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్ర వెంకటేశం ఐఏఎస్ మాట్లాడుతూ ఉద్యోగార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ పుస్తకం ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు.



అరుణాచల్ ప్రదేశ్‌లో ఆర్మీ హెలీకాప్టర్ కుప్పకూలిన కూలిన ఘటనలో మృతి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి మృతదేహాన్ని హైదరాబాద్‌కు శుక్రవారం తీసుకొచ్చారు. కల్నల్ వీవీబీ రెడ్డి స్వస్థలం బొమ్మల రామారం కాగా ఆయన కుటుంబం మల్కాజి గిరిలో నివా సం ఉంటోంది.



కల్నల్ మృతికి నివాళులు



నవతెలంగాణ-కాప్రా

ఆర్మీ హెలీకాప్టర్ కుప్పకూలిన కూలిన ఘటనలో లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి, మేజర్ జయంత్‌లు మృతికి చర్లపల్లి డివిజన్ లోని రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం నివాళులర్పిం చారు. చక్రిపురం చౌరస్తాలో వారి ఫోటోలకు పూలమాలవేసి నివాళులర్పిం చారు. రెడ్డి కాలనీ మాజీ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, అధ్యక్షులు రంగారెడ్డి ఉపాధ్యక్షులు సుదర్శన్, భూమి రెడ్డి కోశాధికారి తిరుపతి రెడ్డి, రవీందర్ రెడ్డి, జీవన్ రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

తిరుమల కాలనీలో ప్రజలకు తప్పని తిప్పలు

- జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నా ఇంకా అందని మంచి నీరు..
- కాలనీల్లో నిలిచిన డ్రయినేజీ నీరు
- ఎమ్మెల్యేకు పిర్యాదు చేసినా పరిష్కారం కానీ సమస్యలు



నవతెలంగాణ-హయత్ నగర్

జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికీ మంచి నీరు(మున్సిపల్ నీరు)కొన్ని కాలనీలకు అందడం లేదు అంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ నగరంలో ప్రతి కాలనీ కి, ప్రతి ఇంటికి నీరు అందుతుందని మన పాలకులు చెబుతున్నారు కానీ హయత్ నగర్ డివిజన్ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీలో నీరు అందకపోవడంతో పాటు ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఈ కాలనీ 2009లో ఏర్పాటు అయింది. అందులో సుమారు 150 ఇండ్లకు చెందిన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అయిన డ్రయినేజి వసతి,మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటు, రోడ్లు నిర్మాణం,వీధి దీపాల స్తంభాలు ఏర్పాటు లాంటివి ఆ ప్రాంతంలో వెంచర్ ఏర్పాటు చేసిన వారు కల్పించేలా ప్రభుత్వ నిబంధనలు ఉన్నా కూడా కేవలం ప్లాట్లు చేశాక వాటిని లాభాలకు విక్రయించేసి అక్కడి నుంచి వారు పరారీ అవుతున్నారని ఆరోపణలున్నాయి. దానికి ఆనుకుని ఉన్న ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో సైతం ఇదే సమస్యలు ఉన్నా కూడా ఆ తరువాత ఆ ప్రాంతాల్లో నిర్మాణాలు చేసుకుని, నివాసం ఉండే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక అప్పటి నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హయత్ నగర్ డివిజన్ శివారు కాలనీ కావడంతో గతంలో ఎవరు కూడా పెద్దగా ఆసక్తి చూపలేదు. రాను రాను పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చాలా మంది సొంతంగా ఇండ్లు నిర్మించుకుని ఉందామని గతంలో కొనుగోలు చేసిన ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాక కనీస సౌకర్యాలు లేవని తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడంతో ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తున్నారు.చూడాలి మరి ఈ కాలనీల్లో ఉన్న సమస్యలను ఇప్పటికైనా పరిష్కరిస్తారో లేదో..

సీఎం క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఇంటి చుట్టూ మాత్రమే సీసీ రోడ్లు

ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయంలో వ్యక్తి గత సిబ్బంది అయిన ఓ వ్యక్తి ఆర్టీసీ మజ్దూర్ కాలనీ లో ప్రాంతంలో నివాసం ఉండడంతో ఆయన ఇంటి చుట్టూ సీసీ రోడ్లు వేశారని, మిగతా ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయలేదని అక్కడి కాలనీ వాసులు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు డ్రయినేజి నీరు సులభంగా వెళ్లేందుకు మార్గం సుగమం కాకపోవడంతో అట్టి నీటిలో సొప్ప చేరి నీరు నిలిచిపోవడంతో దోమల బెడదతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో ప్రజలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీ ఉపాధ్యక్షుడు సూరి విజ్ఞప్తి చేశారు.

ఏడాది క్రితం మంచి నీటి పైప్‌లు వేశారు

ఏడాది క్రితం మంచి నీటి పైప్‌లు వేశారు కానీ ఇంకా పనులు కాలేదు. పైప్ లైన్ తవ్వేందుకు వేసిన పైపులు ఇంకా అక్కడే ఉన్నాయి. పలువురు ఇంటి ముందు డ్రయినేజీ నీరు నిలిచిపోవడంతో పాటు,వర్షపు నీరు వెళ్లే ట్రంక్ లైన్ లోకి డ్రయినేజి పైప్ లైన్ కలపడం వల్ల కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అదేవిధంగా వీధి దీపాల స్తంభాలు కూడా ఉంది. మా సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరుతున్నాము.

– యాదగిరి, తిరుమల హౌసింగ్ కాలనీ వాసి

'నిరుద్యోగ యువత ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలి'

నవతెలంగాణ-నాచారం



నిరుద్యోగ యువత ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దుర్గా నగర్‌లో మెయిన్స్ హెయిర్ స్టైల్ కటింగ్ షాపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. నిరు ద్యోగ యువత తమ ప్రతిభకు అనుగుణంగా ఉపాధి రంగా లను ఎంచుకొని ముందుకు సాగినప్పుడు అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. స్వయం ఉపాధి రంగాలలో రాణిస్తూ నిరుద్యోగ యువత ఇతర యువకు లకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయ కులు పొన్నాల మహేందర్, రాపోలు శీను, అంజి మాదిగ, మెయిన్స్ హెయిర్ స్టైల్ కటింగ్ షాప్ నిర్వాహకుడు రాకేష్ స్థానికుడు సురేష్ తది తరులు పాల్గొన్నారు.

అనాథ పెండ్లికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-మల్కాజిగిరి



వినాయక్ నగర్ కు చెందిన 'స్వాతి' తల్లి దేవిక రెండు సంవత్సరాల క్రితం క్యాన్సర్ వ్యాధితో, 9 సంవత్సరాల క్రితం తండ్రి హరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దాంతో స్వాతి వినాయక్ నగర్‌లో తనకు వరసకు మేనత్త అయ్యే శారద దగ్గర ఉంటోంది. ఇటీవల స్వాతికి పెండ్లి కుదరింది. ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఈ సమస్యను బీఆర్ఎస్ మల్కాజిగిరి మీడియా సెల్ కన్వీనర్ గుండా నిరంజన్, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఎమ్మెల్యే రూ. 25 వేలు, గుండా నిరంజన్ మరో రూ. 10 వేలు అందజేయడంతో శుక్రవారం మల్కాజిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గుండా నిరంజన్ చేతుల మీదుగా స్వాతికి ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. బీఆర్ఎస్ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ , నాయకులు ఫరీద్, చంద్రకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- జిల్లా ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులు కలిగి ఉండాలని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి జిల్లా ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేని వారు తప్పకుండా ఆధార్ కార్డులు కలిగి ఉండేలా కమిటీ చూడాలని సూచించారు. ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ పదేండ్లకోసారి గుర్తింపు కార్డు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కేంద్ర గుర్తింపు సమాచార నిధి (సీఐడీఆర్)లో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందనిజజ ఈ ప్రక్రియ కారణంగా పౌరుల సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుందని యూఐడీఏఐ తెలిపింది. దీనికి సంబంధించి మై ఆధార్ పోర్టల్లో కానీ లేనట్టయితే దగ్గరలోని ఆధార్ కేంద్రం నుంచి ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ఆధార్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోం దని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండేలా మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ విషయానికి సంబంధించి తర్వాత జరిగే సమావేశాల్లో తగిన పురోగతి ఉండాల్సిందిగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్డీఎమ్) కిశోర్ కుమార్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారిణి పావని, అసిస్టెంట్ మేనేజర్ సత్యకళ (యూఐడీఏఐ), ఈడీఎమ్ భాను ప్రకాశ్, మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తుండగా హైటెన్షన్ వైర్లు తగిలి వ్యక్తి మృతి

- పద్మారావునగర్‌లో ఘటన
- ఘటన బాధాకరం : మంత్రి శ్రీనివాస్

నవతెలంగాణ-బేగంపేట్



పార్కులో వాకింగ్ చేస్తుండగా హైటెన్షన్ వైర్లు మీద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని పద్మారా వునగర్ పార్కులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్సిగుట్ట బాబూజీ నగర్‌కు చెందిన ప్రదీప్(43)శుక్రవారం ఉదయం 6-00 గంటలకు పద్మారా వునగర్ పార్కుకు వచ్చి వాకింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో పార్కులో హై టెన్షన్ కరెంట్ వైర్ తెగి పడి ప్రదీప్ కాలుకు తాకడంతో అతను విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు, పద్మారా వునగర్ పార్కు దగ్గరికి చేరుకొని తమకు న్యాయం జరగాలని ఆందోళన చేపట్టారు. అంత పెద్ద హై టెన్షన్ వేరు తెగి పడటానికి కారణమేమిటో తెలియాల్సి ఉంది.

విద్యుత్ శాఖాధికారులతో మంత్రి చర్చలు

ప్రదీప్ మృతి చాలా బాధాకరమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం పద్మారావునగర్ పార్క్‌లో వాకింగ్ కోసం వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై ప్రదీప్ మృతి చెందగా, విషయం తెలుసుకున్న మంత్రి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు ప్రదీప్ మృతదేహాన్ని తీసుకురాగా అక్కడ ప్రదీప్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మతుని కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి మతుని కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం, ఆపద్బంధు కింద మరో రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని, అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సహాయంగా 10 వేలను అందజేయనున్నట్టు చెప్పారు. ప్రమాదంపై తగు విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

సమయ పాలన పాటించని అధికారులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో పాలన వ్యవస్థ అధికారుల నిర్వాకం వల్ల గాడి తప్పుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి అధికారులు, సిబ్బంది ఎవరూ సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్క విభాగానికి అధికారులు, సిబ్బందిని నియమించి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆ శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు వారి ద్వారా న్యాయం జరగడం లేదని.. వీరిపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కొరవడడంతో ఇక్కడ అధికారులు, సిబ్బంది ఆడిందే ఆట, పాడింది పాట అన్న చందంగా మారిందని తెలుస్తోంది. నవ తెలంగాణ విలేఖరి సర్కిల్ కార్యాలయానికి పరిశీలనకు వెళ్లగా ఉదయం 10:00 గంటలకు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఉండాల్సి ఉండగా కొందరు సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగతా అధికారులు ఎవరూ రాకపోవడం ఇక్కడ వారి పని తీరు ఎలా ఉందో అర్థం చేసు కోవచ్చు. రాజు గారు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో ఎవరికి తెలవదు...అదే విధంగా ఆయన పరివారం అసలు ఎప్పుడు వస్తారో ఎవరికి తెలియడం లేదు. ఏ సెక్షన్ లో చూసినా ఏదో 10, 20 నిమిషాలు కనబడతారు.. తరువాత మళ్లీ మాయమైపోతారు అని పలువురు ఆరోపిస్తున్నారు. ఏమన్నా అంటే తాము ఫీల్డ్ లో ఉన్నామని చెప్పుకుంటూ తమ ఇండ్లలో ఏసీ గదులలో కాలక్షేపం చేసుకుంటూ , నెలసరి వేతనాలు మాత్రం టంచన్ గా తీసుకుంటూ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. 11, 12 గంటలు అయినా అధికారులు తమ డ్యూటీలు సక్రమంగా నిర్వహించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఏ సెక్షన్ లో చూసినా ఏదైనా పని మీద వచ్చిన వారికి నిరాశ ఎదురవుతోంది. అధికారుల కోసం వస్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ,అర్థం కాక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న వారి అక్రమ అరెస్టులను ఖండించండి

- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం

నవతెలంగాణ-కాప్రా



ఘట్కేసర్ మండలం అవుషాపూర్ గ్రామంలోని 96 సర్వే నంబర్‌లో ఇల్లు లేని పేదలు 30 మంది సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ యాదయ్య, సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కార్యదర్శి సబితాల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేస్తే వారిని అరెస్ట్ చేసి స్టేషన్ లో పెట్టారని.. ఈ అక్రమ అరెస్టులను సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి సత్యం అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇల్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తా అని చెప్పి ఇంతవరకు ఎవరికీ ఇవ్వలేదన్నారు. అసలే పెరిగిన ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఇంటి అద్దె కట్టలేక, ఇంటి అద్దె భారం తగ్గితే కొంత ఆర్థిక భారం తగ్గుతుందని భావించి ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకుంటే వాళ్లను అక్రమంగా అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న నాయకులు ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేసిన పట్టించుకోని ప్రభుత్వం ఇల్లు లేని పేద ప్రజలు 60 గజాల స్థలం కోసం గుడిసెలు వేసుకుంటే అక్రమ అరెస్ట్ చేస్తారా.. ఇదేనా కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే నజరానా అని నిలదీశారు. ఇప్పటికైనా అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని కేసీఆర్ ప్రభుత్వం వెంటనే విడుదల చేసి వారికి 60 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయకపోతే ఘట్కేసర్ మండల ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సైనిక్‌పురిలో మిలిటరీ హోటల్ ప్రారంభం

నవతెలంగాణ- నేరేడ్ మెట్



నేరేడ్‌మెట్ పరిధిలోని సైనిక్‌పురిలో శుక్రవారం 1980 నాటి మిలిటరీ హోటల్ 2వ శాఖ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సినీ హీరో విశ్వక్ సేన్, అల్లరి నరేశ్, డైరెక్టర్ అనిల్ రావుపుడి, నిర్మాత సహెూ, డైరెక్టర్ హను రాఘవపుడి, నటుడు శత్రు తదితర ప్రముఖులు హాజరై హోటల్‌లోని పలు విభాగాలను ప్రారంభించారు. మొదటి 1980 మిలటరీ హోటల్ ఖాజాగూడ లొకేషన్‌లో గత మూడు సంవత్సరాలుగా విజయవంతంగా సేవలందిస్తు న్నామని నిర్వాహకులు తెలిపారు. నల్లగండ్లలో రాబోయే బ్రాంచిని ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. సైనిక్‌పురిలో రెస్టారెంట్‌తో పాటు, 'శ్రీ బాంక్వెట్స్' అనే ప్రీమియం, లగ్జరీ బాంకెట్ హాల్‌లను కూడా ప్రారంభించామన్నారు. తాము 1980ల నాటి సుగంధ ద్రవ్యాలు, వంటకాలను సంప్రదాయ దక్షిణ భారతీయ వంటకాలను తయారు చేయడానికి ఉపయోగిస్తామని తెలిపారు. అందుకే ఈ రెస్టారెం ట్ కు "1980ల మిలిటరీ హోటల్" అని పేరు పెట్టామని తెలి పారు. తమ రెస్టారెంట్ క్లాసిక్ ఫేర్ విభిన్న మెనూని అందిస్తుందన్నారు. స్థానికంగా లభించే పదార్థాలతో తయారు చేయబడి వేడి వేడి గా అందించబడుతుందని తెలిపారు.



రుణాల మంజూరీలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకం

- జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య
- బ్యాంకర్ల త్రైమాసిక సమావేశం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్దిదారులకు సకాలంలో రుణాలు అందచేసి వారి ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించాలని ఈ విషయంలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్ల త్రైమాసిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అర్హులైన వారికి అనేక సంక్షేమ పథకాల కింద రుణాలను మంజూరు చేస్తున్నాయని వాటిని లబ్దిదారులకు చేరేలా బ్యాంకర్లు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయడం మొదలుకొని వారికి రుణాలు అందించే వరకు బ్యాంకర్లు ఎంతో ముఖ్యభూమిక పోషిస్తారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏసీపీ వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 190 శాతం సాధించడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా త్వరిత గతిన రుణాలు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. దీంతో పాటు విద్యార్థులకు సంబంధించి వారి ఉన్నత చదువులకు విద్యారుణాలను అత్యధిక సంఖ్యలో మంజూరు చేయాలని ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు చూపకుండా ఉంటే ఎంతో వారికి మంచి భవిష్యత్తును అందించిన వారమవుతామని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన రుణాల ప్రగతిని మరింత ఎక్కువ సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు, ప్రాముఖ్యతా రంగాలలో లబ్దిదారులకు సకాలంలో రుణాలను అందించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని, నిజమైన లబ్దిదారులను ఆదుకోవాలని సూచించారు. బ్యాంకర్లు లబ్దిదారులకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని, తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని తిరస్కరించేటప్పుడు కావలసిన సలహాలు, కారణాలను దరఖాస్తుదారునికి తెలియచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా లీడ్ బ్యాంక్ మేనేజరు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అందచేసిన రుణాల వివరాలను తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కిశోర్ కుమార్, కెనెరా బ్యాంకు ఏజీఎమ్ ఇందిర, ఎస్బీఐ ఏజీఎమ్ సతీష్‌బీ యూబీఐ ఏజీఎమ్ ప్రకాశ్‌రావు, టీజీబీ యూసుఫ్, నాబార్డు అధికారి శివిశర్మ, ఆర్బీఐ అధికారి రాజేంద్రప్రసాద్, డీఆర్డీవో పద్మజారాణి, జడ్పీ సీఈవో దేవసహాయం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, ఆయా బ్యాంకుల అధికారులు, కంట్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈ టీ నరసింహ

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ ప్రాంతంలో స్వప్నలోక్ కాంప్లెక్స్ లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని సీపీఐ బృందం శుక్రవారం పరిశీలించింది.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈ టీ నరసింహ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం బిల్డింగు కుల్చివేయాలని అధికారులు నోటీస్ ఇచ్చారు కానీ రాజకీయ ఒత్తిడి, అసమర్థ అధికారుల వలన చర్యలు తీసుకోలేక పోయారన్నారు. దీని మూలంగా అగ్ని ప్రమాదం జరిగి ఆరుగురు చనిపోయారని తెలిపారు. మృతులు అందరూ 25 సంవత్సరాలలోపు ఉన్నవారే అని.. వారిపైనే కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదానికి బాధ్య లైన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని హెచ్చరించారు. పదేపదే ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు మంత్రులు, ప్రభుత్వ అధికారులు హడావిడి చేస్తూ కమిటీల పేరు మీద కాలయాపాయలను చేస్తున్నరు తప్ప బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్ యాజమాన్యాల నుంచి విచ్చలవిడిగా డబ్బులు తీసుకొని వారి అక్రమ వ్యాపారానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. అనేక భవనాల సమయం అయిపోయిన ప్పటికిని వాటిని కూల్చివేయడం లేదని.. అదేవిధంగా వాటిని రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. వీటన్నిటిని తక్షణమే మానుకోవాలని లేనిచో భవిష్యత్తులో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి మాట్లాడుతూ ఉపాధి అవకాశాల కోసం నగరానికి వస్తున్న యువత ఇటువంటి సంఘటనను చూసి భయాందోళనకు గురవుతున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరానికి గుర్తింపు తెస్తా అని పదేపదే మీటింగ్ లలో చెబుతున్న మంత్రి కేటీఆర్ వరుస ఘటనల పై ఎందుకు మున్సిపల్ అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయలేదో సమాధానం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు ఉమర్ ఖాన్,కొమురెల్లి బాబు,తార్నాక డివిజన్ కార్యదర్శి లతీఫ్ తోపాటు లక్ష్మణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు

- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- స్వగ్రామాలకు తరలింపు

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై మహంకాళి పోలీసులు కేసు నమోదు చేశారు. కాంప్లెక్స్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు . 49/2023 యూ / ఎస్ , 304 పార్టు 2 , 324,420 ఐపీసీ సెక్షన్ 9 (బి) పేలుడు పదార్థాల చట్టం 1884 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్ తెలిపారు. రాత్రి 7.15 నిమిషాలకు కాంప్లెక్స్‌లోని 5 వ అంతస్తు బీ బ్లాక్ లో ఉన్న కేడియా ఇన్ఫోటెక్ లిమిటెడ్ , వికాస్ పేపర్ ఫ్లెక్సో ప్యాకింగ్ లిమిటెడ్ నుంచి మంటలు పొగలు వ్యాపించినట్టు గుర్తించారు. భద్రత చర్యలు తీసుకో వడంలో విఫలమైన స్వప్నలోక్ సూర్యకిరణ ఎస్టాబ్లిష్మెంట్ అసోసియేషన్ , కేడియా ఇన్ఫోటెక్ లిమిటెడ్ , వికాస్ పేపర్ ఫ్లెక్సో ప్యాకేజింగ్ లిమిటెడ్ , క్యూనెట్ విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రయివేటు లిమిటెడ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టున్నట్టు పోలీసులు వెల్లడించారు . మృతులంతా పొగ వలన చనిపోయారని గాంధీ ఫోరెన్సిక్ అధికారులు తెలిపారని పోలీసులు స్పష్టం చేశారు.

మృతదేహాలు స్వగ్రామాలకు తరలింపు

స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన ప్రమీల (22) , వెన్నెల (20) , త్రివేణి (22), శివ (22), శ్రావణి (22), ప్రశాంత్ (22) మృతదేహాలకు గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగం హెచ్వోడి కృపాల్ సింగ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు . అనంతరం పోలీసులు సహకారంతో వారి పార్థీవ దేహాలను ప్రభుత్వ అంబులెన్స్‌లలో వారి స్వగ్రామాలకు తరలించారు .

ఒక్కొక్కరిది ఒక్కో దీన గాథ వెన్నెల .... వరంగల్ జిల్లా , నర్సంపేట్ మండలం మర్పల్లి గ్రామంలో నివసించే రవి సుజాత దంపతులకు ఒక కొడుకు ఒక కుమార్తె వెన్నెల . వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కూతురిని డిగ్రీ వరకు చదివించారు. వెన్నెల హైదరాబాద్ నగరానికి వెళ్లి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి కుటుంబ కష్టాలన్ని దూరం చేస్తానని చెబుతుండేది. నగరానికి వచ్చి హాస్టల్లో ఉంటూ ఖాళీగా ఉండలేక స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఓ ప్రయివేటు సంస్థలో ఉద్యోగం లభించిందని అందుకోసం రూ . 1.4 లక్షలు చెల్లించాలని చెప్పడంతో అప్పులు చేసి కట్టామని , ఆ తర్వాత ల్యాప్టాప్ కోసం మరోసారి రూ . 40 వేలు అప్పు చేసి పంపించామని రవి , సుజాతలు విలపిస్తూ చెప్పారు. మరో వారం రోజుల్లో తన క్లాస్‌మేట్ పెండ్లి ఉందని తాను స్వగ్రామం వస్తున్నానని గురువారం ఉదయం ఫోన్ చేసి చెప్పిందన్నారు. అర్ధరాత్రి తమకు ఫోన్ రావడంతో హైదరాబాద్‌కు వచ్చామని తన కూతురు మృతదేహంతో బోరున విలపిస్తూ చెప్పారు.

అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన యువతి , యువకుల కుటుంబ సభ్యులంతా వ్యవసాయ కూలీ చేసుకుంటూ జీవనం గడిపేవారే . కాయ కష్టం చేసి వారి వారి పిల్లలను ఓ స్థాయి వరకు చదివించారు. ఇక ఉద్యోగం చేస్తున్నారు కుటుంబానికి కొండంత అండగా ఉంటారు అనుకున్న సమయంలో వారి కుటుంబాల అశలు ఒక్కసారిగా తల్లకిందులయ్యాయి. కుటుంబాలకు అండగ ఉండే యువతీ యువకులంతా అందనంత ఎత్తుకు వెళ్లిపోయారా బిడ్డల్లారా అంటూ గాంధీ మార్చురి వద్ద మృతుల కుటంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



మంత్రులు పరామర్శ

శుక్రవారం మధ్యాహ్నం గాంధీ ఆస్పత్రిలోని మార్చురి వద్దకు రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్ , మహమూద్ అలీ , హైదరాబాద్ నగర్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ , అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు.

దత్తాత్రేయనగర్ డివిజన్‌లో డాక్టర్ ఏఎస్ రావు పర్యటన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా టీడీపీ గోషామహల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ఎస్.రావు పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి దత్తాత్రేయనగర్ డివిజన్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ నగర్, కుమ్మర్వాడి, గంగాబౌళి బస్తీల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్ళి తెలుగుదేశం పార్టీ కరపత్రాన్ని ప్రజలకు అందజేసి, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం డాక్టర్.ఏ.ఎస్. రావు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నగరాభివృద్ధి కూడా టీడీపీ హయాంలోనే జరిగినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.అనిల్ కుమార్, మహ్మద్ రఫీఖ్ అహ్మద్ షరీఫ్, అహ్మద్ షా, కార్తీక్ తదితరులు: పాల్గొన్నారు.

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్‌గా వారిజారాణి



నవతెలంగాణ-హైదరాబాద్

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఏర్పాటు చేసిన మొట్ట మొదటి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ వారిజారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ విశ్వవి ద్యాలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనను ప్రిన్సిపాల్‌గా నియమించిన వైస్ ఛాన్సలర్ విజ్జులత, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ విజ్జులత, వైస్ ప్రిన్సిపాల్ డా.శైలజ, తెలుగు శాఖ అధ్యాపకులు డా.గడ్డం మోహన్‌రావు, డా.ఎం రాజ్‌కుమార్, డా.వెంకట్రామిరెడ్డి, డా.ఎం.దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రవాణా సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

- సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి



నవతెలంగాణ-అడిక్‌మెట్

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి డిమాండ్ చేశారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఇందిపార్కు ధర్నా చౌక్‌లో కొనసాగుతున్న 48 గంటల రిలే నిరాహార దీక్షలో కుమార స్వామి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కె.అజయ్ బాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి గాయపడితే, జబ్బు చేస్తే ఆదుకునే దిక్కులేదన్నారు. వీరి సంక్షేమానికి ఏ స్కీములు లేవనీ, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ జీడీలో నాలుగు శాతం వ్యాట్ అందిస్తున్న రవాణా రంగాన్ని ప్రభుత్వాలు అశ్రద్ధ చేస్తున్నాయన్నారు. రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులు లేకపోతే పనులు ముందుకు సాగవనీ, అంత కీలకమైన వృత్తిలో ఉన్న రవాణా రంగా కార్మికులు నిత్యం ప్రమాదకరమైన జీవితాన్ని గడుపుతూ కూడా దేశానికి సర్వీస్ చేస్తున్నారన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం పూనుకోవాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర ఉపాధ్యక్షులు రాములు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మోటార్ వెహికల్ యాక్ట్ 2019ని తెచ్చి అగ్రిగేటర్స్ పేరుతో రవాణా రంగాన్ని మల్టీ నేషనల్ కంపెనీస్‌కి అప్పగించే కుట్ర చేస్తున్నదన్నారు. సింగిల్ ఓనర్ కం డ్రైవర్స్‌గా ఉండే వారు తట్టుకోలేని విధంగా భారాలు వేసి వేధిస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ మన ఆదాయాలను కొల్లగొటుతున్నారన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా డ్రైవర్స్ పోరాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా చూస్తూ భారాలు వేయడం,స్పెషల్ డ్రైవ్స్ పేరుతో చాలానాలు వేయడానికి చూపిస్తున్న శ్రద్ధ వారి జీవితాల్లో వెలుగులు నింపే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2019 మోటార్ వాహన చట్టంలో తెచ్చిన సవరణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు మద్దతుగా రాష్ట్ర కోశాధికారి, రాష్ట్ర అధ్యక్షుడు కె.సతీష్, నగర సహాయ కార్యదర్శి డీల్ మోహన్. నాయకులు కలీమ్, ఉమేష్ రెడ్డి, అహ్మదాన్, గౌస్, శ్యామ్, మహేష్, జునైద్, ఆర్బస్ ఖాన్, మునీష్, అనీఫ్ తదితరులు కూర్చున్నారు. హరి, సురేష్, వాహిద్, ఫారీద్, మోహినుద్దీన్, మోయిన్, అబేద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను చిన్నచూపు చూస్తున్న బీజేపీ

- బడ్జెట్లో బీసీల వాటా పెంచాలి
- అఖిలపక్ష సమావేశానికి హాజరు కండి
- మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల వాటా పెంచాలనీ, బీసీలను చిన్న చూపు చూడడం తగదని బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రూ.45 లక్షల కోట్ల బడ్జెట్ లో 56శాతం గల బీసీలకు కేవలం రూ.2వేల కోట్లు కేటాయించడం బీసీలను తీవ్రంగా అవమానించడం అన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీల బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం సిద్ధించిన నాటి నుంచి జనగణనలో బీసీ కుల గణన ఇంతవరకు చేపట్టలేదన్నారు. త్వరలో చేపట్టబోయే జనగణలో బీసీ కులాల గణన చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. ప్రజల సంపదను ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో రిజర్వేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉపాధి పొందుతారనీ, అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ పేదవారి పొట్ట కొడుతున్నారన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ కోల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు డిప్యూటీ మేయర్ పరామర్శ



నవతెలంగాణ-ఓయూ

నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్ని ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వప్న లోక్ కాంప్లెక్స్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ స్పందిస్తూ సికింద్రాబాద్ స్వప్నలో కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాద ఘటన బాధాకరం అన్నారు. అంత చిన్న వయస్సు వాళ్లు ఇందులో చనిపోయారనీ, వరంగల్, మహబూబాద్ జిల్లాలోని ఐదు కుటుంబాల్లో ఈ ఘటన తీరని విషాదం నింపిందన్నారు. ప్రమాద ఘటన పై కమిటీ వేస్తున్నామనీ, క్లూస్ టీమ్ అధికారులు కాంప్లెక్స్‌లోని అన్ని అంతస్తుల్లో నమూనాలు సేకరిస్తున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ పరిధిలో రెండు మూడు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామనీ, చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటుందని డిప్యూటీ మేయర్ హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌లోకి బీజేపీ నాయకులు

నవతెలంగాణ-హైదరాబాద్



బీజేపీ ముషీరాబాద్ డివిజన్‌కు చెందిన శ్రీధర్ గౌడ్, ప్రేమలతా రెడ్డి, సుకన్య, సిద్దు, శ్రీవల్లి, యాదగిరి తదితరులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజేపీ కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో రూ.కోట్ల నిధులు వెచ్చించి రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి పైపులైనులను పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు సోమ సుందరం, సాంబశివరావు, దీన్ దయాల్ రెడ్డి, శివ ముదిరాజ్, లక్ష్మీ గణపతి దేవస్థానం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, భిక్షపతి యాదవ్, లక్ష్మణ్ గౌడ్, సుధాకర్ గుప్తా, రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ అరెస్ట్‌కు నిరసనగా బహుజన విద్యార్థుల ర్యాలీ, ధర్నా



నవతెలంగాణ-ఓయూ

పేపర్ల లీకులను నిరసిస్తూ ఆయా పరీక్షలను రద్దు చేయాలని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పార్టీ ఆఫీసులో ఆమరణ దీక్షను చేపడితే ఆ దీక్షను భగ్నం చేసి ప్రవీణ్ కుమార్‌ని అరెస్ట్ చేసి ఆయన ఇంటికి తరలించి హౌస్ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఓయూలో బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జాక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించా రు. అనంతరం ఓయూ విద్యార్థి నాయకులు బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడు పులిగంటి వేణుగోపాల్, ఓయూ అధ్యక్షుడు పోమాల అంబేద్కర్, తగరపు నవీన్, భాస్కర్, ప్రవీణ్ ఆనంద్, సత్యం, ఆనంద్, స్వామి యుగంధర్, తదితర నాయ కులను అరెస్టు చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి అని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ కోరారు. డివిజన్‌లోని వీవీ గిరి నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా ప్రజలకు అందుతున్న ఉచిత కంటి వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కండ్ల అద్దాలు అందిస్తున్నారని తెలిపారు. మెరుగైన కంటి చూపు కోసం ఆపరేషన్ అవసరమున్న వాళ్లకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు వినయ్ కుమార్, సీనియర్ నాయకులు జాష్వా, బీజేపీ మహిళా నాయకురాలు విజయలక్ష్మి, కపా సిస్టర్, ఆశా వర్కర్లు దుర్గ, అంగన్వాడీ టీచర్ ప్రమీల, స్థానికులు పాల్గొన్నారు.

ఓయూ ఎంబీఏ విభాగానికి ఏషియన్ ఐ కానిక్ బ్రాండ్ అవార్డ్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళశాల ఎంబీఏ విభాగం అత్యంత ప్రతిష్టాత్మక అవార్డ్ సొంతం చేసుకుంది. అమెరికన్ మీడియా సంస్థ బ్రాండ్ స్టోర్ వారు దుబాయిలో జరిగిన ఏషియన్ బ్రాండ్ అండ్ లీడర్ షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో విభాగం హెడ్, ప్రిన్సిపాల్ ప్రొ.డి.రాములు ఈ అవార్డ్ ను అందుకున్నారు. ఓయూ ఎంబీఏ విభాగం 50 ఏండ్లుగా ప్లేస్ మెంట్స్, ఫ్యాకల్టీ రీసెర్చ్ ఆర్టికల్‌తో పాటు వివిధ రంగాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, పీహెచ్డీ విద్యార్థులు సాధించిన విజయాలు కొలమానంగా ఆ ప్రతిష్టాత్మక అవార్డ్ వచ్చిందని ప్రొ.శ్రీరాములు చెప్పారు. ఓయూ ఎంబీఏ విభాగం ప్రొఫెసర్స్ డీన్ వెంకటయ్య, బీఓఎస్ సుధ, ఆర్.నాగేశ్వర రావు, విద్యా సాగర్ రావు, జహంగీర్, సంపత్, సమున్నత, డా.స్మిత సాంబ్రాణి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డ్స్ రావాలని కోరారు. అవార్డ్స్‌తో అనేక బాధ్యతలు పెంచుతాయి అన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

నవతెలంగాణ-ఓయూ

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలా ప్రిన్సిపాల్ ప్రొ.డి.శ్రీరాములు అన్నారు. శుక్రవారం కళశాలలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళల అభ్యున్నతికి వారి ఎదుగుదల తోడ్పాటు చేయూత ఇవ్వాలని కోరారు. అనంతరం మహిళలకు పలు పోటీలు నిర్వహించిన గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొ.వెంకటయ్య, ప్రిన్సిపాల్, హెడ్ ప్రొ.శ్రీరాములు, ప్రొ.సుధ, ప్రొ.చంద్రిక, ఎఆర్.అనిత, సీవీ రంజని, డా.సంధ్య, డా.సమున్నత, డా.స్మిత సాంబ్రాణి, బోధనేతర ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, తదితరులు, పాల్గొన్నారు.

బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా బోరెల్లి సురేష్



నవతెలంగాణ-ఓయూ

బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా బోరెల్లి సురేష్‌ని నియమిస్తూ బీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. త్వరలో ఓయూ కమిటీ, గ్రేటర్ హైదరాబాద్ కమిటీలను నియమిస్తామని డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఈ సందర్భంగా బోరెల్లి సురేష్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టిన పిడమర్తి రవికి ధన్యవాదాలు తెలిపారు. రవి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాధ్యతతో విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తానని తెలిపారు. గడచిన ఐదేండ్లు ఓయూ అధ్యక్షులుగా ఎంతో నిబద్ధతతో పని చేశాననీ, అదే తరహాలో ఈ పదవిలో కూడా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చెవుల కిషన్, ప్రసాద్, బాలస్వామి, ఓయూ నాయకులు జోగు నరేందర్, సైదులు, గోవిక్, మధు, సాయి, శివ, ఆనంద్, ప్రవీణ్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఏప్రిల్ 5వ తేదీన కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మాజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీ ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు. నవతెలంగాణ-హైదరాబాద్



విద్యార్థులు పరిశోధన దిశగా అడుగులు వేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశ సమగ్రత, దేశ భవిష్యత్తు కోసం విద్యార్థులు పరిశోధనల దిశగా అడుగులు వేయాలని ఏపిటిఐ (సౌథర్న్ రీజన్) వైస్ చైర్మన్ డాక్టర్ వెంకట రమణ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి ఫార్మసీ కళాశాల గుంతపల్లి, అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో బయో అధ్యాయన్-2023 పేరిట జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ నేడు ఫార్మసీ రంగంలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ అందులో ప్రావీణ్యత సాధిస్తే వారికి మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రపంచంలో జరుగుతున్న ఔషధ ఎగుమతుల్లో ఎక్కువ శాతం మనదేశం నుంచే ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి.బి.కవికిషోర్, అవంతి కళాశాలల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరసోమయ్య, అద్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ అభినందనీయం

నవతెలంగాణ-హైదరాబాద్



కరాటే ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని అర్ఎన్ఎస్సీ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ స్టూడెంట్ ఇటీవల చంపాపేట్ ఎక్స్ రోడ్డులో జరిగిన ఖేలో బారాత్ కరాటే టోర్నమెంట్ లో పాల్గొనీ విజేతలుగా నిలిచారు. ఈ ఛాంపియన్ లో విజేతలుగా నిలిచిన ఎన్బీకేఏ (నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ) విద్యార్థులని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఉచిత కరాటే తరగతులను నిర్వహించేందుకు ప్రోత్సహించామన్నారు. బంజారా సంక్షేమ సంఘం తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రస్తుత దినాల్లో ఆడపిల్లల పై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవడం కోసం ఆడపిల్లలు తప్పని సరిగా కరాటే లాంటివి నేర్చుకోవాలన్నారు. కరాటే ఆత్మ, స్వీయ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. అర్ఎన్ఎస్సీ కాలనీలో ఉచిత శిక్షణ కరాటే తరగతులను నిర్వహిస్తున్న ఎన్బీకేఏ మాస్టర్ సుంకే శ్రీనిధిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రాహుల్, కె.రవీందర్ పాల్గొనారు.

దీన్ దయాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హైదరాబాద్



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజా దిన్ దయాల్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణులు ముషీరాబాద్, బోలక్ పూర్, రాంనగర్, అడిక్ మెట్ కంచర డివిజన్‌లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బోలక్ పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సోమ సుందరం, శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బీసీ విద్యార్థుల పథకాలకు 60శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వండి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్ర సింగ్‌కు వినతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్, హాస్టళ్ళ నిర్వహణ, గురుకుల పాఠశాలల నిర్వహణ, బీసీ కార్పొరేషన్ రుణాలు లాంటి పలు పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంటు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీద మాసాన్ రావు డిమాండ్ చేశారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. పైగా రాష్ట్రాలు అమలు చేస్తున్న స్కీములకు గ్రాంటు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ పథకంకు 60 శాతం గ్రాంటు ఇవ్వాలిలని కోరారు. హాస్టళ్ళు, గురుకుల పాఠశాల నిర్వహణ పథకముకు 60 శాతం గ్రాంటు ఇవ్వాలనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 370 బీసీ కాలేజీ హాస్టళ్ళు, 134 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణలో 290 బీసీ కాలేజీ హాస్టళ్ళు. 280 బీసీ గురుకుల పాఠశాలలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయనీ, వీటికి స్వంత భవనాలు నిర్మించడానికి 80 శాతం గ్రాంటు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో రెండు బీసీ కార్పొరేషన్లు 12 బీసీ కుల ఫెడరేషన్లు కొనసాగుతున్నాయనీ, వీటి ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించడానికి హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు 60 శాతం బాలికల కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు 80 శాతం గ్రాంటు మంజూరు చేస్తామని కేంద్రమంత్రి హామీనిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంగళరావు రాంచందర్ రావు, బీసీ నాయకులు గుజ్జు కృష్ణ పాల్గొన్నారు.

చట్టాల ఉల్లంఘనలకు నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రభుత్వం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ-అడిక్‌మెట్

చట్టాలను గౌరవించి వాటిని సక్రమంగా నడపాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చట్టాల ఉల్లంఘనకై నిర్విరామంగా కృషి చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశానికి హాజరైన ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ దర్యాప్తుల విచారణను దీటుగా ఎదుర్కోవాల్సింది పోయి చట్టాలను విధిగా గౌరవించాల్సిన స్థాయిలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన కుమారుడు కుమార్తెల కోసం అందుకు విరుద్ధంగా చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్నా దురుద్దేశ్య పూర్వక ప్రయత్నమే డీలే ట్యాక్టీస్ అన్నారు. ఆలే నరేంద్ర, ఈటల రాజేందర్,. టి.రాజయ్యల దురుద్దేశ అవినీతి ఆరోపణలపై ముందుండి చర్యలకు దిగి కేసీఆర్ తన కూతురు కవిత అవినీతిపై రక్షించే ప్రయత్నాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. గడిచిన 9ఏండ్లలో అధికార పార్టీ ఎన్నికల్లో రూ.వేల కోట్లు ఖర్చు చేసిందనీ, ఇన్ని కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అధికార కుటుంబం దుబాయ్ కేంద్రంగా లక్షలాది కోట్లు విదేశాలకు తరలిస్తున్న ఆరోపణలు ప్రజా బహుళ్యాలో, సంబంధిత వర్గాల సమాచారం ద్వారా చక్కెరలు కొడుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థలు తాత్సార్యం చేయటంలో అర్థమేమిటని అన్నారు. చట్టాలను నడపాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, కవిత కేసులో చట్టాల ఉల్లంఘటనలకై నిర్విరామంగా కృషి చేయడం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి తన కుటుంబ రక్షణకే ప్రధాన ధ్యేయమైతే తక్షణమే రాజీచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, వేముల రామకృష్ణ రాంబాబు, మోడి రాందేవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

నవతెలంగాణ-బంజారాహిల్స్



సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తమవ్వాలనీ, ఆర్థిక లావాదేవీలు జరిపేటప్పుటు ఒకటికి రెండుసార్లు సంస్థ మూలాలను ఖరారు చేసుకోవాలని విపణి గ్రూప్ సీఈఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ సంస్థ విపణి గ్రూప్ పేరును వాడుతూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. బాధితులు తమను సంప్రదించిన తక్షణమే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి నిరుద్యోగంతో బాధపడుతున్న యువతకు తామే ఉపకార వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్న తమ సంస్థ నిరుద్యోగుల నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించదని చెప్పారు. విపణి పేరుతో ఉద్యోగాల్లో కల్పిస్తామని ఫోన్ ల ద్వారా గానీ, మెసేజ్ ల ద్వారా గానీ సంప్రదించే వారికి ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. మోసాలకు పాల్పడుతున్న వారికి తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ కంపెనీ పేరుతో ఇలాంటి ఫేక్ ఆఫర్లు కనిపిస్తే వాటికి స్పందించొద్దని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని యూనివర్సిటీ ఆదుకోవాలి

నవతెలంగాణ-ఓయూ



అబ్దుల్ మోసిన్ ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఆర్ఎస్ హాస్టల్లో వార్డ్ బాయ్‌గా హాస్టల్లో పనిచేస్తూ డ్యూటీ నుంచి తార్నాకకు పనిమీద వెళుతుండగా యాక్సిడెంట్‌లో చనిపోయిన విషయం తెల్సిందే. బౌతికాయాన్ని వాళ్ళ ఇంటికికి యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్, ప్రధాన కార్యదర్శి సీతారాం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావుతో యూనియన్ నాయకులు వెళ్లి అతని కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రగాఢ సానుభూతి తెలియజేసి కాంట్రాక్టర్‌తో మాటాడి అంత్యక్రియలకు ఖర్చుల కోసం వాళ్ళ భార్యకు రూ.10 వేలు అందజేశారు. నాయకులు ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ రావుతో కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా.. సానుకూలంగా స్పందించారు. యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఇటీవల ఓయూ యాజమాన్యం, కాంట్రాక్టర్ కలిసి మోసిన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ చట్టం ప్రకారం మోసిన్ కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను తక్షణమే అందించాలని ఓయూ కమిటీ డిమాండ్ చేస్తున్నది. మోసిన్ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఓయూ అధ్యక్ష. కార్యదర్శులు టి.మహేందర్, సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీను, అనసూయ, శ్యామల, లక్ష్మణ్ గౌడ్, సహాయ కార్యదర్శులు నరేష్, శివ నాగరాజు, లక్ష్మణ, నాగ, స్వప్న, నాగరాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్, బాలకృష్ణ సత్యం, శ్రీను, అంజమ్మ, సుజాత, రాణి, సుఖన్య, స్వప్న, డిమాండ్ చేశారు.

జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు క్రీడా పోటీలు

సిటీబ్యూరో : ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు వివిధ క్రీడలను నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లను పూర్తి చేసింది. రెండు రోజులపాటు జరిగే 8 రకాల క్రీడా పోటీలను ఈ నెల 25న నిర్దేశించిన క్రీడామైదానాల్లో నిర్వహించి, ముగింపు కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. ముఖ్యంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, క్యారమ్స్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఒక్కొక్క క్రీడలను ఒక్కొక మైదానంలో నిర్వహిస్తారు. క్రీడా మైదనాలకు ఒక్కొక్కరిని ఇన్‌చార్జి అధికారులతో పాటు పర్యవేక్షణ అధికారులుగా సంబంధిత డీసీలను జీహెచ్ఎంసీ కమిషనర్ నియమించారు. క్రికెట్ పోటీలు నాగోల్‌లోని ఫతుల్లగూడ డీఆర్ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. కబడ్డీ ఉప్పల్ స్టేడియం, వాలీబాల్ చార్మినార్ ఖులి కుతుబ్ షా స్టేడియం, శేర్లింగంపల్లి జోన్ చందానగర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, ఖైరతాబాద్ జోన్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్స్ క్రీడలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ పాల్గొని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కోరింది.

ధ్వజస్తంభ పునర్ ప్రతిష్టాపన

నవతెలంగాణ-హైదరాబాద్



బోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో శ్రీ సంజీవని హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ పున్ణ ప్రతిష్టాపన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణ మూర్తి, కార్య నిర్వాహక కార్యదర్శి బింగి నవీన్ కుంబాభిషేకం, సామూహిక నిత్యా హెూమం, స్వామి వారి కళ్యాణం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సలహాదారులు పుండరీకం మార్కండేయ, ఉపాధ్యక్షులు మచ్చేందర్ కృష్ణ కోశాధికారి వెంకటేశం సుధాకర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా పరిధిలో మొత్తం 86270 మంది విద్యార్థులకుగాను 83303 మంది విద్యార్థులు హాజరుకగా.. 2967 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సెయింట్ జార్జ్ బాయ్స్ అండ్ గర్ల్స్ కాలేజీలతో పాటు మహబూబియా, అలియా కాలేజీలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న ఉన్నారు. ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు.

వరద కాలువా..? డంపింగ్ యార్డా..?



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వరద కాలువా.. లేక కచరాతో నింపిన డంపింగ్ యార్డా..? అనే అనుమానం కలిగేలా తయారైం కూకట్ పల్లి ప్రశాంత్ నగర్ కోర్టు సమీపంలోని వరద కాలువ పరిస్తితి. పూర్తిగా చెత్తా, చెదారం ప్లాస్టిక్ డబ్బాలు వంటి వ్యర్థాలతో నిండిపోయి వరద నీరు సైతం కనిపించకుండా వ్యర్థాలతో కప్పబడి ఉంది. కాలువకు ఆనుకుని భవన నిర్మాణ వ్యర్థాలు నింపి వరద కాలువ కనిపించకుండా చేస్తున్నారు. ఇది ఇలాగే ఉంటే ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ఎగువ నుంచి వచ్చే వరద నీరు ఎక్కువైతే కాలువ ద్వారా కాకుండా, కాలువ పై నుంచి వరద ప్రవహించే ప్రమాదముంది. కాలువ పరివహకంలో చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఉండటం వల్ల అక్కడి చెత్త పూర్తిగా కాలవలో వేసి చెత్తతో నింపడం వల్లనే వరద కాలువ పూర్తిగా వ్యర్థాలతో నిండి పోతుందనీ, పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల వారు చెత్తను కాలువలో వేయకుండా, సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు వారికి అవగాహన కల్పించి, వరద నీరు పారేందుకు అడ్డంకులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ఆర్ఈసీలో జాతీయస్థాయి వర్క్‌షాప్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అడ్వాన్సస్ ఇన్ సర్వేయింగ్ మెథడ్స్ అండ్ టెక్నిక్స్ పై రెండు రోజులపాటు జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. మొదటి రోజులో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా భారతీయ భూగర్భ సర్వేక్షణ డైరెక్టర్ జనరల్ డా.ఎన్.కుటుంబరావు, ఎన్ఐసీఎంఏఆర్ ప్రొఫెసర్, డీన్ డా.ఇంద్రసేన సింగ్, ఎన్ఐసీఎంఏఆర్ ప్రోగ్రాం డైరెక్టర్ మురళీధర్, నీట్ వరంగల్ ప్రొ.డా.ఎం శశి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు నూతన ఆవిష్కరణలు వైపు ఉండాలన్నారు. సివిల్, మెకానిక్ విభాగాలకు త్వరలోనే పూర్వ వైభవం వస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల కొత్త విషయాలు తెలుసుకుంటారన్నారన్నారు. ఇంద్రసేన సింగ్ మాట్లాడుతూ కేవలం సివిల్ విద్యార్థులే కాకుండా అన్ని విభాగాల విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మురళీధర్ మాట్లాడుతూ ప్రపంచం సాంకేతికంగా ముందుకు దూసుకెళ్తున్న క్రమంలో ప్రతి విద్యార్థి సాంకేతికథపై నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సాంకేతికతను పెరుగుపరుచుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. విద్యార్థి దశ ఎప్పటికప్పుడు అన్వేషణ, నూతన ఆవిష్కరణలు వైపు ఉండాలలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణం మెరుగుపరుచుకుంటూ, గమ్యం చేరేవరకు అలసిపోకుండా కష్టపడితేనే అనుకున్నది చేరుకోగలరన్నారు. నేటి ఈ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే బావి భరత ఇంజినీర్లుగా తయారవ్వాలన్నారు. సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణ తీసుకురావాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులుగా రూపుదిద్దుకునేలా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాథం, కార్యక్రమ కన్వీనర్ సివిల్ విభాగాధిపతి టియల్.రామదాసు, వివిధ విభాగాధిపతులు, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య రీత్యా అండగా నిలుస్తున్న ప్రభుత్వం

నవతెలంగాణ-దుండిగల్



ప్రభుత్వం ప్రజల అభివృద్ధితో పాటు ఆరోగ్య రీత్యా అండగా నిలుస్తుందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ తెలిపారు. దుందిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్ పల్లి 15వ వార్డ్ శ్రీరామ్ కాలనీలో శుక్రవారం రెండో విడత ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వెలుగు కార్యక్రమంను మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణ రావు, కౌన్సిలర్ నర్సింగం భారత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులన్నారు. కంటి పరీక్షలకు వెళ్ళేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డ్ తీసుకువెళ్లాలని కోరారు. కంటి వెలుగు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సంబంధిత వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారనీ, అనంతరం పూర్తి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింగం భారత్ కుమార్, కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, ఆరోగ్య వైద్య మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దియా శ్రీ డిజైన్స్ ఇంటీరియర్స్ అండ్ డెవలపర్స్ ప్రారంభం

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ ప్రగతినగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 'దియా శ్రీ డిజైన్స్ ఇంటీరియర్స్ అండ్ డెవలపర్స్'ను శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలంగాణ స్టేట్ టీటీసీసీ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవ రెడ్డి, స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, కార్పొరేటర్ చిట్ల దివాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, బాలాజీ నాయక్, నాయకులు ఆవుల జగన్ యాదవ్, ఆవుల జగదీష్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, 22వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకర్ గుప్త, మహేందర్ రెడ్డి, దండుగుల స్వామి దశరథ్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సబితా రెడ్డి, నిర్వాహకుడు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం వారంతో ముగిశాయి. మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణా రావు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నందు మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, అనంతరం ఆటపాటలలో వివిధ కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ మహిళా అధికారులు, మహిళా సిబ్బందికి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, కో -ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ మహిళా స్టాఫ్, సిబ్బంది, ఇతర ముఖ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ ఫేస్ -1, శ్రీనివాస్ నగర్ ఫేస్ -2 మెయిన్ రోడ్డులో శుక్రవారం నుంచి కురుస్తున్న కొద్దిపాటి వర్షానికి రోడ్లపై వర్షపు నీళ్ల నిలిచిపోయాయని కాలనీవాసులు తెలపడంతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి వచ్చే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని నూతన స్ట్రామ్ వాటర్ (యూజీడి) లైన్ నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, జహంగీర్, రామచందర్, నరేందర్ రెడ్డి, మల్లేశ్వర్, రాజేందర్, ఈశ్వర్ గౌడ్, గోపాల్ రెడ్డి, సీతారామయ్య, మహేష్, శ్రీను, అశోక్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద స్థలం పరిశీలన

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్లలోని పారిశ్రామికవాడలో మూసివేసిన కోపల్లి ఫార్మా ఆవరణలో గురువారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు మోడీ బిల్డర్‌లో మెడికల్ క్యాంపు

కెమికల్ కంపెనీకి పరిసర ప్రాంతాలైన మోడీ బిల్డర్స్, జనప్రియ అపార్ట్మెంట్స్, అపురూప కాలనీ, ఎస్ ఆర్ నాయక్ నగర్ ప్రాంతాల ప్రజల ఆరోగ్య దృష్ట్యా మల్లారెడ్డి హాస్పిటల్ చైర్మన్ భద్రారెడ్డి సహకారంతో నేడు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్టు కార్పొరేటర్ సురేష్‌రెడ్డి తెలిపారు. సుమారు 540 కుటుంబాలు మోడీ బిల్డర్స్‌లో ఉన్నాయనీ, ఎవరైనా ఎమర్జెన్సీకి గురైతే వెంటనే మల్లారెడ్డి హాస్పిటల్‌లో ఉచితంగా ట్రీట్మెంట్ చేయించుకోవచ్చని సురేష్ రెడ్డి చెప్పారు. సమీప ప్రాంతంలోని బిల్డింగ్‌లకు ఏమైనా నష్టం జరిగితే, కంపెనీ యజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. సురేష్‌రెడ్డి వెంట స్థానిక నాయకులు, మహిళలు, తదితరులు ఉన్నారు.



'కంటి వెలుగు'ను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్

కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డు పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్ 9వ వార్డు కౌన్సిలర్ లావణ్య హన్మంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం వార్డు మున్సిపల్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభి మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. ఇంద్రియాలలో ముఖ్యమైన కంటిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కంటి వెలుగులో కార్యక్రమంలో భాగంగా వార్డులోని ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరం ఉన్న వారు ప్రభుత్వం అందించే కండ్లద్దాలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హన్మంత్ రెడ్డి, మహిళా సంఘాల గ్రామ కో-ఆర్డినేటర్‌లు వంగటి సంతోషి, బండి సంతోషి, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌కు సత్కారం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన కె.నవీన్ కుమార్‌ను ఆయన నివాసం వద్ద వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కర్‌తో కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ సాగర్, శివసాగర్, విద్యాసాగర్, జగదీష్ గౌడ్, రవీందర్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రిలే నిరాహార దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల ఇండస్ట్రియల్‌లో గల సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు 7 నెలల నుంచి వేతనాల్లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 19వ రోజు కంపెనీ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. అసెంబ్లీ వేదికగా కార్మికుల సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. త్వరలోనే మంత్రి కేటీఆర్‌తో సమావేశమై కార్మికుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-మేడ్చల్



గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ రాములు కోరారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో బిల్ కలెక్టర్లతో కలసి పర్యటిస్తూ ఆస్తి పన్నులు వసూలు చేసారు. ఈ సందర్భంగా ఆయన భారీగా పేరుకుపోయిన పాత బకాయిలు, 6వ వార్డు మైసమ్మ గూడ కౌన్సిలర్ చింత పెంటయ్య ఆస్తి పన్ను కూడా వసూలు చేసారు. అనంతరం వార్డు పరిధిలోని వివిధ హాస్టలల్లో భారీగా ఆస్తి పన్నులు పెండింగ్ ఉన్న వాటిని తనిఖీ చేసి పన్ను చెల్లించని హాస్టల్స్‌ను సీజ్ చేసారు. ఆస్తి పన్నులు 100శాతం చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం

నవతెలంగాణ-మేడ్చల్



సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు బాసిరెగడి కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని నవీన్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కు రూ.27,500లను లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి అందించేందుకు తోడ్పాటున అందించిన మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి,వైస్ చెర్మన్ దానమ్మగారి ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మంత్రి మల్లారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

స్ప్రింగ్ సమ్మర్-2023 నూతన కలెక్షన్స్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

అనం మీర్జా సౌండ్ కొత్త కలెక్షన్స్ ప్రారంభించారు. ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా బంజరాహిల్స్ రోడ్డు నెంబర్‌లో 10లో ఉన్న సౌండ్ కలెక్షన్స్‌లో స్ప్రింగ్ సమ్మర్ 2023 నూతన కలెక్షన్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వహకులు మాట్లాడుతూ వైభవ్ షరీఫ్, నిరాలి సంప్రదాయాలు, ఆధునికత సంపూర్ణ కలయికతో ఏర్పాటు చేసిన సౌండ్ బ్రాండ్‌కు ఇది 24వ స్టోర్ అని తెలిపారు. 900 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ డిజైనర్ మహిళల దుస్తుల కోసం ఒక-స్టాప్ గమ్యస్థానంగా ఉంది. స్టోర్ అనేక రకాల కుర్తా సెట్‌లు, ట్యూనిక్స్, డ్రెస్‌లు, చీరలు, లెహంగాలు, మరిన్నింటిని అందిస్తుంది. సమకాలీన స్టోర్ ఆధునిక-రెట్రో విధానాన్ని కలిగి ఉంది. నగరం వారసత్వం, ప్రపంచ బ్రాండ్ తత్వాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్టార్ ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సరికొత్త స్ప్రింగ్ సమ్మర్ 2023 సేకరణ, దేర్ షీ గోస్, కళ, ప్రకృతి సమ్మేళనానికి సంబంధించినది. మన చుట్టూ ఉన్న రంగులు, అడవి నుంచి ప్రేరణ పొంది ఈ సీజన్ ప్రింట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్కర్టులు, టాప్‌లు, డ్రెస్‌లు, జంప్‌సూట్‌లు, సులభమైన ట్యూనిక్ సెట్‌లు, పూల చీరల లైట్ సిల్హౌట్‌ల శ్రేణిలో రూపొందించబడిన బోల్డ్, వైవియస్ రంగుల సంకలనం ఈ దుస్తులు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓన్ పాల్గొన్నారు.

పెన్షనర్ల డిమాండ్లను తీర్చకుంటే పోరాటం ఉధృతం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. హెచ్ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చ రంగయ్య, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి, సీపీఎస్టీయూ హైదరాబాద్ కన్వీనర్ జె.రాఘవరావు, రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎల్.డి.ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కె.శంకర్రావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్షనర్స్ డిమాండ్లు సాధించుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. పెన్సనర్స్ కనీస పెన్షన్ రూ.9 వేల కరువు భత్యంతో ఇవ్వాలన్నారు. వైద్య వసతులు కల్పించాలన్నారు. సీటీటీ నిర్ణయాలు అమలు చేసి 2022 నవంబర్ 4న ఇచ్చిన తీర్పు అందరికీ అమలు చేయాలన్నారు. తాత్కాలిక భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 28 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూకట్‌పల్లి ఏరియా కమిటీ అధ్యక్షులు వి.చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు పెన్సనర్లు, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తెగిన విద్యుత్ తీగలు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

గురువారం కురిసిన అకాల వర్షాల కారణంగా కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని శాంతి నగర్ కాలనీలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ సమాచారాన్ని వెంటనే కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన కరెంట్ తీగలు తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు తెలియజేసి, తెగిపోయిన కరెంట్ తీగలు తొలగింపజేసి మరమ్మత్తులు చేయించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసి సమస్యను పరిష్కరించారు.



బీజేపీని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్తు





(మొదటిపేజీ తరువాయి)

నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని అన్నారు. మోడీ నేతృత్వంలో మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ దోపిడీ కవల పిల్లలుగా అవతరించాయని విమర్శించారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా ఆ ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర చేస్తున్నదని వివరించారు. ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా ఈడీ, సీబీఐ, ఐటీ వంటి రాజ్యాంగ సంస్థలు దాడులు చేస్తున్నాయనీ, హింసిస్తున్నాయని చెప్పారు. ఆదానీ సంస్థ అక్రమాలు దేశంలోనే పెద్దకుంభ కోణ మన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నా ఎందుకు వేయడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పైగా అదానీ తప్పులేదంటూ మోడీ కితాబిస్తున్నారని అన్నారు. గుజరాత్‌లో మోడీకి అదానీ చేసిన సహాయానికి ఇప్పుడు దేశంలోని ఎయిర్ పోర్టులు, ఓడరేవులు, జాతీయ రహదారులను కట్టబెడుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారాలు మోపుతున్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం పన్ను రాయితీలు కల్పిస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలు చేసిన అప్పు రూ.11 లక్షల కోట్లను మాఫీ చేసిందన్నారు. ఈ డబ్బును ప్రజాసంక్షేమానికి విని యోగిస్తే నిరుద్యో గులకు ఉపాధి అవకాశాలు లభించేవని గుర్తు చేశారు. దేశంలో బీజేపీకి వచ్చిన ఓట్లు 37 శాతం, ఇంకా 63 శాతం మంది ప్రజలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారని వివరించారు. గుజరాత్‌లో బీజేపీ గెలిచినా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిందన్నారు. త్రిపురలో పది మంది ఎమ్మెల్యేలు ఓడిపోయారని గుర్తు చేశారు. కనీస మద్దతు ధర కల్పించాలంటూ నాసిక్ నుంచి ముంబయి వరకు కిసాన్ లాంగ్‌మార్చ్ సాగు తున్నదని చెప్పారు. ఉల్లి రైతాంగానికి కిలోకు రూ.రెండు అందుతుంటే, వినియో గదారులకు రూ.15 నుంచి రూ.20 వరకు అమ్ముతు న్నారని అన్నారు. ఒకవైపు రైతు లు, ఇంకోవైపు ప్రజలు మోసపోతున్నారని వివరించారు. మోడీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి గద్దెదించితే ప్రత్యామ్నాయ విధా నాలను అమలు చేయొచ్చని చెప్పారు.



బీజేపీని అడుగుపెట్టనివ్వం : చెరుపల్లి

రాష్ట్రంలో బీజేపీని అడుగుపెట్టనివ్వబోమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. బీజేపీని వ్యతిరేకిస్తున్నందువల్లే బీఆర్ఎస్‌ను సమర్థిస్తున్నామని అన్నారు. ఇంకా గట్టిగా కొట్లాడాలన్నారు. అం దరం కలిసి బీజేపీని నిలువరిం చాలని పిలుపునిచ్చారు.



ప్రభుత్వాలను ప్రశ్నించేందుకే ఈ యాత్ర : జూలకంటి

ప్రజలకు అనేక వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిన ప్రభుత్వాలను ప్రశ్నించడం కోసమే ఈ యాత్ర చేపడుతున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చెప్పారు. కేంద్రం విధానాల మీద యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

అందరం కలిసి ప్రజా ఉద్యమాలను బలపర్చాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ జనచైతన్య యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. గుడిసెవాసుల భూములను క్రమబద్ధీ కరించి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా ఎప్పటికీ పేదల ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలు ఉద్యమాలు చేస్తే, తాము ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి : మల్లులక్ష్మి



మోడీ హయాంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి చెప్పారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి రంగన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, జగదీశ్, నాయకులు వంగూరు రాములు తదితరులు పాల్గొన్నారు.



భూపోరాటాలను ఉధృతం చేస్తాం : జి నాగయ్య



రాష్ట్రంలో భూపో రాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య చెప్పారు. జక్కలొద్దిలో 250 ఎకరాల వరకు మాజీ ఎమ్మెల్యేలు ఆక్రమించారని విమర్శించారు. వాటిని ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. కానీ పేదలు గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగించడం ఎంత వరకు సమంజసమని అడిగారు. గుడిసెవాసులకు పట్టాలిచ్చే వరకు ఎర్రజెండా వారికి అండగా పోరాడుతుందన్నారు.

1,100 కిలోమీటర్ల మేర యాత్ర : పోతినేని



జనచైతన్య యాత్ర 1100కిలోమీటర్లపాటు సాగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 45 చోట్ల బహిరంగ సభలను నిర్వహిస్తామని వివరించారు. వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం సాగిన పోరుగల్లు నుంచి ఈ యాత్రను ప్రారంభిస్తున్నామని అన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా అన్ని శక్తులూ కలిసి పోరాడాలి : తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

చెప్తుందన్నారు. కేసీఆర్, కవిత తప్పు చేస్తే విచారణ చేయొచ్చని అన్నారు. అయితే ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా చేసుకుని విచారణ చేయడం సరైంది కాదన్నారు. అదానీ రూ.17 లక్షల కోట్ల కుంభకోణం చేశారని చెప్పారు. బీజేపీతో అంటకాగుతూ ఎన్ని కోట్ల కుంభకోణం చేసినా వదిలేస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోటి మందికి ఇండ్ల స్థలాలు ఇస్తామనీ, గృహలక్ష్మి కింద రూ.మూడు లక్షలిస్తామనీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్, కేసీఆర్ మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అయినంత మాత్రాన గుడిసెలు పీకేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పేదలకు రక్షణగా ఎర్రజెండా పోరాడుతుందన్నారు. జక్కలొద్దిలో మాజీ ఎమ్మెల్యేలు ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న హైదరాబాద్‌కు రావాలనీ, సీఎం కేసీఆర్‌కు ఇండ్ల స్థలాలివ్వాలంటూ పిటిషన్ ఇద్దామంటూ పేదలకు విజ్ఞప్తి చేశారు.

కలిసే ముందుకు : కూనంనేని

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ పేదలు గుడిసెలు వేసుకోకపోతే అభూమి భూకబ్జాదారుల పాలయ్యేదని చెప్పారు. దాన్ని రక్షించిన పేదలకే ఆ భూమిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జనచైతన్య యాత్రకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈనెల 25 నుంచి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సహా విభజన హామీల అమలుకు యాత్ర చేస్తున్నామనీ, సీపీఐ(ఎం)ను ఆహ్వానిస్తున్నామని అన్నారు.





ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం

ఉగాది కానుకగా రిలీజ్


హౌస్ ఫుల్ మూవీస్, రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రంగ మార్తాండ'. ఇళయరాజా సంగీత సారథ్యంలో ఈ సినిమా ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్ర లిరికల్స్ సాంగ్స్ ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని విశేషంగా ఆకట్టుకున్నాయి. మరాఠీ సూపర్ హిట్ ఎమోషనల్ డ్రామా 'నట్ సామ్రాట్'కి అధికారిక తెలుగు రీమేక్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 22న ఉగాది స్పెషల్‌గా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల కానుంది.

దర్శకుడు కృష్ణవంశీ ఒక తపస్సులా పూర్తి చేసిన ఈ చిత్రం రంగస్థల కళాకారుల జీవితాల చుట్టూ అల్లిన కథతో ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు తమ లోకాన్ని మరచిపోతారు. రాహుల్ సిప్లిగంజ్, శివాని రాజశేఖర్, ఆదర్శ్ బాలకృష్ణ, అలీ రెజ, అనసూయ తదితరులు కీలక పాత్రల్లో మెరవబోతున్నారు.

ఇప్పటికే ఈచిత్రాన్ని చిత్ర పరిశ్రమకి చెందిన పలువురు ప్రముఖులతోపాటు ముఖ్యంగా మహిళా నటీమణులకు ప్రత్యేకంగా ప్రీమియర్స్ వేశారు. చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమా కృష్ణవంశీ కమ్ బ్యాక్ ఫిల్మ్ అని, భావోద్వేగాల సమాహారంగా తీర్చిదిద్దిన ఈ చిత్రంతో మరోమారు కృష్ణవంశీ దర్శక విశ్వరూపాన్ని చూశామని చేసిన ప్రశంసలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సినిమా రిలీజ్‌కి ముందే ప్రీమియర్లతో ప్రముఖుల అభినందనల్ని సొంతం చేసుకున్న ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించడం ఖాయమంటున్నారు మేకర్స్. అంతేకాదు ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమూ అవుతారని చెబుతున్నారు. 'రంగమార్తాండ' సరికొత్త లోకాన్ని చూపించే సినిమా అని, చాలా కాలం తర్వాత కృష్ణవంశీ నుంచి వస్తున్న మరో మంచి సినిమా అని మేకర్స్ దీమా వ్యక్తం చేశారు.

అలాంటి ప్రతి ధనవంతుడూ బికిలీనే..



విజయ్ ఆంటోనీ

'బిచ్చగాడు' మూవీతో తెలుగులో మంచి స్టార్‌డమ్ తెచ్చుకున్న విజయ్ ఆంటోనీ దీనికి సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని తనే నిర్మిస్తూ, డైరెక్ట్ చేయటం విశేషం. అలాగే సంగీతం, ఎడిటింగ్ బాధ్యతలు కూడా ఆయనే నిర్వర్తించడం మరో విశేషం.

'బిచ్చగాడు2' అనే టైటిల్‌తో పాటు 'బికిలి' అనే టైటిల్ కూడా పెట్టారు విజయ్ ఆంటోనీ. అయితే ఈ 'బికిలి' అనే పదానికి అర్థం ఏంటీ అంటూ చాలామంది కన్ఫ్యూజ్ అవుతున్నారు.

వారి కన్ఫ్యూజన్‌ను క్లియర్ చేస్తూ.. బికిలీ అనే పదానికి అర్థం చెబుతూ.. లేటెస్ట్‌గా ఈ మూవీ నుంచి లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు.

'పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన దగ్గరున్న ధనబలంతో వాళ్ల పొట్టను కొట్టి, వాళ్లను బానిసలుగా మార్చి డబ్బుందన్న అహంకారంతో తిరిగేవాడే బికిలీ. వాళ్లను మనం ఏం చేయలేకపోయినా.. బికిలీ అనే పదంతో పిలవొచ్చు. ఈ రోజు నుంచి నేను కనిపెట్టిన ఈ బికిలీ పదం.. భారతదేశంలో వాడకంలోకి వస్తుంది..' అంటూ విజయ్ ఆంటోనీ చెప్పిన మాటలతో మొదలైన వీడియో సాంగ్.. అర్థవంతమైన సాహిత్యంతో సాగింది. ఈ గీతాన్ని కంపోజ్ చేసి, పాడటమే కాదు.. రాసింది కూడా విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఈ సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

నవచిత్రం

ఎన్నో సర్‌ప్రైజ్‌లతో దసరా

నాని నటించిన మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'దసరా'. ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్‌ని పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్ సొంతం చేసుకుంది.సినిమా రన్ టైమ్ 2:36 గంటలుగా లాక్ చేశారు. ఇలాంటి జోనర్ సినిమాలకు ఇది పర్ఫెక్ట్ రన్‌టైమ్. టీజర్, ట్రైలర్‌లో చూసినట్లుగా కథకు భారీ స్పాన్ ఉంది. ఇందులో పల్లెటూరి స్నేహితుల మధ్య అందమైన బాండింగ్, రస్టిక్ లవ్ స్టోరీ, మునుపెన్నడూ లేని విధంగా యాక్షన్, అందరినీ కదిలించే భావోద్వేగాలు ఉన్నాయి. డి-గ్లామరస్‌గా కనిపించే ఛాలెంజింగ్ పాత్రను పోషించారు నాని. అలాగే వెన్నెలగా కీర్తి సురేష్ పాత్ర ఇందులో చాలా సర్ప్రైజింగ్ ఉండబోతుంది. దీక్షిత్ శెట్టి నాని స్నేహితుడిగా, సముద్రఖని పాత్ర కీలకంగా ఉండబోతోంది. సినిమాలోని ప్రతి పాత్రకు తనదైన ప్రాధాన్యత ఉంటుంది. సత్యన్ సూర్యన్ ప్రతి సన్నివేశాన్ని అత్యంత ఆకర్షణీయంగా చిత్రీకరించగా, సంతోష్ నారాయణన్ తన మ్యూజిక్ మాయాజాలంతో సినిమాని మరో స్థాయికి ఎలివేట్ చేశారు. భారీ ఖర్చుతో 22 ఎకరాల్లో సహజమైన పల్లెటూరి వాతావరణం రీక్రియేట్ చేస్తూ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్లా అద్భుతమైన సెట్స్ వేశారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో సినిమాని నిర్మించారు. ట్రైలర్ కేవలం శాంపిల్ మాత్రమే. సినిమాలో చాలా సర్ప్రైజ్‌లు ఉంటాయి' అని చిత్ర బృందం తెలిపింది.



నాని

సరికొత్త కథతో పరారీ



యోగేశ్వర్

యోగేశ్వర్, అతిథి జంటగా సాయిశివాజీ దర్శకత్వంలో జీవివి గిరి నిర్మించిన చిత్రం 'పరారీ'. శ్రీ శంకర ఆర్ట్స్ బ్యానర్ పతాకంపై గాలి ప్రత్యూష సమర్పణలో, నిర్మితమవుతున్న ఈ చిత్రం ఈనెల 30న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతుంది.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్ నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, సుమన్, ప్రసన్న కుమార్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయగా, దర్శకులు చంద్ర మహేష్, నిర్మాత తుమ్మల పల్లి రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణగౌడ్ థియేట్రికల్ ప్రోమోను రిలీజ్ చేశారు. నటి కవిత సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ఇదే వేడుకలో హీరో యోగేశ్వర్ బర్త్ డే సెలెబ్రేషన్‌ను గ్రాండ్‌గా జరిపి చిత్ర బృందం కేక్ కట్ చేసింది.

ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. హీరో యోగేష్ చాలా బాగా నటించాడు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులకు మంచి సినిమా చూశామనే ఫీలింగ్ కలుగుతుంది' అని తెలిపారు. 'చక్రి తమ్ముడు మహిత్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. సుమన్ ఈ మూవీలో మంచి క్యారెక్టర్ చేశారు. ఈ సినిమా మంచి కథ, కథనాలతో అందరిని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత జి.వి.వి.గిరి చెప్పారు.

సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ మాట్లాడుతూ, 'ఇందులో సాంగ్స్ చాలా బాగా వచ్చాయి. ఈ సినిమాతో నాకు మంచి పేరు వస్తుంది' అని తెలిపారు. 'సుమన్‌తో నా మొదటి సినిమాలో నటిస్తానని అనుకోలేదు. ఇంత మంచి సినిమాలో నటించినందుకు ఆనందంగా ఉంది. తప్పకుండా సినిమా విజయం ఖాయం' అని అన్నారు.

తెలుగు, కన్నడలో వైరం



మోనాల్, ప్రణం దేవరాజ్

యువాన్స్ నాయుడు సమర్పణలో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి పిక్చర్, సంస్కృతి ప్రొడక్షన్స్, సర్తాక్ పిక్చర్స్ బ్యానర్స్ పై దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వంలో జె.మల్లికార్జున నిర్మిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వచ్చిన నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ చేతుల మీదుగా శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, బెనర్జీ, కాశీ విశ్వనాథ్ ఈ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ, 'తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరించారు. ఇప్పుడు వస్తున్న నా కొడుకును కూడా అలాగే ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సినిమా టీజర్‌కు కన్నడలో మంచి రెస్పాన్స్ వచ్చింది. తెలుగు టీజర్‌కు కూడా అంతే బాగుందని చెబుతున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

'దర్శకుడు సాయి చెప్పిన కథ నచ్చడంతో ఈ కథను దేవరాజ్‌కి చెప్పాం. మా కథని నమ్మి మాకు అవకాశం ఇచ్చిన దేవరాజ్‌కు, తనయుడు ప్రణం దేవరాజ్‌కు థాంక్స్. ప్రణం ఇందులో బాగా చేశాడు. సినిమా బాగా వచ్చింది' అని నిర్మాత జె.మల్లికార్జున తెలిపారు.

చిత్ర దర్శకుడు సాయి శివన్ జంపాన మాట్లాడుతూ, 'ఇది తెలుగు, కన్నడలో బై లింగ్వల్ సినిమాగా చేశాం. ఇందులో నటించిన వారందరూ చాలా బాగా నటించారు. ఇలాంటి మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత మల్లికార్జునకి ధన్యవాదాలు' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మోడీ ఫాసిస్ట్ కుట్రలను ప్రజలు తిప్పికొడతారు

- ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు దిడ్డి సుధాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ఫాసిస్టు కుట్రలను భారత ప్రజలు తిప్పికొడతారని ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు. భారత స్వాతంత్ర పోరాటంలో బీజేపీ పాత్ర లేదని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా మారి 'విభజించు - పాలించు' విధానానికి మద్దతు పలికారని విమర్శించారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్ర బోస్, సర్దార్ వల్లభాయ్‌పటేల్ లాంటి స్వాతంత్ర సమరయోధుల వారసత్వాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం దుర్మార్గమని తెలిపారు. విప్లవ యోధులు సర్దార్ భగత్‌సింగ్, శివరామ్‌హరి రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్ 92 వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ రూపొందించిన గోడ పత్రికను హైదరాబాద్‌లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సుధాకర్ తోపాటు ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, శోభన్ భూక్యా తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23 న తమ రాష్ట్ర కార్యాలయం నుంచి ఇందిరా పార్క్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులకు నివాళులు అర్పిస్తామని వెల్లడించారు.

ఉన్నతవిద్యారంగంలో తెలంగాణలో సంస్కరణలు భేష్

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరహాలో బలోపేతమవ్వాలి : ఎన్ఐఈపీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ మిశ్రా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు వేగంగా అమలు పరుస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉందని ఉన్నవిద్య, పాలసీ పరిశోధనా సంస్థ(సీపీఆర్‌హెచ్‌ఈ), జాతీయ విద్యాప్రణాళిక, పరిపాలనా సంస్థ(ఎన్ఐఈపీఏ) డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ మిశ్రా ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి స్ఫూర్తితో మిగతా రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత విద్యామండళ్ల సమావేశం జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లకు దిశానిర్దేశం చేయడంతో పాటు వారివారి అభిప్రాయాలు, అనుమానాల నివృత్తి, సలహాలు, సూచనలతో కూడిన న్యూస్ లెటర్‌ను తీసుకొచ్చే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రదీప్‌కుమార్ మిశ్రా ముగింపు సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రగతి నివేదికను చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ వెంకటరమణ నివేదించారు. లింబాద్రి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మహిళలు పెద్దఎత్తున ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల వాస్తవికతను తెలుసుకునే ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1200 ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, 67 ఆశ్రమ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్ షిప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదనీ, ఇప్పటిదాకా ఆరువేల మంది విద్యార్థులు ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విశ్వవిద్యాలయాల అధ్యాపక నియామక బోర్డు బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు వేల్స్, బంగోర్ వర్సిటీలతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయనీ, మోడల్ కరికులమ్, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తున్నామని తెలిపారు. వెంకట రమణ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణల దిశగా కృషి చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నదన్నారు. టీహబ్ లాంటి సంస్థలు వర్సిటీల్లో ఇంకుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా రాష్ట్రాల ప్రతినిధులు కూడా మాట్లాడారు.

మరో ఐదుగురు పీఎఫ్ఐ కార్యకర్తలపై ఎన్ఐఏ చార్జిషీటు దాఖలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపించి ముస్లిం యువతను ఉగ్రవాదం వైపునకు మరలిస్తున్న పీఎఫ్ఐకు చెందిన మరో ఐదుగురు కార్యకర్తలపై ఎన్ఐఏ అధికారులు మరో సప్లిమెంటరీ చార్జిషీటును కోర్టులో దాఖలు చేశారు. తాజాగా సెక్షన్120బీ, 153ఏ తో పాటు పలు ఉగ్రవాద నిరోధక చట్టాల కింద తాజాగా షేక్ అబ్దుల్ రహీం, షేక్ వాహీద్ అలీ, జాఫరుల్లాఖాన్ పఠాన్, షేక్ రియాజ్ అహ్మద్, అబ్దుల్ వారిస్ అనే ఐదుగురు కార్యకర్తలపై ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. గతేడాది జులైలో నిజామాబాద్ జిల్లాలో తొలి సారిగా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) పేరిట ఉగ్రవాద కార్యకలాపాలను సాగిస్తున్నారనే ఆరోపణలపై నిజామాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలలో ఉన్న మొత్తం 11 మంది నిందితులను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఈ కేసును తదుపరి దర్యాప్తు కోసం ఎన్ఐఏకు అప్పగించారు. దర్యాప్తును చేపట్టిన ఎన్ఐఏ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించి పీఎఫ్ఐ ముస్లిం అమాయక యువతను సమీకరించి వారిలో ప్రేరేపిస్తున్న ఉగ్రవాద కార్యకలాపాలు, మత విద్వేష కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వారికి పీఎఫ్ఐ నాయకత్వం ఇస్తున్న ట్రైనింగ్‌ను బయటపెట్టింది. ఈ నేపథ్యంలోనే అరెస్టయిన ఐదుగురు నిందితులపైనా తాజాగా సప్లిమెంటరీ చార్జిషీటును ఎన్ఐఏ దాఖలు చేసినట్టు దర్యాప్తు అధికారులు తెలిపారు.

రైతులు అధైర్య పడొద్దు

నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం : రాష్ట్ర మంత్రులు నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి

- రెండు రోజుల్లో నివేదిక పంపాలని అధికారులకు ఆదేశం
- వికారాబాద్ జిల్లా మర్పల్లిలో పర్యటన
- వడగండ్లతో దెబ్బతిన్న పంటల పరిశీలన



నవతెలంగాణ-మర్పల్లి

వడగండ్ల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలో మంత్రులు పర్యటించారు. మర్పల్లి మండలకేంద్రంతోపాటు కొత్లపురంలో పర్యటించి వడగండ్ల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు, మొక్కజొన్న, ఉల్లి, టమాటా, క్యాబేజీ, జొన్న, కాలిఫ్లవర్, తదితర నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రైతుబంధు మన రాష్ట్రంలోనే ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు చట్టాలను నీరుగార్చి రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. రైతు మరణం తర్వాత ఆ కుటుంబానికి రైతుబీమా ఆసరాగా నిలుస్తుందన్నారు. రెండు రోజుల్లోగా పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక పంపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పర్యటనలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ విజయకుమార్, ఎంపీపీ బట్టు లలిత రమేష్, జడ్పీటీసీ మధుకర్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం బీఆర్ఎస్ ఎంపీల పోరాటం

- రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంతో సమగ్ర అభివృద్ధి
- మహిళా బిల్లుకు ప్రధాని మోడీ చొరవ చూపడం లేదు : రష్యా అధికారిక మీడియా సంస్థ స్పూత్నిక్ ఇంటర్వ్యూలో కవిత



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తమ పార్టీ ఎంపీలు పార్లమెంటులో సైతం పోరాటం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడంలో ప్రధాని మోడీ ఎటువంటి చొరవ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలో రష్యా ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ స్పూత్నిక్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాజకీయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగితేనే దేశం సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. 2014 ఎన్నికల ముందు బీజేపీ మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాత్రం పెడచెవిన పెట్టిందన్నారు. తొలిసారి మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో అప్పటి ప్రధాన మంత్రి దేవేగౌడ పార్లమెంట్లో ప్రవేశపెట్టారనీ, ఆ తర్వాత వచ్చిన ప్రధాన మంత్రులు ఈ బిల్లును ఆమోదించేందుకు ప్రయత్నాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడానికి ఏ మాత్రం చొరవ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించడంలో రాజకీయ చిత్తశుద్ధి అవసరమన్నారు. రిజర్వేషన్ కోటాలో కోటా కావాలని కొన్ని రాజకీయ పార్టీలు అభ్యంతరం పెడుతున్నాయనీ, ఇటువంటి సమస్యలను పరిష్కరించేందుకు తమ పార్టీ కేంద్రానికి సూచనలు ఇచ్చిందని తెలిపారు. కులగణనను చేపట్టి ఓబీసీ జనాభా లెక్కలు తీయాలన్నారు.

జనాభా లెక్కలు అందుబాటులో ఉంటే రిజర్వేషన్ల అమలు సులభతరమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఇంటింటి సర్వే నిర్వహించి కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించామని కవిత గుర్తు చేశారు.

నిద్ర లేకుంటే ఆరోగ్య సమస్యలు

- 'వరల్డ్ స్లీప్ డే థీమ్'లో టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ డ్రైవర్ల నిద్రపై సరైన దష్టి పెట్టాలనీ, లేకుంటే ఆరోగ్యసమస్యలు ఎదుర్కొవలసి వస్తుందని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. నిద్ర ప్రాముఖ్యత, ఆరోగ్య సమస్యలపై డ్రైవర్లకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ నిద్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో 'వరల్డ్ స్లీప్ డే థీమ్'ను ఆయన ఆవిష్కరించారు. సంపూర్ణ ఆరోగ్యానికి కంటి నిండా నిద్ర చాలా అవసరమనీ, అది సక్రమంగా లేకుంటే అలసటతో పాటు ఏకాగ్రత కూడా లోపించి పనిమీద శ్రద్ధ తగ్గుతుందని చెప్పారు.

కోవిడ్ ఉధతి తర్వాత నిద్ర సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతున్నదని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయనీ, ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. స్మార్ట్‌ఫోన్, ఇతర గ్యాడ్జెట్స్‌తో బెడ్‌పై గంటల కొద్దీ గడపొద్దన్నారు. నిద్రసంబంధిత సమస్యలపై ప్రజలు స్వీయ అవగాహన కలిగి ఉండాలన్నారు.

సరిగా నిద్రరాకుంటే ట్యాబ్లెట్లు వేసుకోవడం కొందరికి అలవాటుగా మారిందనీ, వీటివల్ల ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రముఖ స్లీప్ డిజార్డర్ స్పెషలిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ నిద్రలేమి వల్ల కలిగే ఆరోగ్య సమస్యల్ని వివరించారు. వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటామనుకోవడం సరికాదన్నారు. నిద్రలేమి వల్ల హైపర్‌టెన్షన్, గుండె సమస్యలు, డిప్రెషన్ వంటివి వస్తాయన్నారు.

కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) డాక్టర్ వి.రవీందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు పురుషోత్తం, వినోద్‌కుమార్, మునిశేఖర్, సీపీఎం కష్ణకాంత్, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవనప్రసాద్, సీఈఐటీ రాజశేఖర్, సీటీఎం(ఎంఅండ్‌సీ) విజయ్ కుమార్, రంగారెడ్డి ఆర్ఎం శ్రీధర్, న్యూట్రిషియనిస్ట్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలు ఘనం..పనులు శూన్యం

'ఎయిమ్స్' విషయంలో మోడీ సర్కారు తీరు

- బీజేపీ పాలనలో ఇలాంటి సంస్థలు మూడింతలయ్యాయని గొప్పలు
- ఇప్పటికీ ఏ ఒక్క ఇన్‌స్టిట్యూట్ కూడా పూర్తిస్థాయిలో పని చేయని వైనం
- పరిమితంగానే సేవలు..మానవ వనరుల కొరత
- సరిపడా ఫ్యాకల్టీ, వైద్యులు, నర్సులు, మెడికల్ స్టాఫ్ లేక సతమతం
- పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రి సమాచారం

దేశవ్యాప్తంగా ఎయిమ్స్ వంటి సంస్థల ఏర్పాటు విషయంలో మోడీ సర్కారు తీవ్రంగా ప్రచారాలు చేసుకుంటున్నది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో వీటి గురించి చెప్పుకుంటూ రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నది. తమ పాలనలో ఈ ఇన్‌స్టిట్యూట్‌ల సంఖ్య మూడింతలు పెరిగిందని వెల్లడించింది. అయితే ఇప్పటి వరకూ వీటిలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయి సేవలను అందిండం లేదు. సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య మంత్రి ఈ విషయాన్ని పార్లమెంటులో వెల్లడించారు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థల ద్వారా ప్రజలకు ఉపయోగం చేకూరకపోవడంపై ఆరోగ్య నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ : త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటక రాష్ట్రంలో ఇటీవల పర్యటించిన ప్రధాని మోడీ ఎయిమ్స్ అంశాన్ని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం దేశంలో ఏయిమ్స్ లాంటి సంస్థలను మూడు రెట్లు పెంచిందని తెలిపారు. ఈనెల 13న మాండ్యలో పర్యటించిన ఆయన ఒక సభలో ప్రసంగిస్తూ చెప్పారు. దీనిపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సూఖ్ మాండవీయ సైతం ట్వీట్ చేశారు. మోడీ జమానాలో ఎయిమ్స్ వంటి సంస్థలు ఏడు నుంచి 22కు పెరిగాయని పేర్కొన్నారు. అయితే, ఇదే ఆరోగ్య మంత్రి ఎయిమ్స్ వంటి సంస్థల పనితీరు విషయంలో పార్లమెంటులో చేసిన ప్రకటన ఆశ్చర్యం కలిగించక మానదు. 2014లో మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైనఇలాంటి సంస్థల్లో ఇప్పటి వరకు ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో పని చేయటం లేదని బడ్జెట్ సమావేశాల్లో వెల్లడించారు.

పూర్తి స్థాయిలో పని చేస్తున్నవి ఆ ఆరు మాత్రమే

లోక్‌సభలో కేంద్ర ఆరోగ్య మంత్రి వెల్లడించిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పీఎంఎస్ఎస్‌వై) కింద 2014 నుంచి ఏయిమ్స్ వంటి 16 సంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ సంస్థలు 'వివిధ దశల కార్యాచరణ'లో ఉన్నాయి. పరిమిత ఔట్-పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) మరియు ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఐపీడీ) సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పూర్తి స్థాయిలో ఈ సంస్థలు సేవలను అందించటం లేదు. అయితే, మోడీ సర్కారు కేంద్రంలో రావడానికి ముందు దేశంలో ఉన్న భోపాల్, పాట్న, రాయ్‌పూర్, రిషికేశ్, భువనేశ్వర్, జోధ్‌పూర్‌లోని ఎయిమ్స్ లాంటి సంస్థలే పూర్తి స్థాయిలో పని చేస్తుండటం గమనార్హం.

మూడేండ్లు గడిచినా ఓపీడీ, ఐపీడీ సేవలు లేవు

పరిమిత ఓపీడీ, ఐపీడీ సర్వీసులను ప్రభుత్వం నిర్వచించలేదనీ, దీనిపై వివరణ అవసరమని ఆరోగ్య నిపుణులు తెలిపారు. సంస్థలకు సంబంధించిన ప్రస్తుత స్థితి గురించి తెలియాలంటే వీటి ద్వారా సేవలు పొందిన రోగుల గణాంకాలను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందని పబ్లిక్ హెల్త్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గౌరవ ఆచార్యులు కె. శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఎయిమ్స్ గువహతి (అసోం) ఏర్పాటై మూడేండ్లు గడిచిన సందర్భంగా ఇటీవలే వేడుకలు నిర్వహించారు. అయితే ఇందులో ఓపీడీ, ఐపీడీ సేవలేవీ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం ఒక్క క్లినికల్ డిపార్ట్‌మెంట్ కూడా నడవడంలేదు. సదరు సంస్థ వెబ్‌సైట్‌లోనే ఈ విషయం పొందుపర్చబడింది. 2017లో ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ సంస్థ శంఖుస్థాపన జరిగింది.



మానవ వనరులు అసరం

ఈ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటు, నడిపే బాధ్యత కేంద్రానిదే. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీటిలో తమ పాత్ర పోషించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి తన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొనడం గమనార్హం. ఈ సంస్థలు పూర్తిస్థాయిలో పని చేయాలంటే అధ్యాపకలు, రెసిడెంట్ డాక్టర్లు, నర్సులు వంటి మానవ వనరులు కావాలని నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రీసోర్స్ సెంటర్ మాజీ హెడ్ టి. సుందరరామన్ తెలిపారు. ఫ్యాకల్టీ కొరతనే ఈ ఆస్పత్రులు, కాలేజీలల ప్రస్తుత పనితీరుకు కారణమై ఉండొచ్చని శ్రీకాంత్‌రెడ్డి, సుందరరామన్ అన్నారు.

మంజూరైన పోస్టుల్లో కొన్ని మాత్రమే భర్తీ

గతేడాది డిసెంబర్‌లో రాజ్యసభలో కేంద్ర ఆరోగ్య శాక సహాయ మంత్రి భర్తి ప్రవీణ్ ఇచ్చిన సమాధానం ప్రకారం.. ఈ 16 ఇన్‌స్టిట్యూషన్‌లలో ఫ్యాకల్టీ సభ్యుల కొరత ఉండటం గమనార్హం. ఫ్యాకల్టీయేతర పోస్టుల కొరత ఇంకా దారుణంగా ఉన్నది. ఉదాహరణకు.. ఏయిమ్స్ గువహతికి మంజూరైన పోస్టులు 1026కాగా.. 95 పోస్టులు మాత్రమే భర్తీ చేయబడటం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్‌లోని ఎయిమ్స్(మంగళగిరి)కు మంజూరైన 1054 పోస్టులకు గానూ 474 పోస్టులు మాత్రమే భర్తీ కావడం ఇలాంటి సంస్థలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతున్నదని వైద్యారోగ్య నిపుణులు, విశ్లేషకులు అన్నారు. పూర్తి స్థాయిలో పని చేయనీ, సదుపాయాలు లేని ఇలాంటి సంస్థల ఏర్పాటుతో లాభమేమిటని ప్రశ్నించారు.

అప్రతిహతంగా కిసాన్ లాంగ్‌మార్చ్

- ముంబై సరిహద్దులకు చేరిన యాత్ర
- సుదీర్ఘ పోరాటానికి మహారాష్ట్ర రైతులు సిద్ధం



ముంబయి : అకుంఠిత దీక్షతో వేలాదిమంది మహారాష్ట్ర రైతులు నిర్వహిస్తున్న లాంగ్ మార్చ్ ముంబయి సరిహద్దులకు చేరుకుంది. తమ పాదాలకు గాయాలవుతున్నా.. కాళ్ల నుంచి రక్తం కారుతున్నా.. లెక్క చేయకుండా అన్నదాతలు ఉద్యమ స్ఫూర్తితో దాదాపు 250 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేవరకూ సుదీర్ఘ పోరాటం చేసేందుకైనా సిద్ధమని చెబుతున్నారు. ముంబయి సరిహద్దులోని వషీంద్ వద్ద ఉన్న ఈద్గా మైదాన్‌కు రైతులు చేరుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతు ఉద్యమం తరహాలో టెంట్లు వేస్తున్నారు. శుక్రవారానికి 10 టెంట్లు వేశారు. మరిన్ని టెంట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సాంస్కృతిక బృందం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను రైతు నాయకులు వివరిస్తున్నారు. యాత్రలో గిరిజన సంఘాల సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. పాదయాత్ర ప్రతినిధుల బృందంతో మహారాష్ట్ర మంత్రుల బృందంతోపాటు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే కొన్నిసార్లు చర్చలు జరిపారు. రైతుల సంక్షేమానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చెప్పినా రైతులు విశ్వాసం వ్యక్తం చేయడం లేదు. తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి కచ్చితమైన హామీ రావాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించారని అనిపిస్తేనే మహా యాత్రను విరమిస్తామని రైతులు తేల్చిచెబుతున్నారు. 2018లో లాంగ్ మార్చ్ తరువాత తమని ప్రభుత్వం ఎలా మోసం చేసిందో ఇంకా గుర్తుందని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రైతులు హెచ్చరిస్తున్నారు. అధికారులకు ప్రభుత్వం సరైన ఆదేశాలు జారీ చేసేవరకూ ఉద్యమం కొనసాగుతుందని సీపీఐ(ఎం) నాయకులు, మాజీ ఎమ్మెల్యే జెపి గవిత్ తెలిపారు.

పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ చేపట్టాలి

- నిందితులు ప్రవీణ్,రాజశేఖర్ రెడ్డి ప్రాణాలకు ప్రమాదం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు ప్రవీణ్‌కుమార్‌ను ఇంటి వద్ద హౌజ్ అరెస్టు చేశారు. దీంతో ఆయన ఇంట్లోనే దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30లక్షల మంది నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ అంశానికి సంబంధించి నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిల ప్రాణహాని ఉందనీ,అదే జరిగితే.. పేపర్ లీకేజీలో అసలు దోషులు తప్పించుకుంటారని తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బండి సంజయ్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

పరీక్షలు రద్దుచేస్తే సరిపోతుందా? సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పరీక్షలు రద్దుచేస్తే సరిపోదనీ, ప్రతి అభ్యర్థికీ పరీక్షలయ్యే వరకు నిరుద్యోగ భృతిని నెలకు రూ.25,000 చెల్లించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేండ్ల తర్వాత జరుగుతున్న టీఎస్‌పీఎస్‌సీ పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. ఏనాడు లేనంత అధ్వాన్నంగా ఈ పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. 30 లక్షలమంది విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతూ పరీక్షలను రద్దు చేసిందని తెలిపారు. దీనికి కారణమైన సూత్రధారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

స్వప్నలోక్ కాంప్లెక్స్ బాధితులకు పరిహారమివ్వాలి : టీటీడీపీ అధ్యక్షులు

నవతెలంగాణ -హైదరాబాద్

సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందడంపై తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మతి చెందిన వారికి సంతాపం, కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను కాపాడేందుకు అవసరమైన అన్నిరకాల వైద్యసేవలను అందించాలని కోరారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై తక్షణమే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతుల కుటుంబాలకు తక్షణమే రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలనీ, పక్కా ఇండ్లు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న కారణంగా ఎంతో మంది మరణించడం బాధాకరమన్నారు. ఇలాంటి అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సంబందిత శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికలతో సంయుక్తంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బండి అరెస్టును ఖండిస్తున్నాం : తరుణ్‌చుగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని శాంతియుత నిరసన చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ కార్యకర్తలపైనా, మీడియా ప్రతినిధులపైనా పోలీసులు లాఠీచార్జికి పాల్పడటం దుర్మార్గమని పేర్కొన్నారు. దోషులను శిక్షించే వరకు ఉద్యోగార్థులు, నిరుద్యోగుల తరఫున తాము పోరాటం చేస్తామని తెలిపారు. కేసీఆర్ కుటుంబ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ డ్రైవింగ్ పోస్టుల పరీక్షలు వాయిదా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో ఈ నెల 17న రెండ్రోజుల పాటు జరగనున్న కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల పరీక్షలు వాయిదావేసినట్టు టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఈనెల 17, 18 తేదీలలో రెండ్రోజుల పాటు సాగనున్న ఈ పరీక్షలను ఈ నెల 23, 24 తేదీలకు మార్పు చేసినట్టు ఆయన చెప్పారు. గతంలో జారీ చేసిన ఎంట్రీ కార్డులనే వెంట తీసుకురావాలని అభ్యర్థులకు సూచించారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోండి

- కిరాతక హత్యలపై ఐద్వా ఆందోళన

న్యూఢిల్లీ : కాశ్మీర్‌లోని బుద్గామ్‌లో యువతిని దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అందుకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ నెల 7న అరిఫా జాన్ కోచింగ్ క్లాస్‌కు వెళ్లిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణలో బుద్గామ్‌కి చెందిన షబీర్ అహ్మద్ వనీ ఆమెను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా నరికి, వేర్వేరు చోట్ల పాతిపెట్టినట్లు తేలింది. ఇటీవల అనేకమంది మహిళలు ఇలానే దారుణంగా హత్యకు గురవుతున్నారని ఐద్వా పేర్కొంది. దీనిని నిరసిస్తూ స్థానికులు ప్రదర్శనలు నిర్వహించారు. కాశ్మీర్ మహిళా సమాఖ్యకు చెందిన ప్రతినిధి బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. ఈ కిరాతక హత్యను తీవ్రంగా ఖండించింది. ఇటువంటి హేయమైన నేరానికి పాల్పడినవారికి కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. మహిళల కిడ్నాప్‌లు, అత్యాచారాలు, అనూహ్యమైన రీతిలో హత్య చేయడం వంటి నేరాలు చాలా ఎక్కువైపోతున్నాయని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించింది. బాధిత కుటుంబానికి సరైన రక్షణ కల్పించి, హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది.

మైనారిటీలపై దాడులకు ఖండన

వేధింపులు, బెదిరింపులకు పాల్పడే లక్ష్యంతో మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని, వారిపై దాడులకు దిగడం పట్ల ఐద్వా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహారాష్ట్రలో చోటు చేసుకున్న మత విద్వేషాన్ని తీవ్రంగా ఖండించింది. రెచ్చగొట్టే ప్రసంగాల ద్వారా విద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు గతేడాది డిసెంబరు నుంచి మహారాష్ట్రలో సంఘపరివార్‌కి చెందిన కొంతమంది ప్రయత్నిస్తున్నారు. లవ్ జిహాద్, గో హత్యలు వంటి అంశాలను మైనారిటీ వర్గానికి ముడిపెట్టి వారిని హత్య చేయాలని పిలుపులిస్తున్నారు. ఈ ప్రసంగాలతో మైనారిటీలపై హింస, వివక్ష పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం ఇదంతా చూస్తూ మౌనంగా వూరుకుంటోందని ఐద్వా విమర్శించింది. ఈ విద్వేష ప్రచారాన్ని అన్ని వర్గాల ప్రజలు ప్రతిఘటించాలని కోరింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా శాంతి భద్రతల యంత్రాంగాన్ని కోరింది.

గిరిజనులపై తూటా!

విద్యార్థిని హత్యపై ఆందోళన

- పోలీసు కాల్పుల్లో మరో విద్యార్థి బలి



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో గిరిజన విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారని ఆరోపిస్తూ గిరిజనులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వారికి న్యాయం చేయడానికి బదులు పోలీసులు కాల్పులు జరిపి, మరో గిరిజన విద్యార్థిని బలిగొన్నారు. మరో కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇండోర్‌లోని మౌ వద్ద ఈ దారుణం జరిగింది. రాష్ట్రంలోని ఖర్గోన్ జిల్లా మండ్లెశ్వర్‌కు చెందిన 22 ఏళ్ల విద్యార్థిని గురువారం అనుమానాస్పద స్థితిలో మరణించింది. మౌకు చెందిన యదునందన్ పాటీదార్, మరికొంతమంది విద్యార్థినిని అపహరించి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. నేరస్తులకు పోలీసులు అండగా ఉంటున్నారని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని విమర్శిస్తూ మౌలో విద్యార్థిని మృతదేహంతో గురువారం రోడ్డుపై ఆందోళనకు దిగారు.

వారిపై టియర్ గ్యాస్, లాఠీలు ఉపయోగించి చెదరగొట్టడంతోపాటు, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. తరువాత అంత్య క్రియలు నిర్వహించారు. పోలీసు చర్యతో మరింత ఆగ్రహానికి గురైన సుమారు 500 మంది గిరిజనులు, విద్యార్థులు గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో మరోసారి మౌ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. వారిపై పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 18 ఏళ్ల విద్యార్థి బెరూలాల్ మృతి చెందాడు. అటుగా వెళ్తున్న ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు.

అట్టుడికిన అసెంబ్లీ

పోలీసులు కాల్పుల అంశం శుక్రవారం మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలను కుదిపివేసింది. ఉత్తర ప్రదేశ్‌లో హత్రాస్ ఘటనలో మాదిరిగానే ఇక్కడ కూడా నేరస్తులకు వంతపాడుతూ, మృతదేహానికి బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించారని కాంగ్రెస్ విమర్శించింది. విద్యార్థిని ఛాతీలో ఎందుకు కాల్చారని ప్రశ్నించింది. యువతికి, నిందితుడికి పరిచయం ఉందని, వేడినీటిని మరిగిస్తుండగా విద్యుత్ షాక్‌తో మరణించిందని కూడా చెబుతున్నారని హోం మంత్రి అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ఈ విషయంపై ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

పార్లమెంటు ఆమోదం లేకుండానే పెన్షన్ కోతలు

- మాక్రాన్ ప్రభుత్వ చర్యపై ఫ్రాన్స్ అంతటా నిరసనలు



పారిస్: ఫ్రెంచ్ పార్లమెంటు ఆమోదం లేకుండానే అధ్యక్షుడు ఇమ్మానియెల్ మాక్రాన్ పెన్షన్ కోతలను విధించడంతో దేశమంతటా నిరసన జ్వాలలు వ్యాపించాయి. పింఛను పై కోతలు విధిస్తున్నట్లు ప్రధాన మంత్రి ఎలిజబెత్ బోర్న్ ప్రకటించడంతో ప్రధాన నగరాల్లో గురువారం రాత్రి నుంచే పెద్దయెత్తున నిరసనలు మొదలయ్యాయి. నిరసనకారులను అణచివేసేందుకు మాక్రాన్ ప్రభుత్వం ప్రయత్నించడంతో ఘర్షణలు చెలరేగాయి. మాక్రాన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, ప్రజల అభీష్టాన్ని తుంగలో తొక్కుతోందని కార్మికవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫ్రెంచ్ ప్రజలలో మూడొంతుల మంది పెన్షన్ కోతలను వ్యతిరేకిస్తున్నా మాక్రాన్ పట్టించుకోడం లేదు. కోతలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసన సమ్మెలు రెండు నెలలుగా కొనసాగుతున్నాయి.

పన్నుల పెంపును నిరసిస్తూ శ్రీలంక కార్మికుల సమ్మె

కొలంబో : బెయిలవుట్ కోసం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విధించిన షరతుల్లో భాగంగా శ్రీలంకలో పన్నులను విపరీతంగా పెంచడాన్ని నిరసిస్తూ 40కి పైగా కార్మిక సంఘాలకు చెందిన వేలాదిమంది కార్మికులు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. రైల్వే, ఆస్పత్రులు, పాఠశాలలు, ఓడరేవులు ఇలా ప్రభుత్వ రంగానికి చెందిన వేలాదిమంది కార్మికులు సంపూర్ణంగా సమ్మె చేశారు. ఆదాయ పన్ను, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచడాన్ని వారు తీవ్రంగా నిరసించారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో ఆందోళనల్లో పాల్గొనకుండా తమని ప్రభుత్వం అడ్డగించలేదని కార్మికులు పేర్కొన్నారు. గతంలో అత్యవసర చట్టాల ద్వారా అన్ని రకాల సమ్మెలను ప్రభుత్వం నిషేధించింది. రణిల్ విక్రమసింఘె ప్రభుత్వ అణచివేత చర్యలను, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారని కార్మిక సంఘ నేత వసంత సమరసింఘా తెలిపారు.

రాష్ట్రపతికి పౌర సన్మానం

- కుటుంబశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరించిన ముర్ము

తిరువనంతపురం : ప్రసుత్తం కేరళ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శుక్రవారం రాత్రి పినరయి విజయన్ ప్రభుత్వం పౌర సన్మానం నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ ఏడాది రిపబ్లిడే వేడుకల్లో 'నారీ శక్తి' పేరుతో కేరళ ప్రభుత్వం రూపొందించిన శకటం చూసి తాను చాలా ఆనంద పడ్డానని తెలిపారు. గిరిజనులకు ఉద్యోగాలు కల్పించే 'ఉన్నతి' పథకాన్ని ముర్ము ప్రారంభించారు. కేరళలో మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన కార్యక్రమం కుటుంబశ్రీ చరిత్రను వివరించే పుస్తకాన్ని రాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎం విజయన్, గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లైనా పట్టించుకోరా?

- పెండింగ్ హామీలపై ఇకనైనా దృష్టి
- పోలవరానికి రూ.10 వేల కోట్లు ఇవ్వాలి
- మోడీ, అమిత్‌షాతో జగన్ భేటీ

న్యూఢిల్లీ : "రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లైనా ఇప్పటి వరకు రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన చాలా ద్వైపాక్షిక అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిపై వెంటనే దృష్టి సారించాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోరారు. పార్లమెంట్‌లోని ప్రధాన మంత్రి కార్యాలయంలో ప్రధాని మోడీతో సిఎం ఏకాంతంగా భేటీ అయ్యారు. దాదాపు 35 నిమిషాల పాటు భేటీ సాగింది. అనంతరం సిఎం జగన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సుమారు 30 నిమిషాలపాటు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానితో ఆయన చర్చించారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై కేంద్రం ఆర్థికశాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేసినప్పటికీ, కీలక అంశాలన్నీ ఇంకా పెండింగులోనే ఉన్నాయని తెలిపారు. 2014-15 నాటి రెవెన్యూ లోటు కింద పెండింగ్‌లో ఉన్న రూ.36,625 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సిఎం కోరారు. రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2,600.74 కోట్లు రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు అంచనాలను సాంకేతిక సలహా కమిటీ నిర్ధారించిన రూ.55,548 కోట్లను వెంటనే ఆమోదించాలని కోరారు. తాగునీటి సరఫరా అంశాన్ని కూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్ వారీగా నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని, ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతుందని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లారు. నగదు బదిలీ (డిబిటి) పద్ధతిలో ముంపు బాధితులకు పరిహారమందిస్తే జాప్యాన్ని నివారించవచ్చని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహక్‌గా రూ.10వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతుబద్ధత పాటించకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. దీనివల్ల పిఎంజికెఎవై కార్యక్రమం కిందకు రాని 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా రేషన్ ఇవ్వడం వల్ల దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తి సరైనదేనని నీతి ఆయోగ్ కూడా అభిప్రాయపడిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు ఖనిజ కొరత లేకుండా ఎపిఎండిసికి గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



గెలిపించిన రాహుల్, జడేజా

పేసర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్ ● మిచెల్ మార్ష్ అర్ధసెంచరీ
తొలి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



కేఎల్ రాహుల్ 75(నాటౌట్) పరుగులు

ముంబయి: వాంఖడే వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ జట్టు భారత పేసర్ల ధాటికి 188పరుగులకే ఆలౌట్ కాగా.. ఛేదనలో భారతజట్టు ఐదు వికెట్లు కోల్పోయి 191పరుగులు చేసి గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ హెడ్(5) నిరాశపరిచినా.. కెప్టెన్ స్మిత్, మిఛెల్ మార్ష్ కలిసి 2వ వికెట్‌కు 72పరుగులు జతచేశారు. ఆ తర్వాత స్మిత్(22) ఔటైనా.. మిచెల్ మార్ష్(81) ధాటిగా ఆడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో ఆస్ట్రేలియా జట్టు ఓ దశలో 4వికెట్ల నష్టానికి 169పరుగులు భారీస్కోర్ చేసేలా కనిపించింది. ఆసీస్ జట్టు 19పరుగుల వ్యత్యాసం లో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. మిచెల్ మార్ష్ టాప్ స్కోరర్. భారత బౌలర్లలో షమీ, సిరాజ్ కు మూడేసి, జడేజాకు రెండు, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యా తలా ఒక వికెట్ దక్కాయి.

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా టాపార్డర్ ఘోరంగా విఫలమైంది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (3)ను స్టొయినిస్ ఔట్ చేయగా.. తర్వాత విరాట్ కోహ్లీ(4), సూర్యకుమార్(0)ను వరుస బంతుల్లో స్టార్క్ ఔట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టాడు. ఆ దశలో క్రీజ్‌లో కుదురుకుని ఆడిన శుభమన్ గిల్(20)ను కూడా స్టార్క్ ఔట్ చేశాడు. దీంతో భారతజట్టు 39పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్య(25)తో కలిసి కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. కానీ, కీలక సమయంలో హార్దిక్ ఔట్ కావడంతో భారత్ 83పరుగులవద్ద ఐదో వికెట్‌ను చేజార్చుకుంది. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ జడేజా-రాహుల్ కలిసి 6వ వికెట్‌కు 108 పరుగులు జతచేసి మ్యాచ్ ముగించారు. కేఎల్ రాహుల్ (75నాటౌట్), రవీంద్ర జడేజా (45నాటౌట్) కీలక పరుగులు చేశారు. దీంతో భారత్ 39.5ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 191పరుగులు చేసి గెలిచింది. ఆసీస్ బౌలర్లు స్టార్క్‌కు మూడు, స్టొయినీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలువగా.. రెండో వన్డే విశాఖ వేదికగా ఆదివారం(19న) జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జడేజాకు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి)సిరాజ్ 5, మిఛెల్ మార్ష్ (సి)సిరాజ్ (బి)జడేజా 81, స్మిత్ (సి)రాహుల్ (బి)హార్దిక్ 22, లబూషేన్ (సి)జడేజా (బి)కుల్దీప్ 15, ఇంగ్లిస్ (బి)షమీ 26, గ్రీన్ (బి)షమీ 12, మ్యాక్స్‌వెల్ (సి)హార్దిక్ (బి)జడేజా 8, స్టోయినీస్ (సి)శుభ్‌మన్ (బి)షమీ 5, అబట్ (సి)శుభ్‌మన్ (బి)సిరాజ్ 0, స్టార్క్ (నాటౌట్) 4, జంపా (సి)రాహుల్ (బి)సిరాజ్ 0, అదనం 10. (35.4ఓవర్లలో ఆలౌట్) 188పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/77, 3/129, 4/139, 5/169, 6/174, 7/184, 8/184, 9/188, 10/188 **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, హార్దిక్ 5-0-29-1, శార్దూల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్‌బి) స్టొయినీస్ 3, శుభ్‌మన్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 20, కోహ్లి (ఎల్‌బి) 4, సూర్యకుమార్ (ఎల్‌బి)స్టార్క్ 0, కేఎల్ రాహుల్ (నాటౌట్) 75, హార్దిక్ పాండ్యా (సి)గ్రీన్ (బి)స్టొయినీస్ 25, జడేజా (నాటౌట్) 45, అదనం 19. (39.5ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 191పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/16, 3/16, 4/39, 5/83 **బౌలింగ్:** స్టార్క్ 9.5-0-49-3, స్టొయినీస్ 7-1-27-2, అబట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0

సెమీస్‌కు త్రీసా-గాయత్రి

సింగిల్స్‌లో ముగిసిన పోరు



లండన్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత యువ జంట సంచలన నమోదు చేయగా.. పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట 21-14, 18-21, 21-12తో చైనాకు చెందిన టాప్‌సీడ్ లీ-లూలపై పోరాడి నెగ్గారు. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న 17వ ర్యాంకర్ త్రీసా-గాయత్రి.. రెండో గేమ్‌లో పోరాడి ఓడారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్ మొదటినుంచే మెరుగైన ప్రదర్శనను కనబరిచారు. మ్యాచ్ ముగించేందుకు భారతజోడీ సుమారు 64నిమిషాలసేపు పోరాడాల్సి వచ్చింది. సెమీస్‌లో భారత జోడీ కొరియాకు చెందిన లీ-బెక్‌లతో తలపడనున్నారు. త్రీసా-గాయత్రి జంట వరుసగా రెండోసారి ఈ టోర్నీలో సెమీస్‌లోకి ప్రవేశించారు. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. గురువారం రాత్రి జరిగిన పోటీల్లో కిదాంబి శ్రీకాంత్ 17-21, 15-21తో నరోకా(జపాన్) చేతిలో, లక్ష్యసేన్ 13-21, 15-21తో ఆంటోన్సెన్(డెన్మార్క్) చేతిలో ఓడారు. ఇక హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ 20-22, 21-15, 17-21తో హోరాహోరీ పోరులో గింటింగ్(ఇండోనేషియా) చేతిలో ఓడాడు.

అంతర్జాతీయ క్రికెట్‌కు టిమ్ పైన్ గుడ్‌బై



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ టిమ్ పైన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. బెల్లెరివ్ ఓవల్‌లో క్వీన్స్‌లాండ్‌తో జరిగిన టాస్మానియా షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ డ్రాగా ముగిసిన తర్వాత పైన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. స్టీవ్ స్మిత్ తర్వాత ఆస్ట్రేలియా టెస్టు జట్టుకు 46వ కెప్టెన్‌గా వ్యవ హరించాడు. 2018నుంచి ఆసీస్ టెస్ట్ జట్టుకు మూడేళ్ల కెప్టెన్‌గా కొనసాగాడు. ఆస్ట్రేలియా తరఫున 23 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించిన 38ఏళ్ల టిమ్ పైన్ మొత్తం 35 టెస్టులు ఆడా డు. వికెట్ కీపర్‌గా 157మందిని ఔట్ చేశాడు.

ఏపీ సర్కారుకు పట్టభద్రుల సెగ

- ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమలో టిడిపికి భారీ అధిక్యత
- పశ్చిమ రాయలసీమలో హోరాహోరీ

అమరావతి : శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన ఎదురుగాలి వీచింది. ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమల్లో కడపటి వార్తలందేసరికి టిడిపి అభ్యర్థులు భారీ ఆధిక్యతలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమలో ఆ రెండు పార్టీల మధ్య హోరాహోరీ నెలకొంది. తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోని 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. కాగా, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల్లోనూ వైసిపి గెలుపొందింది. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయానికి చేరువలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఆయనకు 82,977 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లతో రెండు స్థానంలో ఉన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మేజిక్ ఫిగర్ ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రయార్టీ ఓట్లను లెక్కిస్తున్నారు. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ సహా 2,13,035 పోలయ్యాయి. వీటిలో 12,318 ఓట్లు చెల్లలేదు. మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్‌కు 10,884 ఓట్లు మాత్రమే వచ్చాయి.

తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు) శాసన మండల పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి భారీ ఆధిక్యతలో ఉన్నారు. ఆయనకు 1,12,514కు ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి 85,252 ఓట్లు పోలయ్యాయి. పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి 38,001 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి 6,341 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ నియోజక వర్గంలో 2,69,339 పోలయ్యాయి. వీటిలో 20,979 ఓట్లు చెల్లలేదు. ఇక్కడ 22 మంది పోటీ చేశారు. ఏ అభ్యర్థికీ మేజిక్ రాకపోవంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు.పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య నువ్వా... నేనా అన్నట్టుగా వస్తున్న ఫలితాలు ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి. మొత్తం 2,44,307 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 15,104 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 1,92,018 ఓట్లు లెక్కించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎనిమిది రౌండ్లు పూర్తయ్యే సరిగా వైసిపి అభ్యర్థి వెన్నపూస గోపాలరెడ్డికి 74,678 ఓట్లు, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి 73,229 ఓట్లు వచ్చాయి. 1449 ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి ఉన్నారు. పిడిపి అభ్యర్థి పోతుల నాగరాజుకు 15,254 ఓట్లు వచ్చాయి.

ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో వైసిపి గెలుపు



రామచంద్రారెడ్డి



చంద్రశేఖర్ రెడ్డి

రాష్ట్రంలోని రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ స్వల్ప ఆధిక్యతతో వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల వరకూ కొనసాగింది. తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వైసిపి అభ్యర్థి పర్వత చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. ఆయనకు పిడిఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మేజిక్ ఫింగర్ ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో 1043 ఓట్ల ఆధికత్యను చంద్రశేఖర్‌రెడ్డి సాధించారు. మొత్తం 24,291 ఓట్లకుగానూ ఆయను 11,714 ఓట్లు, బాబురెడ్డికి 10,671 ఓట్లు వచ్చాయి. 1906 ఓట్లు చెల్లలేదు. మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు) ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా వైసిపి అభ్యర్థి ఎంవి.రామచంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యతతో గెలుపొందారు. ఆయనకు ఎపిటిఎఫ్ మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఒంటేరి శ్రీనివాసరెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతలో ఎంవి.రామచంద్రారెడ్డికి ఆధికత్య సాధించనప్పటికీ మేజిక్ ఫిగర్ సాధించలేకపోయారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో శ్రీనివాసరెడ్డి పుంజుకున్నారు. దీంతో, ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరికి 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. ఆయనకు 10,787 ఓట్లు వచ్చాయి. శ్రీనివాసరెడ్డికి 10618 ఓట్లు తెచ్చుకున్నారు. ఇద్దరిలోనూ ఎవరికి 50 శాతానికిపైగా ఓట్లు రానప్పటికీ ఎలిమినేషన్ పూర్తయ్యే సమయానికి అత్యధిక ఓట్లు కలిగిన ఎంవి.రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించారు. పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి 4,162 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డికి 3212, జి.వి.నారాయణరెడ్డికి 1345 ఓట్లు వచ్చాయి. మొత్తం 25,879 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 608 ఓట్లు చెల్లలేదు. 25,271 ఓట్లను వాలిడ్‌గా గుర్తించారు.

సిజెఐపై ట్రోలింగ్ ఆపండి

న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌ను సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడంపై తక్షణమే చర్య తీసుకోవాలని కోరుతూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. గత ప్రభుత్వ ఏర్పాటు సమయంలో మహారాష్ట్రలో గవర్నర్ పాత్రకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఈ ట్రోలింగ్ జరుగుతోంది. "ఇటువంటి ఆన్‌లైన్ ట్రోలింగ్, న్యాయానికి సంబంధించిన కార్యాచరణలో దారుణంగా జోక్యం చేసుకోవడమే" అని రాష్ట్రపతికి రాసిన లేఖలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు వివేక్ థంకా పేర్కొన్నారు. దోషులపై తక్షణమే చర్య తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఆయనకు పలువురు ప్రతిపక్ష ఎంపీలు మద్దతిచ్చారు. కాంగ్రెస్ సభ్యులు దిగ్విజయ్ సింగ్, ప్రమోద్ తివారి, శక్తిసిన్హ్ గోహిల్, అఖిలేష్ ప్రసాద్ సింగ్, అమీ యాగ్నిక్, రంజిత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, శివసేన (యుబిటి) సభ్యులు ప్రియాంక చతుర్వేది, ఆప్‌కి చెందిన రాఘవ చద్దా, ఎస్‌పికి చెందిన రామ్ గోపాల్ యాదవ్, జయ బచ్చన్ మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.

ఈ లేఖ ప్రతిని న్యాయ శాఖ మంత్రికి, ఐటి శాఖ మంత్రికి, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కి పంపారు. భారత అటార్నీ జనరల్‌కు కూడా ఇదే అంశంపై వారు ఫిర్యాదు చేశారు. ట్రోలింగ్‌కు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని థంకా డిమాండ్ చేశారు. న్యాయ యంత్రాంగాన్ని, భారత న్యాయమూర్తిని అప్రతిష్టపాల్జేసేలా ట్రోల్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆ లేఖలో వారు కోరారు.మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటు, గవర్నర్ పాత్ర విషయంలో కీలకమైన రాజ్యాంగపరమైన అంశాలపై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తన వైఖరిని స్పష్టం చేసింది. టోలర్లు గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేయడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మహారాష్ట్రలో పాలక పార్టీ ప్రయోజనాల పట్ల సానుభూతి చూపే ట్రోల్ ఆర్మీ చేసే ఈ ట్రోలింగ్స్‌కు సామాజిక మాధ్యమాల్లో లక్షలాది వ్యూస్ వస్తున్నాయి. ఆ ట్రోలింగ్‌లో వాడే మాటలు, ఇతర సమాచారం అత్యంత దుర్భరంగా వున్నాయి. న్యాయస్థానం పరిధిలో వున్న అంశంపై ఇలా మాట్లాడుతున్నారంటే అటువంటి వారికి కచ్చితంగా పాలక పార్టీ మద్దతు, తోడ్పాటు వుంటుందని ఆ లేఖ పేర్కొంది.